సంపూర్ణ నీతిచంద్రిక

విద్వాన్ బులుసు సీతారామశాస్త్రి

సంపూర్ణ నీతిచంద్రిక

విద్వాన్ బులుసు సీతారామశాస్త్రి

సంపూర్ణ నీతిచంద్రిక

[ప్రథమ, ద్వితీయ భాగములు]

మిత్రలాభము - మిత్రభేదము - విగ్రహము - సంధి

విద్వాన్ బులుసు సీతారామశాస్త్రి

పబ్లిషర్సు: అద్దేపల్లి అండ్ కొ
సరస్వతీ పవర్ ప్రెస్
రాజమహేంద్రవరము

అన్ని హక్కులు
ప్రకాశకులవి

ప్రథమ ముద్రణము
1955

ఒక రూపాయి

విషయసూచిక

		పుట
	ఉపోద్ఘాతము	1
	మిత్రలాభము:	
1.	చిత్రగ్రీవుఁడను కపోతరాజు వృత్తాంతము	5
2.	కంకణమున కాసించి పులిచేఁ జంపబడిన బాటసారి కథ	6
3.	హిరణ్యకుఁడు పావురములకు మేలుసేయుట	11
4.	లఘుపతనక మనెడి వాయసము హిరణ్యకుని చెలిమిఁగోరుట	14
5.	నక్క కపటపు మాటలచే వంచింపబడిన లేడి కథ	15
6.	మార్జాలమునకుఁ జోటిచ్చి దానివలన మరణించిన జరద్గవ మను గ్రద్ద కథ	17
7.	నూవుల బ్రాహ్మణి కథ	29
8.	అతిసంపాదనేచ్ఛచే వింటిదెబ్బ తగిలి మరణించిన నక్క కథ	34
9.	చిత్రాంగుని చేరిక	38
10.	దూరాలోచన లేక ముంగిసను జంపి విచారించిన బ్రాహ్మణుని కథ	40
11.	సోమశర్మ తండ్రి కథ	41
	మిత్రభేదము:	
1.	మేకును బెఱికి మరణించిన కోతి కథ	54
2.	పరుల యధికారము మీఁదఁబెట్టుకొని మరణించిన గాడిద కథ	55
3.	దమనకుఁడు పింగళకుం జేరుట	61
4.	పొలికలని యందలి నక్క కథ	65
5.	సింహము పనియంతయు నెఱవేర్చి చెడిన పిల్లి కథ	67
6.	సంజీవకుఁడు మంత్రియుఁ, గరటక దమనకులు కోశాధికారులు నగుట	71
7.	స్తబ్ధకర్ణుని రాక - సంజీవకుఁడు కోశాధికారి యగుట	71

8.	కరటక దమనకుల విషాదము - పన్నుగడ	75
9.	స్వయంకృతాపరాధము వలన జెడిన రాజకుమారుని కథ	75
10.	స్వయంకృతాపరాధము వలన జెడిన సన్న్యాసి కథ	77
11.	సన్న్యాసిని మోసగించిన యాషాఢభూతి కథ	78
12.	ఉపాయముచేఁ ద్రాచుఁబామును జంపిన కాకి కథ	81
13.	బుద్ధిబలమున సింహముం జంపిన కుందేటి కథ	82
14.	దమనకుఁడు పింగళకుని మనసు విఱచుట	85
15.	తీతువు సముద్రుని సాధించిన కథ	89
16.	దమనకుఁడు సంజీవకునకు దుర్బోధ చేయుట	91
17.	సంజీవకుని వధ	97
	విగ్రహము:	
1.	హిరణ్యగర్భుని వృత్తాంతము	1
2.	వానరములకుఁ బోధచేసి చెడిన పక్షుల కథ	3
3.	వాగ్దోషము వలనఁ జెడిన గాడిద కథ	5
4.	చంద్రుని పేరుచెప్పుకొని మేలొందిన కుందేళ్ళ కథ	7
5.	దీర్ఘముఖుండు చిత్రవర్ణుని దర్శించుట	10
6.	కాక స్నేహమున మరణించిన హంస కథ	12
7.	కాక స్నేహమువలనఁ జనిపోయిన వర్తకపక్షి కథ	13
8.	చిలుక రాయబారము	15
9.	హిరణ్యగర్భుడు మేఘవర్ణుని గొలువునఁ జేర్చుకొనుట	19
10.	ఆత్మపక్షము విడిచి పరపక్షముఁ జేరి మరణించిన నక్క కథ	19
11.	చోర బ్రహ్మరాక్షసులు కలహించుకొని యింటి యజమానునకు మేలు చేసిన కథ	25
12.	నూతనాగంతకుని నమ్మి చెడిన మందవిసర్పిణి కథ	29
13.	వీరవరుఁడు తన కుమారుని ప్రాణము లొసలగి శూద్రక మహారాజును గాపాడఁ బోయిన కథ	32
14.	క్షపణకులను గొట్టి నిధులు పొందిన క్షత్రియుని గాథ	37
15.	బిక్షుకులను గొట్టి యురితీయబడిన మంగలి కథ	38

16. యుద్ధము 45
17. మేఘవర్ణుని మోసము 46
18. సారసపక్షి స్వామి భక్తి 46
సంధి :
1. హితవాక్యములు వినక చెడిన కూర్మము కథ 51
2. మూడు చేపల కథ 51
3. అపాయ సహితమైన యుపాయముచేఁ జెడిన కొంగ కథ 53
4. తన్ను వ్యాఘ్రముగాఁ జేసి కాపాడిన మునిని జంప యత్నించిన మూషికము కథ 56
5. కన్యగామారి తగినవరుఁడు దొరకక యథాస్థితి నొందవలసివచ్చిన మూషికము కథ 57
6. నీచు నధికారిగా వరించి చెడిన శశకపింజలముల కథ 60
7. పేరాస వలన నెండ్రకాయచే మృతినొందిన కొంగ కథ 64
8. తన యవివేకమువలన లబ్ధనాశమొందిన మొసలి గాథ 67
9. రెండు మారులు వంచింపఁబడి మరణించిన గాడిద కథ 76
10. ధూర్తులచే వంచింపఁబడి యజ్ఞ మేషమును వదలుకొన్న బ్రాహ్మణుని కథ 81
11. దుష్టులమాటలు విని, నమ్మి, చెడిన లొట్టియ కథ 82
12. కార్యసిద్ధి నిమిత్తము కప్పలను మోచిన సర్పము కథ 87

ఉపోద్ఘాతము

భారత భూమియందుఁ బ్రవహించుచుండు పవిత్రనదులలో గంగానది మిక్కిలి ప్రసిద్ధి కెక్కినది. ఆనది యొడ్డున సంపదలతో నిండిన పాటలీపుత్ర మను నగరము గలదు. సమస్తమయిన ప్రభుగుణములు గలిగిన సుదర్శనుఁడను రా జానగరముఁ బరిపాలించుచుండెను.

ఒకనాఁ డొక బ్రాహ్మణుడు పఠించుచున్న రెండు శ్లోకము లారాజు వినుట సంభవించెను. ఆ శ్లోకములభావ మిది:

"మానవులకు సందేహము లన్నియు బోఁగొట్టి, సామాన్యదృష్టి కందని విషయములను గోచరింపజేయు నయనము శాస్త్రము. అది లేనివాడు కనులుండియు గ్రుడ్డివాఁడే. యౌవనము, ధనసంపద, ప్రభుత్వము, నవివేకము నను నాల్గింటిలో నే యొక్కటియైన ననర్థము గలిగింపఁ జాలును. ఈ నాలుగు విషయములు నొక్కచోటఁ గూడి యున్నచో వేఱుగాఁ జెప్పనవసరము లేదు."

సుదర్శనుని కుమారులు శాస్త్రము లభ్యసింపక యెల్లపుడుఁ జెడుదారుల సంచరించుచు నాటపాటలం దాసక్తులై యుండిరి. బ్రాహ్మణుడు చదివిన శ్లోకములు విని రాజు తన కొమరులను గుఱించి యిట్లు తలపోసెను.

"విద్వాంసుఁడుకాని పుత్రుఁడు జనించినఁ బ్రయోజన మేమియులేదు. కంటిబాధయేకాని గ్రుడ్డికంటివలన నుపయోగ మేమి యుండును? గుణవంతులలో లెక్కకురాని సుతునిఁ గన్న తల్లియుఁ బుత్రవతియే యనిపించుకొన్న యెడల నింక గొడ్రా లన నెవరు? దానమున, దపమునఁ, విద్యయందు, నర్థలాభమునఁ బ్రశస్తినొందని సుతుడు గలుగుట కేవలము తల్లుల కడుపుఁజేటుకాదా?

వేలకొలదిఁగా నుండు తారలకంటెఁ జందమామ యొక్కఁడే చీకటి సంపూర్ణముగా హరింపఁ గలుగును. అటులే గుణహీనులగు పలువురు సుతులకంటె గుణవంతుడఁగు కుమారుఁ డొక్కఁడే కులమునకుఁ గీర్తి తేఁకలుగును. ధార్మికుఁడు, గుణవంతుఁడు, చెప్పినమాట వినువాఁడు నగు పుత్రుఁడు మహాతప మొనరించిన వారికేకాని లభించుట కష్టము. ధనలాభము, ఆరోగ్యము, ప్రియురాలగు భార్య, చెప్పుచేతఁలలో నుండు సుతుఁడు, నర్థసంపాదమునకుఁ బనికివచ్చు విద్యయు లోకమున దుర్లభములు. పండితుఁడు గాని పుత్తునిఁ బుత్త్రుఁ డనుటకంటె శత్రుఁ డనుట యుక్తము. ఎట్టి వంశమున జనించినను విద్వాంసు డైనయెడలఁ బూజితుఁ డగును. ఉన్నతవంశమున జననమొందినను బండితుఁడుకానివానికి గౌరవము కలుగనేరదు. సద్వంశజనితమైనను గుణరహితమగు ధనువునకు విలువ యుండదు గదా! ఆహారము, నిద్ర

మున్నగులక్షణములు మానవులకు నితరజంతువులకు సమానములే. ధర్మాధర్మముల వివేకమే మానవునియందలి విశేషము. ఆ వివేకమునకు విద్యయే మూలము. విద్యలేని మానవుడు వింతపశు వనఁబడును" అని కొంతసేపు దుఃఖించెను.

మరల "సర్వవిధముల యత్నించి సుతులను సుగుణ వంతులుఁగాఁ జేయదగును. వట్టికోరికలతో నూరకుండక తగువిధమునఁ బ్రయత్నించిన దేవుఁడును సాయపడకపోడు. కుమారులకు విద్యాభ్యాసము చేయింపకున్న దోసము తలిదండ్రులది. ఒంటిచక్రమువలన రథమునకు నడక గలుగని యట్లు పురుష యత్నము, దైవసాహాయ్యము గూడిరానిచోఁ గార్యములు సిద్ధింపవు. కావునఁ దగిన ప్రయత్న మొనరించెదను" అని దీర్ఘముగా నాలోచించి మఱునాఁడు పండితులందఱను రావించి సభగావించి వారితో నిట్లు పలికెను.

"విద్వాంసులారా! విద్యాహీనులై యెల్ల వేళలఁ జెడుదారులఁ దిరుగుచున్న నాసుతులకు నీతిశాస్త్ర ముపదేశించి గుణవంతులను జేయఁజాలు పండితులెవరైనఁ గలరా?"

ఇట్లు ప్రశ్నింపఁగా మహాపండితుఁడగు విష్ణుశర్మ యను భూసురుడు "రాజా! ఉత్తమకులమున జనించిన నీసుతులను విద్వాంసులుగాఁ జేయుట యెంతపని? నీకులమున నపండితులెట్లు పుట్టుదురు?

ఎంతయత్నించినను బకమును మధురముగాఁ బలికింపలేముగాని, చిలుకను బలికించు టేమికష్టము? నీకుమారుల నాఱుమాసములలో నీతిశాస్త్రజ్ఞుల నొనరించి యొప్పగింపఁగలను" అని బదులు పలికెను.

అందులకు రా జెంతయు సంతసించి యిట్లనెను. "గాజు బంగారముతోడి సంబంధమున మరకతమణికాంతి నొందును. అట్లే సజ్జనస్నేహము నొందిన మూర్ఖుడును నేర్పు సంపాదింప గలఁడు గదా! కీటకము కుసుమ సంపర్కమున సుజనుల శిర మెక్కును. సత్పురుషులు ప్రతిష్ఠించుటవలనఁ బాషాణమే దైవత్వము నొందును. నదీగతములగు జలములు సుఖముగాఁ ద్రాగుటకు యోగ్యములు. సముద్రగతములగు నా సలిలములే త్రావుట కయోగ్యము లగును. ఆడువారి కనులయం దుంచఁబడిన నల్లని కాటుకయు నందము నొందునట్లు దుర్జనుఁడును మంచివారి యాశ్రయమువలన రాణించును. మిముఁ బోలు పండితులకడఁ జేరి నాసుతులు నీతివిదు లగుట వింతకాదు. కావున వారలకు విద్యయొసఁగు భారము మీయదియే." యని పలికి బహుమాన పూర్వకముగా విష్ణుశర్మకు సుదర్శనుఁడు తనకుమారుల నొప్పగించెను.

పిమ్మట విష్ణుశర్మ యారాజకుమారుల నొక సుందరమైన భవనమునకుఁ గొనిపోయి సుఖముగా గూరుచుండఁ జేసి వారితో నిట్లు పలికెను.

"సుజనులు కావ్యశాస్త్రవినోదమునఁ గాలము గడుపుదురు. మూర్ఖులు నిద్రావ్యసనకలహములతోఁ గడుపుదురు. కావున మీకు వినోదముకొఱకు విచిత్రమయిన చక్కని నీతి శాస్త్రకథలు చెప్పుదును. అందు మిత్రలాభము, మిత్రభేదము, విగ్రహము, సంధి యను నాలుగు భాగములు గలవు. వానిలో ముందు మిత్రలాభముఁ దెలుపుదును. ఆ భాగమునఁ గాక కూర్మాదులు స్నేహమువలన నెంతయో లాభమొందినవి. వాని కథ కడుంగడు విచిత్రము. వినుఁడు."

కథాప్రారంభము

మిత్రలాభము

చిత్రగ్రీవుఁడను కపోతరాజు వృత్తాంతము

పూర్వము గోదావరీతీరమున నొక గొప్ప బూరుగు చెట్టు గలదు. అన్ని దెసలనుండియు వచ్చి పక్షులు రాత్రి యా చెట్టుపై నివసించుచుండెడివి. ఒకనాఁటి వేకువవేళ లఘుపతనక మను కాకము మేలుకాంచి యమునివలె భయం కరుఁడై యున్న కిరాతు నొకనిఁ జూచి “లేవగానే యనిష్ట దర్శన మైనది. నేఁ డేమి కీడు మూడునో కదా!” యని కలఁత నొందెను. అంతలో బోయవాఁ డావృక్షముచెంత నూకలు చల్లి, వలపన్ని దాగి యుండెను.

అనంతర మాకాశమునఁ బరివారముతో సంచరించు చున్న చిత్రగ్రీవుఁడనెడి పావురములరాజు నేలమీఁద నున్న నూకలు జూచి భ్రమపడుచున్న తన తోడి పావురములతో నిట్లనెను. “నిర్జనమగు నీవనమున నూక లెట్లు వచ్చినవి? మన మీ నూకల కాసపడినచోఁ బూర్వము కంకణమునకై యాసించి పులిచేతఁ జిక్కి మరణించిన బాటసారివలె నపాయము నొందవచ్చును. మీ కాకథ చెప్పెదను వినుడు.

కంకణమున కాసించి పులిచేఁ జంపబడిన బాటసారి కథ

పూర్వ మొకపుడు దక్షిణదేశపు టడివిలోఁ దిరుగుచుఁ జూచితిని. ఒక ముసలిపులి స్నానముచేసి దర్భలు చేత బట్టుకొని యొక చెఱువుగట్టున నుండి “ఓయి బాటసారీ! ఇదిగో బంగరు కంకణము. దీనినిఁ దీసికొనుము” అని పలుకుచుండెను.

పేరాసకు లొంగిన యొక బాటసారి “నిస్సందేహముగా నిది నాయదృష్టము. అనుమానములు పెట్టుకొని కూరుచున్నచో ధనార్జనమే కష్టము. అయినను ద్వరపడరాదు. పరిశీలించెదను గాక” యని తలఁచి “కంకణ మేది? చూపుము” అని యాపులి నడిగెను.

“ఇదిగో బంగరు కంకణము. చూడుము.” అని పులి చేయి చాచి చూపెను.

"నీవు క్రూరజంతువవు. నిన్నేలాగున నమ్మవచ్చును?" అని యాబాటసారి ప్రశ్నించెను. దాని కా పులి యిట్లు బదులు పలికెను. "నీ వన్నట్లు యౌవనమున నే నతిదుర్మార్గుడనై యుంటిని. అనేకములగు గోవులను, మనుజులను జంపితిని. ఆపాపముచేతనే యాలుబిడ్డలను గోలుపోయి వంశహీనుఁడనై యుంటిని. పిమ్మట నొక పుణ్యాత్ముఁడు "గోవులను, మనుజులను చంపుట మానివైచి దానధర్మములు చేయుము" అని నాకు బోధించెను. నాఁటి నుండియు స్నానదానాదులు చేయుచుంటిని.

గోళ్లు, దంతములులేని ముదుసలిని. నే నెవరి కేమి యపకారము చేయఁగలను? ధర్మమార్గమునకు లోభము లేకుండుట మొదటి సోపానము. చేతఁ జిక్కిన కంకణమును దాన మిచ్చుచున్న నాకు లోభము లేదనుసంగతి తెల్లమే కదా!

అయినప్పటికిఁ బులులు మనుజులఁ జంపునని లోక ప్రసిద్ధి. దాని నెవరు వారింపఁగలరు? గ్రుడ్డినమ్మకమే కాని ధర్మమును గనిపెట్టుట లోకమున నఱుదు. మరుస్థలమునఁ గురియు వానవలెను, నాకలిగొన్నవాని కిడు భోజనమువలెను, పేదలకొసఁగు దానము ప్రశస్తము. నీవు దరిద్రుఁడవనియు, సర్వవిధములఁ బాత్రుఁడవనియు దీనిని నీకీయఁ దలఁచితిని. రోగముగలవాని కౌషధ మీయవలయునుగాని యారోగ్య వంతున కిచ్చిన నేమి యుపయోగము? కావున నీ చెఱువులో స్నానముచేసి వచ్చి దీనిని గ్రహింపుము. సంశయింపకుము."

ఇట్లు పలికిన పులిమాటలకు లోఁబడి యాబాటసారి స్నానమునకై చెఱువున దిగఁబోయి పెనుఁబొంపిలో దిగఁబడి కదలఁజాలఁ డయ్యెను. అపు డాపులి "అయ్యో! బురదలోఁ బడిపోయితివి. నిన్ను లేవదీఁయుదు" నని నెమ్మదిగా సమీపమున కేగి యాతనిఁ బట్టుకొనియెను.

అట్లు పట్టువడి, "క్రూరజంతువును నమ్మి గొప్ప తప్పిద మొనరించితిని. నదులయందును, శస్త్రప్రాణులయందును, గోళ్లు కలిగిన జంతువులందును, కొమ్ములు కలిగిన జంతువులందును, స్త్రీలయందును, రాజకులములందును విశ్వాస ముంచరాదని పెద్దలు వచింతురు. గతించిన దానికి విచారించినఁ బ్రయోజనమేమి? విధి దప్పించుకొన నెవ్వరికిఁ దరమగును? చంద్రుఁ డున్నతమైన గగనమార్గమున జరించును; కల్మషమును హరించును. అనేకకిరణములను ధరించుచు జ్యోతిర్మధ్యమున సంచరించును. అంతటి ఘనుఁ డైనను రాహు కేతువులచే మ్రింగఁబడుట తప్పలేదుగదా!" అని విచారించుచుఁ బులిచేఁ జంపబడెను.

బాగుగా జీర్ణమయిన యన్నమును, జక్కఁగాఁ జదివిన కుమారుఁడును, సుశిక్షితురాలైన స్త్రీయును, బాగుగా సేవింపఁ బడిన ప్రభువును, ఆలోచించి యాడిన మాటయు, నిదానించి యొనరించిన కృత్యమును నెన్నఁడు హాని కలిగింపవు. కాఁబట్టి బాగుగా నాలోచింపనిదే యేపనియుఁ జేయరాదు.

చిత్రగ్రీవుఁడు పలికిన యీమాటలు విని యొక పావురము నవ్వి గర్వముతో నిట్లనెను. "ఎల్లపుడు నిట్టి యుపయోగములేని శంకలు పెట్టుకొన్నచో నాహారము సంపా దించుకొని జీవించుటయే కష్టమగును. అసూయగలవాఁడు, నిందగలవాఁడు, సంతోషము లేనివాడు, కోపస్వభావుఁడు, పరులపోషణపై నాధారపడువాఁడు, నెల్లపుడు సందేహముతోఁ గూడియుండువాడు నను నీ యాఱుగురు దుఃఖభాగులని పెద్దల వచనము" ఈ మాటలు విని పావురములన్నియు నచట వ్రాలి బోయవాడు పన్నిన వలలోఁ దగులుకొనెను.

"లోభము కడు దుష్టగుణము కదా! అన్నివిషయములుఁ దెలిసియుండియుఁ, బరుల సంశయములు దీర్ప నేర్పరు లయ్యు లోభమునకు లొంగి మిగులఁ గష్టపడుదురు. లోభమె సమస్తదోషములకు మూలము. బంగరులేడి జనించుట యసంభవమయినను శ్రీరామునంతటివాఁడు లోభపడి హానిఁజెందెను. ఆపద రానై యున్న కాలమున నెంతటివారి బుద్ధియు మలిన మగును."

వలలోఁ జిక్కిన పావురము లన్నియు సంశయము పనికిరాదని తమ కాలోచనము చెప్పిన పావురమును నిందింపఁదొడఁగినవి.

"గుంపునకు ముందు మార్గదర్శకుఁడుగా నుండరాదు. కార్యము సఫల మయినయెడల ఫలిత మందఱకు సమానమే. కార్యము చెడిపోయినచో నిందమాత్రము మార్గదర్శకునకు వచ్చును."

పావురములు నిందించుట చూచి చిత్రగ్రీవుడు వానితో నిట్లనెను. "ఆపద రానైయున్నపుడు మేలు కూడఁ గీడుగా మాఱుచుండును. ఇదికేవల మీతని తప్పుగాదు. ఆపద కలిగినప్పుడు తప్పించుకొను నుపాయ మాలోచింపవలయునే కాని యొకరినొకరు నిందించుకొనుట కాపురుషుల లక్షణము. ఆపదనుండి తప్పింపఁగల సమర్థుడే బంధు వనఁదగును గాని వృథా నిందాపరుడు బంధువు కాజాలడు.

ఆపదయందు ధైర్యము, నభివృద్ధి గలిగినపు డోర్పు, సభలయందు మాటనేర్పు, యుద్ధములయందు శౌర్యము, కీర్తియం దభిరుచియు, శాస్త్రశ్రవణమునందు వ్యసనము నను నీ గుణములు మహాత్ములకు స్వభావసిద్ధములు. కాఁబట్టి ధైర్య మవలంబించి ప్రతిక్రియ యాలోచింపదగును.

మన మందఱము నేకీభవించి వలయెత్తుకొని యెగిరి పోవుదుము. "అల్పులమగు మన కీపని యెట్లు శక్య మగు" నని తలపకుడు. అల్పములగు గడ్డిపరకలు పెనవైచుకొని మదించిన యేనుఁగును సహితము బంధింపఁ గలుగుచున్నవి. అల్పమైన యూక తొలఁగింపఁబడిన సారవంతమగు బియ్యపుగింజ మొలకెత్తఁజాలదు. మన మందఱముఁ గలిసినచో నీపని కష్టము గాదు." అని తమ ఱేఁడు పలికిన మాటలు విని యా కపోతములన్నియు వల యెగఁ దన్నుకొని యాకసమున కెగిరిపోయెను.

అనంతర మాబోయవాఁ డది చూచి "యీపక్షులు గుమిగూడి వలఁ దన్నుకొని పోవుచుండెను. నేలపై వ్రాలఁగానే పట్టుకొందునుగాక" యని తలఁచి వెంటఁ బోవుచుండెను. అవి కనుచూపుమేర దాఁటిపోఁగా నాతడు నిరాశుఁడై మరలి తనతావునకుఁ బోయెను.

ఆతఁ డట్లు మరలిపోవుట చూచి "మన కిపుడు కర్తవ్యమేమి?" యని యాపక్షు లడుగఁగాఁ జిత్రగ్రీవుఁడిటు లనియెను.

"లోకమునఁ దల్లియుఁ, దండ్రియు, మిత్రుఁడు నను నీ ముప్వురే నిజమైన హితులు. కడమవా రందఱుఁ దమమేలు కోరిమాత్రమే హితు లగుచున్నారు. నాకు మూషిక రాజగు హిరణ్యకుఁడను నొక మిత్రుడు గలడు. గండకీ నదీతీరమునఁ జిత్రవనమం దాతడు నివసించుచుండును. ఆతఁడీ వల గొఱికి మనలను విడిపింపగలడు" అని చెప్పఁగనే పావురములన్నియుఁ బోయి హిరణ్యకుఁడు వాసము చేయుచున్న కలుఁగుదరిని వ్రాలెను.

హిరణ్యకుఁడు పావురములకు మేలుసేయుట

హిరణ్యకుఁడు పావురములు వ్రాలిన సవ్వడి గుర్తించి భయముచేఁ దన కలుగులోఁ గదలక మెదలక యుండెను. అపుడు చిత్రగ్రీవుడు "చెలికాడా! మాతో మాటాడవేల?" యని యెలుఁగెత్తి పిలిచెను. ఆమాట చిత్రగ్రీవునిదని గుర్తించి వెంటనే హిరణ్యకుడు కలుఁగు వెలుపలికి వచ్చెను. చిత్రగ్రీవునిఁ జూచి "మిత్రునితో సంభాషణము, సహనివాసము, కలుగుట కన్న పుణ్యము మఱిలేదు. పుణ్యవశమున నాచెలికాఁడువచ్చి నా కానందముఁ గలిగించినాఁడు." అని పలికి వలలోఁ దగులుకొన్న పావురములను జూచి కొంచెము భయపడి "మిత్రుఁడా! ఇదియేమె" యని యడిగెను.

దానికి జిత్రగ్రీవుడు "మిత్రుఁడా! యిది మా పూర్వజన్మకర్మమునకు ఫలము, రోగము, పరితాపము, బంధనము, వ్యసనము నను నవి ప్రాణుల కాత్మాపరాధవృక్షఫలములు గదా!" యని బదులు పలికెను.

వెంటనే హిరణ్యకుఁడు చిత్రగ్రీవుని బంధనములు గొఱుకుటకై సిద్ధపడెను. చిత్రగ్రీవుడు "మిత్రమా! ఇదిసరికాదు. ముందు నాయాశ్రితుల బంధములు తెగఁ గొఱుకుము. తరువాత నావియుఁ గొఱుకవచ్చును." అనెను.

ఇది విని యా మూషికరాజు "నాదంతములు కడుసున్నితములు. శక్తియుఁ దక్కువగా నున్నది. కావున ముందుగా నీ బంధములు చేదించి తరువాత శక్తియున్నచో వారి బంధముల సంగతి చూచెద" ననెను.

ఆ పలుకులకు జిత్రగ్రీవుఁడు "సరే; శక్తికి మించి యేమి చేయఁగలవు? ముందు వీరి బంధములు శక్తియున్నంతవఱకుఁ ద్రుంపుము. పిమ్మటనే నాపని చూడవచ్చును" అన,మూషికరాజు "తన్నువీడి యితరులఁ గాపాడఁ దలచుట నీతి గాదు. 'ఆపదవేళ నుపయోగపడుటకై ధనమును రక్షించుకొనవలయును. ధనమును, దారను వీడియైనను తన్నుఁ దా నేమఱక కాపాడుకొనవలయును.' అని నీతివిదులు పలుకుదురు. ప్రాణములు ధర్మార్థకామమోక్షముల సుస్థితికి మూలములు. అవిపోయినచో సర్వముఁ బోయినట్లే." అని చెప్పెను.

ఆపలుకులు విని చిత్రగ్రీవుఁడు మరల నిట్లనెను. "మిత్రుఁడా! నీవు చెప్పినది నీతియే. అయినను నా యాశ్రితుల దుఃఖము నేను సహింపజాలను; కావున నిట్లు పలికితిని. 'పరుల నిమిత్తము ధనమునే కాక జీవితమును గూడ వదలుకొనవలయు ' నని పెద్దలు చెప్పుదురు. ఎప్పుడైనను నశింపక తప్పని ప్రాణములు మంచికారణమునఁ ద్యజించుట శ్రేయస్కరముగదా! అన్నివిధముల వీరు నాకు సమానులు. వీరినిపుడు రక్షింపలేకున్నచో వీరికి నాప్రభుత్వమువలని యుపయోగమేమి? జీతబత్తెములు లేకున్నను వీరెల్లపుడు వీడక ననుఁ గొలుచుచున్నారు. నాజీవితము వదలుకొని యైనను వీరిని రక్షించుట మేలు. అనిత్యము, మలినము నగు దేహముచే శాశ్వతము, నిర్మలము నగు యశము లభించు నపుడిఁకఁ గావలసినదేమె యుండును? శరీరము క్షణకాలములో నశించునది; గుణములు కల్పాంతమువఱకు నుండునవి. కావున మలినమైన నాదేహము విషయమున శ్రద్ధమాని నాకీర్తిశరీరమును గాపాడుము.'

చిత్రగ్రీవుఁ డాడిన యీమాటలు విని హిరణ్యకుడు సంతోషముచేతఁ బులకితుఁడయి యిట్లనియెను. "సఖుఁడా మేలుమేలు" ఆశ్రితుల యెడల వాత్సల్యమనెడి నీ యీ సుగుణముచేత ముల్లోకముల నేలఁజాలి యున్నావు." ఇట్లు పలికి యన్నిటిబంధములు నవలీలగాఁ గొఱికివైచి వానిని సాదరముగాఁ బూజించి హిరణ్యకుడు కపోతరాజుతో మరలనిట్లనెను.

"మిత్రమా! చిత్రగ్రీవా! వలలోఁ దగులుకొంటి నని విచారింపకుము. ఆమిషము నాకాశమున యోజనము దూరము నుండియైనఁ జూడఁగలపక్షి యాపత్కాలము ప్రాప్తమై నప్పుడు తనసమీపమునఁ బన్నఁబడిన వలను సైతముఁ జూడజాలదు. కాలము ప్రాప్తించినపుడు సూర్యచంద్రులకు రాహుకేతుగ్రహపీడయుఁ గజసర్పములకు బంధనమును, బుద్ధిమంతులకు దారిద్ర్యమును గలుగుచుండుటఁ జూచినచో విధి బలవత్తర మని తెలును గదా! కావునఁ గాలమతిక్రమింపరానిది" అని యూరడించి, యాలింగన మొనరించి, సపరివారముగా నాతిథ్యమొసఁగి హిరణ్యకుఁడు చిత్రగ్రీవునిఁ బంపెను. ఆ కపోతరా జానందమున యథేచ్ఛముగా వెడలెను. హిరణ్యకుఁడు తనకలుగుఁ జొచ్చెను.

కాబట్టి పెక్కుమంది సన్మిత్రులను సంపాదింపవలయును. ఒక్క మూషికమువలనఁ బావురముల కెంతమేలు చేకూఱెనో చూడుడు!

లఘుపతనక మనెడి వాయసము హిరణ్యకుని చెలిమి గోరుట

వెంటనంటిపోయి పావురములు సంగతి యంతయుఁ జూచి లఘుపతనక మనెడి బూరుగుచెట్టుమీఁది వాయసము హిరణ్యకుని కలుగు దగ్గర వ్రాలి "ఓహో! హిరణ్యకుఁడా! కొనియాడఁ దగినవాడవు. కాఁబట్టి నీచెలిమిగోరి వచ్చితిని. దయయుంచి నాకోరిక దీర్పుము" అని పలికెను.

హిరణ్యకుఁడది విని కలుగుఁలోనుండియే "ఓయీ నీ వెవఁడవు?" అని ప్రశ్నించెను. ఆకాకి "నేను లఘుపతనక మనెడి వాయసమను" అని బదులు పలికెను. హిరణ్యకుఁడు విడ్డూరముగా నవ్వి "నీతోడనా మైత్రి? సరిపడువారు మైత్రి చేయుట మంచిది. నే నాహారమను నీవు భక్షకుఁడవు. కావున నీతో స్నేహము నాకు హానికరము. పూర్వ మొకలేడి యొక నక్క చెప్పిన కపటమాటలు నమ్మి యురులలోఁ దగులు కొని యొక కాకముచేతఁ గాపాడబడినది. నీ కా కథ చెప్పెదను, విను" మని యిట్లు చెప్పఁదొడగెను.

నక్క కపటపు మాటలచే వంచింపబడిన లేడి కథ

మగధ దేశమునఁ జంపావతి యను నడవియొకటి గలదు. అచటఁ జిరకాలమునుండియు నొక లేఁడియు, నొక కాకమును మిగుల స్నేహముతో నివసించుచుండెను. ఆలేడి చక్కఁగా బలిసి యడవిలో హాయిగా తిరుగుచుండఁగా నొక జంబుకము చూచి యిట్లాలోచించెను.

"ఆహా! యీలేడి మిక్కిలి బలిసియున్నది. దీని మాంసము నాకెట్లు లభించును." దీనికి నమ్మకము గలిగించి ప్రయత్నించి చూచెదను." అని తలఁచి యాజింకను సమీ పించి "చెలికాఁడా! సేమమా?" యని యడిగెను. దాని కాజింక "నీవెవ్వఁడ" వని ప్రశ్నించెను.

"నేను సుబుద్ధియను పేరుగల జంబుకమను. కారణాంతరములచేత నాచుట్టము లందఱు నన్ను విడిచి పోయిరి. నేను మృతునివలె నిచట నొంటరిగా వసించుచున్నాను. స్నేహపాత్రుడవగు నిన్నుఁ జూడగనే బంధువులనడుమఁ జేరినటులున్నది. నీతోఁజెలిమిచేసి కూడియుండఁ దలఁచుచున్నాను." అని యాజంబుకము సమాధాన

మీయగా “సరే, అట్లే కానిమ్ము.” అని దానిని లేఁడి సాయంకాలము తన నివాస స్థానమునకుఁ దోడుకొనిపోయెను.

అచట సంపెంగచెట్టుకొమ్మమీఁద నిలిచియున్న కాకి తన చెలికాఁడగు జింకను చూచి “యీ రెండవవాఁడెవ్వఁడని యడిగెను. “నాస్నేహముఁ గోరివచ్చిన సుబుద్ధియను జంబుకోత్తముఁ” డని లేడి చెప్పఁగా విని, కాక మిట్లనియెను.

“సఖుఁడా! ఆకస్మికముగా వచ్చినవారిని నమ్మి చెలిమి సేయఁదగదు. కులము, శీలము నెఱుఁగనిదే యెవ్వరికిఁ జోటీయఁ దగదు. మార్జాలమునకుఁ జోటిచ్చిన దోషము చేతఁ బూర్వము జరద్గవమను నొక గ్రద్ద మరణము నొందెను. నీ కా కథ వివరించెదను వినుము” అని కాకి యిట్లు చెప్పఁదొడఁగెను.

మార్జాలమునకుఁ జోటిచ్చి దానివలన మరణించిన జరద్గవ మను గ్రద్ద కథ

గంగాతీరమున గృధ్రకూట మను పర్వతమున నొక పెద్ద జువ్విచెట్టు గలదు. దాని తొఱ్ఱయందు మిక్కిలి ముదుసలియై గోళ్లు, దంతములు పట్టుచెడిన జరద్గవ మను నొక గ్రద్ద నివసించుచుండెను. ఆ చెట్టుమీదనుండు పక్షులు దయతోఁ దాము తెచ్చుకొన్న తిండిలోఁ గొంచెము కొంచె మా జరద్గవమున కిచ్చుచుండెను. ఆగ్రద్ద దానితో జీవించుచుఁ బక్షులు గూళ్లు విడిచి పోయినపుడు వాని పిల్లలను గాపాడుచుండెను.

ఒకనాడు దీర్ఘకర్ణ మనెడి పిల్లి యొకటి పక్షిపిల్లలను బట్టుకొని తినుటకై యాజువ్విచెట్టుకడకు వచ్చెను. దానింజూచి పక్షిపిల్లలు భయపడి యఱవఁదొడఁగెను. అంతట జరద్గవ మా యఱుపు విని “యెవ రా వచ్చుచున్న వా?” రని ప్రశ్నించెను.

అపు డాపిల్లి గ్రద్దను జూచి భయపడి “హా, చచ్చితిని! ఇఁక నేమి చేయుదును? ఆపద మీఁదఁ బడినపుడు భయపడి పొందఁగల ప్రయోజనమేమి? పాఱిపోవు టిఁక శక్యముగాదు. ఉపాయమునఁ దప్పించుకొనవలయును. ఏమైన నగును గాక. దీనితో మాటలాడి నమ్మకము గలిగింప యత్నించెదను.” అని యాలోచించి దరిఁజేరి “అయ్యా! నమస్కారము” అని పలుకఁగా గ్రద్ద “నీవెవ్వడ” వని ప్రశ్నించెను. “నేను దీర్ఘకర్ణమను పేరుగల పిల్లిని” అన, గ్రద్ద “వెంటనే దూరముగఁ బొమ్ము. లేనిచోఁ జంపివేయుదు” ననెను.

“దయయుంచి నామాట వినుఁడు. అనంతరము చంపఁ దగినవాఁడ నైనయెడల నట్లే చంపివేయవచ్చును. జాతిమాత్రమున నెవ్వరినిఁ జంపివేయనురాదు; పూజింపను

గూడదు. సంగతియంతయు దెలిసికొని చంపఁదగునో, గౌరవింపఁదగునో నిర్ణయించుట నీతి” అని యా మార్జాలము వేడుకొనగా గ్రద్ధ యపుడు “అయినచోఁ జెప్పుము. నీవేమి పనిమీద నిచటికి వచ్చితివి?” అనియడిగెను.

“నే నిచట గంగలో నిత్యము స్నానముచేయుచు మాంసాహారము విడిచి బ్రహ్మచారినై చాంద్రాయణవ్రతము చేయుచుంటిని. మీరు ధర్మజ్ఞానపరులనియు, విశ్వాసయోగ్యులనియు బక్షులన్నియు నెల్లవేళల నుతించుట విని, విద్యచేతను, వయస్సుచేతను బెద్దలయిన మీవలన ధర్మములు వినఁదలఁచి మీదర్శనమునకు వచ్చితిని. అన్నిధర్మములుఁ దెలిసిన మీరే మీయింటికి వచ్చిన నన్నుఁ జంపదలచితిరి.

ఇంటికి వచ్చినప్పుడు శత్రువున కయినను గౌరవము చేయవలయును. ధన మీయలేకున్న మంచిమాటలతోనైన నాదరింపవలయును. తన్ను ఛేదించుటకు వచ్చినవానికి సయితము వృక్షము చల్లని నీడయొసఁగి యాదరించుచున్నది. సాధువులు గుణహీనులయందును దయచూపుదురు. ఎట్టి నీచపుఁ దావులయందును జందమామ వెన్నెల గాయకుండ నుండడుగదా!

మఱియు నగ్ని బ్రాహ్మణులకుఁ బూజ్యుఁడు. అన్ని వర్ణములవారికి నిజమైన బ్రాహ్మణుఁడు పూజ్యుడు. స్త్రీలకు భర్త పరమపూజ్యుడు. ఇంటికివచ్చిన యతిథి యందఱకుఁ బరమపూజ్యతముఁడు. ఎవ్వడింటికి వచ్చిన యతిథిని, నిరాశతో వెడలఁగొట్టునో వాని సుకృత మా యతిథికిఁ జెందుననియు, నాయతిథి చేసిన పాప మాతని వెడలఁగొట్టిన వానికి వచ్చుననియుఁ బెద్దలు చెప్పుదురు. అతిథి సర్వదేవలతో సమానుఁడు. వాఁడెట్టి నీచుఁడైనను గౌరవమున కర్హుడు.” అని పిల్లి చెప్పిన సంగతులు విని గ్రద్ధ మరల నిట్లనెను. “పిల్లులకు మాంసమనం దెక్కువ యిష్టము. పక్షిపిల్లల రక్షణభారము నామీఁద నుండుటచేత నిట్లంటిని.” అనఁగానే యాబిడాలము చెవులు మూసికొని యిట్లు పలికెను.

“హరిహరీ! ఎంతమాట వినవలసి వచ్చినది! ధర్మ శాస్త్రములు విని, కోరికలు విడిచి చాంద్రాయణవ్రత మాచరించుచుంటిని. ఇతర విషయములను గుఱించి పరస్పరవిరోధము లెన్ని యున్నను ధర్మశాస్త్రము లన్నియు “అహింస పరమధర్మ” మని యేకగ్రీవముగా ఘోషించుచున్నవి. సర్వజీవులయందు దయగలిగి యుండి యహింస నవలంబించువానికి స్వర్గము స్వాధీనమై యుండును. మరణము కలుగునన్నచోఁ బుట్టుదుఃఖము వర్ణింపనలవికానిది. ఒకరి ప్రాణములు దీసి తా మనుభవించు తృప్తి క్షణికమే కదా! అనాయాసముగా దొరకు నే యాకలములతోనైనఁ బొట్టపోసికొనవచ్చును. ఈ పాడుపొట్టకై మహాపాపముచేయుట యెంత తెలివితక్కువ పని?” యని పలికి యా ముసలిగ్రద్ధకు సంపూర్ణమగు నమ్మకముఁ గలిగించి దానితో మిక్కిలి స్నేహముఁ జేయుచు నాచెట్టు తొఱ్ఱలోనే నివసించుచుండెను.

ఇట్లు కొన్నిదినములు గడచి గ్రద్దకు నమ్మకము ముదిరిన యనంతరము దీర్ఘకర్ణము చెట్టెక్కి పక్షిపిల్లలను దెచ్చి తొఱ్ఱలో నిడుకొని నిత్యము భక్షింపసాగెను. తమపిల్లలు కనబడక పక్షులు దుఃఖించుచు నిటునటు వెదుకఁ దొడఁగినవి. ఆ సంగతి తెలిసి పిల్లి తొఱ్ఱను విడిచి పాఱిపోయెను. పక్షులు వెదకివెదకి తొఱ్ఱలోనున్న తమపిల్లల యెముకలు కనుఁగొని యా జరద్గవమే పిల్లలను దినివైచి యుండునని నిశ్చయించి యన్నియు జేరి తమ ముక్కులతోఁ బొడిచి యా ముసలి గ్రద్దను జంపివైచినవి.

కాబట్టి యాకస్మికముగా వచ్చినవారిని నమ్మరాదని చెప్పితిని? ఈ విధముగా జెప్పిన కాకి పలుకులు విని మిక్కిలి కోపముతో జంబుక మిట్లనెను.

“ఈ లేఁడిని జూచిన మొదటిరోజున నీవును నూతనుఁడవే. అట్టి నీకును దీనికిని మైత్రి నిత్యమును వర్ధిల్లుట లేదా? నీ కెదురాడువారు లేక నీకుఁ దోచిన వన్నియు నీతులని పలుకు చున్నావు. వీడు తనవాఁడు, వీఁడు పరుఁడు నని యల్పబుద్ధి గలవారు తలపోయుదురు. బుద్ధిమంతు లట్లు భావింపక లోకమంతయు నొకేకుటుంబమని యెంతురు. ఈ లేఁడి నీకెట్టి చుట్టమో నాకును నట్టిబంధువే.” ఈ మాటలు విని “యట్లే యగు గాక” యని కాకియు దానిచెలిమి కంగీకరించెను. అప్పటినుండియు నాఁలేడియు, నక్కయు, గాకియు మిక్కిలి స్నేహముగలిగి యా వనమున నివసించుచుండెను.

కొంతకాలమునకు బిమ్మట సుబుద్ధి లేడితో రహస్యముగా నిట్లు పలికెను. “యీ యడవియం దొక్కచోట సస్యముతో నిండిన పొలమున్నది. దానిని నీకుఁ జూపుదునుర” మ్మని జింకను వెంటఁ దీసికొనిపోయి సుబుద్ధి పంటపొలము దానికిఁ జూపెను. లేడియు రోజురోజు నచటికి బోయి యాపయిరు దినుచుండెను.

ఒకనాడు పొలముకాపు పయిరు దినివేయఁబడుచుండుటఁ జూచి, వలపన్ని వెడలెను. జింక మేఁతకుఁ బోయి యావలలోఁ జిక్కుకొని “నన్నీ వలనుండి, తప్పించి కాపాడు దిక్కెవరు?” అని చింతించుచుండ జంబుకము వచ్చి చూచి “నాతంత్ర మిప్పటికి నెఱవేఱినది. ఇది చంపబడినయెడల దీని మాంసాదులు చాలకాలమువఱకు నాకు భోజనమునకు సరి పోవును.” అని తలఁచుచు దరి కేఁగెను.

లేఁడి జంబుకమును గాంచినంతనే సంతసించి “సఖుఁడా! త్వరితముగా వచ్చి నాబంధములు గొఱికి నన్నుఁ గాపాడు” మని కోరెను. ఆ నక్కయు మఱింత దగ్గరగా వచ్చి మాటిమాటికి వలను బరిశీలించి చూచి “మిత్రుడా! యీవల నులి నరములతోఁ జేయబడినది. దీనిని నేఁడాదివార మగుటచేతఁ దాఁకఁ జాలను. నీవు వేఱుగా భావింపకుము. తెల్లవారఁగనే నీవు చెప్పినట్లు చేయుదును.” అని పలికి సమీపమందలి పొదచాటున దాగియుండెను.

అనంతరము సాయంకాలమైనను లేఁడి తిరిగి రాకుండుట చేత వాయస మనుమానపడి యటునిటు వెదకుచు వచ్చి వలలోఁ దగులుకొనియున్న మిత్రునిఁ జూచి

"ఇది యేమి?" యని యడిగెను.

"మిత్రుని మాట వినకుండుటవలనఁ గలిగిన ఫలితము. హాని సిద్ధమైయున్నపుడు సఖుల మాటలు చెవి కెక్కునా!" యని పలికి లేడి సంగతియంతయు వివరించెను. "జంబుక మెచట నున్న" దని వాయస మడిగెను. "నా మాంసముఁ దినఁ గోరుచు నిచటనే యుండు" నని మృగము బదులు పలికెను. అపుడు కాకి యిట్లనెను.

"నేను ముందే చెప్పితిని. నాయం దేమియు దోసము లేదు గదా యని దుర్మార్గులను నమ్మరాదు. వారు సుజనులకుఁ గూడ హానిచేయఁగలరు. మరణము సమీపించినవారు దీప మాఱిపోవునప్పటి గంధ మాఘ్రాణింపలేరు. మఱియు వారి కరుంధతీ నక్షత్రము గోచరింపదు. మిత్రులమాటలు చెవికెక్కవు.

ఎదుట మంచిమాటలాడి నమ్మించి చాటునఁ గీడొనరించు మిత్రుని నమ్మరాదు. అట్టివాఁడు మేఁకవన్నె పులివంటి వాఁడు." అని పలికి "ఓ దుష్టజంబుకమా! పరమసాధువయిన యీజింకను వంచించితివా? ఓ భూమాతా! నమ్మి మేలొనరించిన వారిని వంచించు దుష్టుల నెట్లు భరింపగలుగుచుంటివి?

దుర్జనుల సాంగత్యము సకలహానులకు మూలము. నిప్పు తాఁకినవారిని దహించును. చల్లాఱినను మాలిన్యమును గలిగించును.

దోమ ముందుగాఁ బాదముల మీఁద వ్రాలును. పిదప వీపుమీఁది మాంసమును గొఱుకును. చెవిలో మధురముగా నేమియో పలుకును. రంధ్రముఁ జూచుకొని నెమ్మదిగా శరీరమునఁ జేరి కడుంగడు హానిఁ గలిగించును. దుష్టుని వర్తనము నిట్టిదే. మధురముగా మాటలాడినంతమాత్రమున విషముతో నిండిన హృదయముగల దుర్జనుని నమ్మరాదు" అని విచారించుచుండఁ గఱ్ఱ చేత బట్టుకొని వచ్చుచున్న పొలముకాపు గనఁబడెను.

వానిఁ జూచి వాయసము "సఖుడా! ఆలసింపరాదు. ఊపిరి బిగఁబట్టి కడు పుబ్బరించునట్లు చేసి కాళ్లు చాచుకొని చనిపోయినట్లు నటింపుము. నేను కూయఁగానే లేచి వేగముగాఁ బాఱిపొమ్ము" అనిచెప్పెను.

జింకయుఁ గాకి చెప్పిన విధమునఁ జచ్చినట్లు పడియుండెను. అపుడు పొలముకాపువచ్చి యా జింకను జూచి యది చచ్చినదని తలఁచి వల వదలించెను. అది చూచి కాకి కూసెను. అంతట వేగముగా లేచి లేఁడి పాఱిపోయెను. మృగముచేసిన వంచన కా పొలముకాపు మిక్కిలికోపించి తన చేతనున్న బడియ విసరగా నది గుఱితప్పి దాగియున్న నక్కకుఁ దగిలెను. దానిచేత నానక్క వెంటనే ప్రాణములు విడిచెను.

"పుణ్యముగాని, పాపముగాని మితిమీఱి చేయువారికి ఫలితము కొలఁది కాలములోనే సంభవించును." అనిన విని లఘుపతనకము హిరణ్యకున కిట్లనెను.

"నిన్నుఁ జంపిన మాత్రమున నాకుఁ బుష్కలముగ నాహారము చేకూఱునా? నీతో మైత్రి యొనరించి చిత్రగ్రీవుని వలె నుండుదును. నీవెన్ని చెప్పినను నీ చెలిమి సేయనిదే జీవించి యుండఁజాలను. నే నింతగా మాట్లాడితినని నాపైఁ గోపగింపకుము. సాధువులకుఁ గోపము వచ్చినను వా రితరులకు హానిచేయఁ బూనుకొనరు, నిప్పురవ్వ తగిలిన మాత్రమున సముద్రజలము వేడి యెక్కదు."

ఈ మాట విని, "నీవు చంచలబుద్ధివి. చపలుని చెలిమి మంచిదిగాదు. మార్జాలము, దున్నపోతు, కాకము, దుర్జనుఁడు నమ్మించి యెంతపనియైనఁ జేయఁగలరు. మఱియు నీవు మాకు శత్రువుల తెగకుఁ జెందినవాడవు. శత్రు వెంతమంచివాఁడైనను వానితోఁ జెలిమి సేయదగదు. జలమెంత యుష్ణమైనదైనను నిప్పును జల్లార్పకుండునా? మంచి మాణిక్యములను ధరించినదై నను సర్పము చేర రాని దైనట్లుగా నెట్టివిద్యగలవాఁడైనను దుర్జనుఁడు చేరనీయక విడువఁదగినవాడు. నేలమీఁద నావలును నీటిమీఁద బండ్లును నడువఁజాలని విధమున శత్రువు మేలొనరించుట యసంభవము. శత్రువును, దనపై మనసులేని భార్యను నమ్మియుండువాని క చిరకాలము ననే హాని సంభవింపకమానదు" అని దృఢముగా బలికెను.

ఆ మాటలు విని లఘుపతనకము "వేయిమాటలేల? నీవు నాచెలిమి కంగీకరింపని యెడల నేఁటినుండి నిరశనవ్రతముఁ బూని ప్రాణములు కోలుపోవుదును. కారణ మేమన; మంటి కుండనువలె దుర్జనునిఁ ద్వరలో విడఁగొట్టుట సులభము. సంధించుట మిక్కిలి కష్టము. బంగరుకలశము త్వరితముగా సంధింపఁబడును గాని తేలికగా విడఁగొట్టఁబడదు. సుజనుని విధము నట్టిదియే.

సుజనులను జూచినంతమాత్రమున సఖ్య మేర్పడును. అది విడఁదీయరానిదై యుండును. సుజనులు నారి కేళమువలె సారముఁ గలిగియున్నట్లు బయటికి గనఁబడకున్నను నంతరంగమున సుగుణసారముఁ గలిగి యుందురు. దుర్జనులు మేడిపండువలె బయటికి మాత్రము సుందరముగాఁ గనఁబడుదురు. సాధువుల చెలిమి కేకారణమున నైన నాటంకములు గలిగినను వారి గుణముల యోగ్యత సెడదు. తామరతూండ్లు త్రుంచి వేయఁబడినను వాని దారములు విడిపోవు. మంచిమిత్రుని గుణములని చెప్పఁబడు దయ, స్నేహము, త్యాగము, శౌర్యము మున్నగునవి యన్నియు నీయందుఁ గలవు. ఇట్టి మిత్రుఁడు నాకింకెట్లు దొరకును?" అని వివరించెను.

ఆ మాటలు విని హిరణ్యకుఁడు కలుఁగు వెడలివచ్చెను. "లఘుపతనకా! నీమాట లమృతమువలె నా కానంద మొసగినవి. మంచిగందపుసారముగాని, చల్లని నీటితుంపరుల జల్లుకాని, కప్పురపుఁబ్రోవుల పరిమళముగాని యాదరముతో నిండిన సుజనుల సల్లాపమువలె హాయి గలిగింపఁ జాలవు. రహస్యము వెల్లడించుట, యాచన, నిష్ఠురముగ మాటలాడుట, మనస్థిరత్వము లేకపోవుట, కోపము, నసత్యములాడుట

మిత్రుల కుండరాని గుణములు. ఈ దోసములం దేదియు నీయందు లేదు. మాటలవలననే మంచిచెడ్డలు గొంతవఱకు వెల్లడియగు చుండును. కావున నీవు గోరినటులే యగునుగాక" అని పలికి వాయసముతో సఖ్యమొనరించి గౌరవించెను. నాటినుండియు లఘుపతనక హిరణ్యకులు పరస్పరముఁ గుశల మరసికొనుచుఁ గడు విశ్వాసముతో మాటలాడుకొనుచుఁ గాలక్షేపము సేయు చుండిరి.

ఒకనాడు లఘుపతనకుఁడు హిరణ్యకునితో "సఖుఁడా! ఇచట నాకుఁ దిండి దొరకుట కష్టమగుచున్నది. ఇచ్చోటు వీడి మఱియొకస్థలమున కేఁగుట మంచిదని తలంచుచుంటిని." అని చెప్పెను. దానికి హిరణ్యకుడు "మిత్రుడా! ఒకస్థానము విడిచి నూతనస్థలమున నడుగిడునపుడు చక్కగా నాలోచింపవలయును. నీవెచటి కేఁగఁదలచితివి?" అని అడిగెను.

"మిత్రమా! చక్కగా నాలోచించితిని. దండకారణ్యమున గర్పూరగౌర మను నొక సరస్సు గలదు. చిరమిత్రుఁడైన మంథరుఁడనెడి కూర్మరా జందుఁ గలడు. ఇతరులకు ధర్మములు బోధించుట సులభము. ఆచరించుట కష్టము. ఆ తాఁబేలు కడు ధర్మాత్ముడు. ఆతఁ డాహార మొసఁగి నన్ను బోషింపగలడు" అని వాయసము బదులుపల్కెను.

అంతట హిరణ్యకుడు "నీవు వెడలిపోయిన తర్వాత నిచటనుండి నేనేమి చేయుదును? "ఏ దేశమున గౌరవము, జీవనోపాయము, చుట్టములు, విద్యాప్రాప్తి లభింపవో యా దేశము విడువవలయు" నని పెద్ద లందురు. మఱియు, అప్పిచ్చువాడు, వైద్యుడు, సంతతము బ్రవహించు నది, వేదపండితుఁడు లేనిచోట నుండరాదు. కావున నన్నుఁగూడ నీతోఁ గొనిపొమ్ము." అని కోరెను. లఘుపతనకుఁ డందుల కంగీకరించెను. సంతసముతో విచిత్రమైన కథలు చెప్పుకొనుచుఁ గర్పూరగౌర సరస్సును జేరఁబోయిరి.

మంథరుఁడును, వచ్చుచున్న వాయస మూషికములను దూరమునుండియే చూచి తగిన విధమున నాదరించెను. అనంతరము లఘుపతనకుఁడు మంథరునితో నిట్లు పలికెను. "సఖుఁడా! యీ మూషికరాజు మిక్కిలి పుణ్యాత్ముడు. దయాపరుఁడు. ఈతనిపేరు హిరణ్యకుఁడు. ఈతని సుగుణ విశేషము లాదిశేషుఁడైనను వర్ణింపఁజాలడు. ఈతని నీవు మిగుల గౌరవింపవలయును." అని హిరణ్యకునితోడి తన చెలిమిని గుఱించి వివరించెను.

అంతట మంథరుఁడు హిరణ్యకుని మిక్కిలి పూజించి "హిరణ్యకా! నీ వీ జనరహితమైన యడవియందేల నివసించుచుంటి" వని యడిగెను. అపుడు హిరణ్యకుడు తన వృత్తాంతము నిట్లు చెప్పఁదొడఁగెను.

"చంపక మను నగర మొక్కటి కలదు. అందలి మఠములో సన్యాసులు పెక్కుమంది నివసించుచుందురు. అందుఁ జూడాకర్ణుఁడను నొక యతి గలడు. అతఁడు ప్రతి దినముఁ దాను భుజింపఁగామిగిలిన యాహారము భిక్షాపాత్రమందుంచి యా పాత్రము

జిలుకకొయ్యకుఁ దగిలించి నిదురించుచుండువాడు. నేను రోజురోజు మెల్లగాఁ బయి కెగఁబ్రాకి యా పదార్థమును దినిపోవుచుండువాడను. ఒకనాఁ డాతని మిత్రుడు వీణాకర్ణుఁడచటికివచ్చెను. జూడాకర్ణుఁ డాతనితో మాటలాడుచు నన్ను భయపెట్టుటకై మాటిమాటికి గిలుక కఱ్ఱతో నేల మీదఁ గొట్టుచు వచ్చెను. అదిచూచి వీణాకర్ణుడు "ఏల యటులు గొట్టుచుంటివి? నామాటలయం దిష్టములేదా?" యని చూడాకర్ణు నడిగెను.

"ఇష్టము లేకపోవుట గాదు, చూడుము, ఆ యెలుక ప్రతిదినము నా కపకారియై పాత్రమునందలి పదార్థముఁ దిని వేయుచున్నది. దానిని బెదరించుటకై యిట్లుకొట్టుచుంటిని." అని చూడాకర్ణుడు బదులు పలికెను. అదివిని "యల్పజంతు వైన యెలుక కింత పైకెగురు శక్తి యెటులు వచ్చెను? దీని కేదోకారణ ముండితీరును. వెనుక శాండిలీమాతయను నొక బ్రాహ్మణి నువ్వుపప్పునకు మాఱుగా నువ్వు లడిగినందులకేదో కారణ ముండియుండునని యొక బ్రాహ్మణుఁడు గుర్తించెను. నీకా కథ చెప్పుదును వినుము" అని వీణాకర్ణుఁడిట్లు చెప్పఁదొడఁగెను.

నూవుల బ్రాహ్మణి కథ

పూర్వము నేనొక బ్రాహ్మణుని యింటికి భిక్షకై వెడలి యుంటిని. ఆయింటి బ్రాహ్మణుఁడు "ఱేపటి దిన మమావాస్య. బ్రాహ్మణులకు భోజనము పెట్టవలసియున్నది. పదార్థము లేవి సమకూర్చియుంటి" వని భార్య నడిగెను.

"పురుషులు తమ సామర్థ్యముచేతఁ బదార్థములు సంపాదించి యింటికిఁ దేవలయును. అపుడు స్త్రీలు గావలసిన పనులకు వాని నుపయోగింతురు. మీరు తేకుండిన నే నేమి చేయఁగలను?" అని యామె బదులు పలికెను.

దాని కా బ్రాహ్మణుఁడు కోపగించి "పదార్థములు సంపాదింప వలయునన్నమాట నిజమేకాని బ్రాహ్మణునకు విస్తారముగా సంపాదింపవలయు ననెడి కోరిక యుండరాదు. అట్లని విధాయక కృత్యముల కత్యవసర మైనవానిని భద్రపఱుపక పోవుట తప్పుకాదా?" యని భార్యను మందలించెను.

అపు డామె భర్తతో "నువ్వులు, బియ్యము గొంచెము కూడఁబెట్టి యుంచితిని. ఱేపు తిలాన్నముఁ జేయుదును లెండు" అని చెప్పి నువ్వులు బాగుగాఁ గడిగి యెండఁ బోసెను. ఒక కోడివచ్చి యానువ్వులు కాళ్ళతోఁ జిమ్మెను. బ్రాహ్మణుఁ డది చూచి బ్రాహ్మణ భోజనమున కీనువ్వులు పనికిరావు. కాఁబట్టి యవి తీసికొనిపోయి మార్చి తీసికొనిరమ్మని భార్యకుఁ జెప్పెను. తరువాత నామె నేను భిక్ష కేఁగిన యింటికి వచ్చి "నువ్వు పప్పుఁ దీసికొని నువ్వు లిచ్చెదరా?" యని యా యింటివారి నడిగెను. ఆ యింటి యిల్లా

లామాటలు విని సంతసించి యింటిలోనుండి నువ్వులు తీసికొని వచ్చి నువ్వుపప్పు పుచ్చుకొనుచున్న సమయమున నాయింటి బ్రాహ్మణుఁడెచటి నుండియో యింటికివచ్చెను. "భార్యను జూచి నీవేమి బేరమాడుచున్నావని ప్రశ్నించెను. ఆమె చెప్పిన సంగతి విని "వెఱ్ఱిదానా? చేరుడు నువ్వులు దీసికొని దంచిననువ్వు లిచ్చువా రెక్కడనైన నుందురా? ఈమె యిట్లు వచ్చుట కేదో కారణ ముండితీరును." అని యాబ్రాహ్మణుఁడు చెప్పుచుండగా భిక్షార్థ మచటనున్న నే నామాటలు విని యుంటిని. ఈ మూషికమును దగిన కారణము లేనిదే యిచట నింతధైర్యముగాఁ గాపురముండదు."

ఇట్లు వీణాకర్ణుఁడు చెప్పిన కథ విని వెంటనే చూడాకర్ణుఁ డొక గునపముఁ దెచ్చి నేను నివసించు కలుఁగును ద్రవ్వి చిరకాలమునుండి సంపాదించిన నా ధనమునంతను దీసి వైచెను. నాఁటినుండి యుత్సాహ మంతయుఁ బోయి యాహారమైనను సంపాదించుకొను శక్తిలేనివాఁడనై దిగులుపడి మెల్లమెల్లగాఁ దిరుగుచుంటిని.

చూడాకర్ణుఁ డట్టియవస్థలో నొకనాడు నన్నుఁ జూచి తన మిత్రునితో నిట్లనెను. "లోకమున ధనము గలవాడే బలవంతుడు. పండితుడు నాతడే. గ్రీష్మకాలమున నదు లింకిపోయినట్లు ధనములేనివాఁడు చేయఁదలపెట్టు కార్యములన్నియు జెడిపోవును. ధనముగలవారికే బంధువులు, మిత్రులు నిలిచియుండుదురు. బిడ్డలులేని యిల్లును, చుట్టములులేని దేశము, మూర్ఖుని మనస్సు శూన్యముగా నుండును. దారిద్రునకు సర్వము శూన్యముగ నుండును. దారిద్ర్యముకంటెఁ జావు మేలు. మరణము తత్కాలమున మాత్రమే బాధ గలిగించును. దారిద్ర్యము బ్రదికియున్నంతకాలము బాధించు చుండును. అన్నిలక్షణములును వెనుకటివలెనే యున్నను ధనము తొలఁగినంతనే వేఱుమనుజునివలె నయిపోవును. ఈ సంగతి యెంతయుఁ జిత్రమయినది. ధనముఁగోలుపోయి యీ యెలుక యెంత నిరుత్సాహ మొందినదియో చూడుము."

అది విని నేనిట్లాలోచించితిని. "ఇంక నే నిచట నుండుట దగదు. ఈ వృత్తాంత మెవ్వరికిఁ జెప్పను దగదు. "ధననాశము, మనోవ్యథ, యింటిగుట్టు, మోసము, పరాభవము నెవ్వరికిఁ జెప్పరాని" వని పెద్ద లందురు. దైవము మిక్కిలి ప్రతికూలమై పౌరుషము చెడిపోయినపు డభిమానము గలవానికి వనమే శరణ్యము. అభిమానవంతుఁడు మరణమైన నొందును గాని దైన్యము నొందఁడు. నిప్పు, నీరు చిలుకరించినను వెంటనే వేడిమి గోలుపోవదుగదా! మానవంతుఁడు పూలగుత్తివలె నందఱి శిరముల మీఁదనైన నుండవలయును. లేదా అడవిలో మంటియందుఁబడి నశించిపోవనైనఁ బోవలయును. ఇచటనే యుండి యాచించుకొని బ్రదుకుట కంటె నెందైనఁబడి చచ్చుట మేలు.

దారిద్ర్యము సర్వాపదలకు మూలము. కల్లలాడుట కంటె మౌనము మేలు. పరసతులఁ గూడుటకంటెఁ బురుషుఁడై పుట్టకుండుట మేలు. యాచించి జీవించుటకంటెఁ జావుమేలు. దుష్టవృషభము లుండుటకంటె గోశాల శూన్యమై యుండుట లెస్స. అవినీతురాలైన భార్యకంటె వేశ్య మేలు. అవివేకి పరిపాలనమున నుండుటకంటె వనవాసము మేలు. అధములఁ జేరుటకంటె మరణమే మేలు.

వెన్నెల చీకటిని హరించును. ముదుసలితనము లావణ్యమును హరించును. హరినామము పాపములను హరించును. యాచన సర్వసుగుణములను హరించివేయును. కావున నే నేల జీవనమునకై యితరులను గాచుకొని యుండవలయును. అట్లుండుటన్న మాఱురూపమున మృత్యువు నొందియుండుటయే>" అని యెంతో యాలోచించియుఁ దిరిగి లోభమునకు లొంగినవాఁడనై ధనము సంపాదింపఁ దలఁచి మరలఁ గలుఁగు నిర్మించుకొంటిని.

లోభ మెంతపాడుగుణము? దానివలన మతి చలించును. దాన దుఃఖము గలుగును. నే నట్లు మెల మెల్లనఁ దిరుగు చుండగాఁ జూడాకర్ణుఁడు చూచి యీమాఱు నన్నుఁగఱ్ఱతోఁ గట్టిగాఁ గొట్టెను.

"ఎవనిమానసమునకు సంతుష్ఠి కలుగదో వానికి సర్వాపదలును సంభవించును. తృప్తిగలవానికి సకల సంపదలు నున్నట్లే యుండును. చెప్పులుదొడిగిన కాళ్ళకు లోకమంతయుఁ జర్మమయముగఁ దోఁచును. సంతుష్టుఁడైన వానికిఁ గలుగు సుఖ మెంతధనమున్న వానికిఁ గలుగనేరదు. తృప్తి గలవానికి సర్వమునొడగూడును? తృష్ణకు వశుఁడైనవాఁడు దూర మనుకొనక నూఱుయోజనములైనఁ దిరుగును. సంతుష్టుఁడు ధనము మోకాలిదగ్గఱికి వచ్చినను లెక్కసేయఁడు. వనములో ఫలమూలాదులు దిని సెలయేటినీరు ద్రావి తృణ శయ్యపై బరుండి బ్రదుకుట మేలగునుగాని ధనహీనుడై బంధు మిత్రాదుల నడుమ నుండ దగదు." అని యెంచి యాస్థల మంతటితో విడిచి నిర్జనవనముంజేరితిని. పుణ్యవశమునఁ గొంతకాలమున కిట్టి మిత్రుఁడు లభించెను. నాయదృష్టమువలనఁ జివరికి నీయాశ్రయ మనెడి స్వర్గమే లభించినది. సంసార మనెడి విష వృక్షమునకుఁ గావ్యామృత రస మనుభవించుట, సుజనులతో సాంగత్యముచేయుట యనునవి రెండే రసవంతములయిన ఫలములు." అని హిరణ్యకుఁడు వివరించిన సంగతులన్నియు వినిమంథరుఁడిట్లుపలికెను.

"అర్థములు నిలుకడ గలవికావు. యౌవనము సెలయేటి నీటివంటిది. జీవితము నీటిబుడగవంటిది. తగినకాలమున ధర్మ మాచరింపనివాడు వార్థక్యమొంది పశ్చాత్తాప మనెడి యగ్నిచే దహింపఁబడును. నీ వతి సంపాదనముఁ జేసితివి. అందుచేతనే బాధకలిగినది. తటాకజలముపొంగి గట్లు త్రెంచి వేయకుండుటకు జలమును విడుచు

తూఱ యవసరమైనట్టు సంపాదింపఁబడిన ధనమునకు దానమనెడి రక్షణ మావశ్యకము. ధనము పాతఱలో దాచుట దాని నాశనమునకు దారి చూపుటయే.

తన సుఖము లెక్కింపక ధనము సంపాదించువాడు పరులబరువు మోయువానివలె శ్రమకుమాత్రమే పాలగును. దానభోగములే ధనమునకు ఫలములు. అవిలేని ధనికుఁడు దరిద్రునికంటె నధికుఁడుగాడు. ధనమున్నను సుఖముగా ననుభవింపనివాఁడు దరిద్రునితో సమానుడే. సంపాదించుట యందును రక్షించుటయందును శ్రమ మాత్ర మాతనికి విశేషము. మంచిమాటలతోడి దానము, గర్వములేని జ్ఞానము, నోర్పుతోడి పౌరుషముఁ బ్రశస్తములు. ధనసంపాదన మవసరమే యైనను దానియం దతివాంఛ దగదు. పూర్వ మొక నక్క యెక్కువ సంపాదింపఁగోరి వింటి దెబ్బచే మరణించెను. నీకా కథ చెప్పుదును వినుము.

అతి సంపాదనేచ్ఛచే వింటిదెబ్బతగిలి మరణించిన నక్కకథ

కల్యాణకటకమను పట్టణమున భైరవుఁ డనెడి బోయవాఁడు గలడు. వాఁడొకనాడు వేటకై యడవి కేఁగెను. అచట నొక మృగమును వేటాడి చంపి దానిని బుజముపై మోచికొని వచ్చుచుండగా నొక యడవిపంది యాతనికిఁ గనఁబడెను.

ఆతఁడు బుజము మీఁది లేఁడిని క్రిందికిఁ దించి విల్లెక్కు వెట్టి బాణము సంధించి యా వరాహముం గొట్టెను. అదియు మిక్కిలి కోపముతో ఘుర్ఘురధ్వని చేయుచుఁ గొమ్ముస వానిం గొట్టగా నాదెబ్బకాతడు మొదలు నఱకిన చెట్టువలె నేలమీఁదఁ గూలి ప్రాణములు విడిచెను. బాణపు దెబ్బచేత నడవిపందియు మరణించెను. అచ్చట నొక సర్పము కిరాత సూకరముల కాలి త్రొక్కిడికి నలిగి చచ్చెను.

ఇంతలో దీర్ఘరావ మను నొకనక్క యాయడవియందాహారమునకై తిరుగుచు నచటికివచ్చి చచ్చిపడియున్న బోయవానిని, సర్పమును, వరాహమును జూచి యిట్లాలోచించెను.

“నాకిపుడు గొప్పయాహారము దొరకినది. ప్రాణులకు దుఃఖము లేనివిధముగా ననుకొననిదే కలుగుచుండునో దైవశమున సుఖములును నట్లే సంభవించుచుండును. నా కీయాహారము మూఁడునెలలవఱకును సరిపడును. ఈ కిరాతునిమాంస మొక నెలకుఁ జాలును. లేడిమాంసముతో నింకొక నెలయుఁ బంది మాంసముతో మఱియొకమాసమును గడుపవచ్చును. సర్పమాంస మొక్కరోజునకుఁ జాలును. ఈవింటినారి నరము దిని మొదటియాకలి దీర్చుకొందునుగాక” యని తలఁచి యావింటి చేరువకుఁ బోయి నారి గొఱుకగనే బెట్టువదలి వింటికొన గాటముగ ఱొమ్మునఁ దగిలి ప్రాణములు దీసెను.

అతిలోభ మెంత హానికరమో చూడుము. దానమునకు భోగమునకు వినియోగపడినది మాత్రమే స్వధనము. అట్లుపయోగింపక కూఁడబెట్టినది యితరులపా లగును. గతించిన దానికి విచారమేల? పండితులు రానిదానికై ప్రాకులాడరు; పోయినదానికి విచారింపరు. ఆపదవచ్చినను గలఁత నొందరు. కావున నీవెప్పుడు నుత్సాహముఁ గోలుపోవకుము. శాస్త్రములెన్ని చదివినను గ్రియాశూన్యునిఁ బండితుఁ డనుట చెల్లదు. ఔషధమెంతమంచి మందైనను బేరుచెప్పినంతమాత్రాన రోగులకు సుఖమొసఁగదు గదా! ఉత్సాహములేనివానికిఁ బాండిత్యము గ్రుడ్డివానికిఁ దనచేతియందలి దివ్వియవలె నిరుపయోగము. కావున నోరిమి వహింపుము. పరస్థలమునకు వచ్చితినని చింతింపకుము.

రాజు, కులస్త్రీ, మంత్రులు, దంతములు, కేశములు, నఖములు, నరులు స్థానభ్రష్టులైన శోభింప రను వాక్యము కాపురుషుల విషయమున మాత్రమే వర్తించును. సింహములు, సత్పురుషులు, గజములు, సర్వదేశములందు సంచరించి కీర్తినొందుట లేదా? మఱియుఁ గాకములు, మృగములు, కాపురుషులు స్థానమునుండి కదలఁజాలక యచటనే నశింతురు. అభిమానధనుఁడగు వీరునకుఁ దనదేశమనియు, బరదేశమనియు భేదములేదు. ఎచటికేఁగిన నచటనే తనసామర్థ్యముచేత ఖ్యాతిఁగాంచును. నిండిన చెఱువును మండూకములు సేరినట్లు సర్వసంపదలు నుత్సాహవంతుఁడగు పురుషునిఁ బొందును.

దేహికి సుఖదుఃఖములు కాలక్రమమున సంభవించుట సహజము. సంపదగలిగినపుడు గర్వము, నాపద గలిగినపుడు ఖేదముఁ దగవు. ధనములేకున్నను వీరుఁడు గౌరవము సంపాదింపఁగలడు ఎంతధనమున్నను నీచునకు గౌరవ మించుకయైనఁ గలుగదు. కుక్కకు బంగరునగ లెన్నితొడిగినను సింహమునకుండు సహజతేజస్సు గలుగదు గదా! మేఘముల చాయము, ఖలుల ప్రీతియు, యౌవనము, ధనముఁ గొలఁది కాలముమాత్రము నిలిచియుండును. పుట్టించినప్రాణు లందఱకు నాహారము దేవుఁడే యేర్పఱుపక మానఁడు. కాబట్టి యాహారమునకై యంతప్రయాసపడ నక్కఱలేదు. ధనము లేవిధమునఁ జూచినను దుఃఖ కారణములే యగుచున్నవి. ముందు ముందు సంపాదించుట కష్టము. పిదప దానివలనఁ గలుగు గర్వము కలిగించు దుఃఖము లనంతములు. సంపాదించిన ధనములకు హాని గలిగిన నెట్టిదుఃఖము గలుగునదియు వర్ణింపఁ జాలము.

ధర్మకార్యములపేరు చెప్పి ధనము సంపాదించుటయు ననవసరము. అడుసు ద్రొక్కనేల? కాలుకడుగ నేల? ఆకసమునఁ బక్షులచేతను, నేలమీఁదఁ బులులచేతను, జలములందు మకరములచేతను నామిషము భక్షింపఁ బడుచుండును. ధనికు నందఱు నన్నివిధముల వేధించుకొని తినుచుండుదురు. దేహిని మృత్యువు బెదరించునట్లు, రాజు, జలము, నగ్ని, స్వజనులు ధనికు నెల్లపుడును బాధించుచుందురు. ధన సంపాదనమే

కష్టము. ఆర్జించిన దానిం గాపాడుకొనుట మఱియుఁ గష్టము. దానికి హాని గలిగెనా మృత్యుబాధ గలుగును. కావున దానిపై నాశవీడుట మేలు. తృష్ణ ప్రసరించినవాని శిరముపై దాస్యము తాండవించుచుండును. అది వీడిననాడు ధనికుఁడనియు, దరిద్రుఁడనియు భేదభావము గలుగదు. నెఱవేఱుచున్న కొలఁదియుఁ గోరికల కంతమే యుండదు. కావున నిచ్చట నుండి కాలము గడపుము." ఈవిధముగాఁ బలికిన మంథరుని మాటలు విని లఘుపతనకుఁ డిట్లనెను.

"మంథరా! ధన్యుఁడ నైతిని. నీగుణములు కొనియాడ దగినవి. బురదలో దిగఁబడిన యేనుగులను లేవనెత్తుట కేనుఁగులే సమర్థము లయినట్లు సత్పురుషుల కాపద గలిగినపుడు సన్మిత్రులే దానినిఁ దొలఁగింపఁగలరు. మహాత్ముల స్నేహము లామరణాంతములు; కోపములు క్షణికములు; త్యాగములు జంకులేనివి. యాచకుని, శరణాగతుని, నెవరు నిరాశతో వెడలింపరో వారే సకలగుణములకు నాలవాల మగుదురు."

చిత్రాంగుని చేరిక

అనంతరము మంథరాదులు మువ్వురును హాయిగా గాలక్షేపము సేయుచుండిరి. ఇట్లుండగా నొకనాడు చిత్రాంగుఁడనెడి లేడి యొక వేటకానిచేఁ దఱుమఁబడి యచటికిఁ బరువెత్తుకొని వచ్చెను. అదిచూచి భయపడి మంథరుఁడు జలములోఁ బ్రవేశించెను. మూషికము కలుగులోనికిఁ బాఱిపోయెను. వాయసము చెట్టుమీఁది కెగిరి నలువైపులు చాలదూరము పరికించి భయమునకుఁ గారణమేమియులేదని తెలిసికొని మంథర హిరణ్యకులకుఁ దెలిపెను. మరల ముప్పురుఁ గూడుకొనిరి. అపుడు వణఁకుచు నచటనున్న మృగముం జూచి మంథరుఁడు "నీ వెవఁడవు? ఏల యిచటికిఁ బాఱి వచ్చితివి?" అని యడుగఁగా, "వేటకాఁ డొకడు తఱుముచుండఁగా భయపడి తప్పించుకొని వచ్చి మీ శరణముఁ జొచ్చితిని. మీ చెలిమి గోరుచుంటిని." అని యా హరిణము బదులు పలికెను.

అపుడు హిరణ్యకుఁడు "మిత్రమా! స్వాగతము. స్వేచ్ఛముగా మాతోఁబాటు స్వగృహమునందువలెనే సంచరింపుము" అని పలికి, యది యాహారపానీయములు దీసికొని నెమ్మదించిన తర్వాత "సఖుఁడా! నిర్జనమైన యీ వనమున నిన్నెవరు తఱుముకొని వచ్చిరి? వేటకాండ్రెవరైన నపుడపు డచట సంచరింతురా?" యని యడిగెను.

దానికి మృగ మిట్లు చెప్పెను. “కళింగదేశమున రుక్మాంగదుఁ డనుఁరాజు గలడు. ఆతడు దిగ్విజయమునుగోరి వచ్చి చంద్రభాగానదీతీరమున సేనలను విడియించెను. ప్రాతఃకాలమున నాతడు కర్పూరసరస్సునొద్దకు రాఁగలఁడని వదంతి వినఁబడుచున్నది. ప్రాతఃకాలమున నిఁక నిట నుండుట మంచిదిగాదు. ఏమిచేయఁదగునో యాలోచింపుడు.”

లేఁడి మాటలు విని మంథరుఁడు భయపడి మఱియొక చెఱువునకుఁ బోవుదు మని పలికెను. కాకియు, మృగమును “సరే” యనెను. వారి మాటలు విని హిరణ్యకుఁడు నవ్వి “మఱియొక జలాశయమునకుఁ బోయినయెడలఁ గుశల మని మంథరుఁడు చెప్పినది సత్యమే. కాని మెట్టదారిఁ బయనము సేయుట ప్రమాదకరము గాదా? జలజంతువులకు నీరును, దుర్గనివాసులకు దుర్గమును, శ్వాపదాదులకు స్వస్థలమును, రాజునకు సన్మంత్రియు బలము గదా? దూరాలోచనలేని కార్యమునకుఁ బూనుకొన్నయెడలఁ బిమ్మట విచారింపవలసి వచ్చును. ఈ యర్థమును దెలుపు కథ యొకటి గలదు. వినిపించెదను. వినుడు” అని యిటు లా కథ చెప్పఁదొడఁగెను.

దూరాలోచన లేక ముంగిసను జంపి విచారించిన బ్రాహ్మణుని కథ

గౌడదేశమునం దొక యగ్రహారమున దేవశర్మ యను బ్రాహ్మణుఁడు గలడు. అతని భార్య యజ్ఞ సేన. సంతానము లేక లేక కొంతకాలమున కామె గర్భవతి యయ్యెను. దాని కాబ్రాహ్మణుడు మిగుల సంతోషించి కోరిక లీరికలెత్తగా “ఓప్రియురాలా! నీగర్భమునందున్న కుమారుఁడు మన కులమెల్ల నుద్ధరింపఁగఁలడు. మహాభాగ్యవంతుఁడు కాగలడు.” అని పలుకగా విని యజ్ఞసేన, “నాథా యిటువంటికోరికలు గోరుట మంచిదిగాదు. అనాగతకార్యములను గుఱించి యెవఁడు చింతచేయునో వాఁడు సోమశర్మ తండ్రివలె విషాదము నొందును. మీకాకథ దెలుపుదు వినుఁడు.

సోమశర్మ తండ్రి కథ

ఒకానొక బ్రాహ్మణకుమారుఁడు విద్యాభ్యాసము చేయుచు నొక బ్రాహ్మణుని యింటఁ దద్దినపు భోజనముచేసి వచ్చుచుండెను.అతనికి వారు కొంత పేలాలపిండి యొసఁగిరి. ఆతఁడది యొక కుండలో నుంచుకొని తనయొద్దఁ బెట్టుకొని భుక్తాయాసము దీఱుటకై

యొక యరుగుమీఁదఁ బండుకొని నిదురవోయెను. అపుడు మితిలేని కోరిక లాతని మనసునఁ గలుఁగ జొచ్చెను.

"ఇపుడు నాదగ్గఱఁ బేలాలపిండి యున్నదిగదా! నేను దీనిని విక్రయించి యొక పాడిమేకను గొనియెదను. దానికి రెండు పిల్లలు గలుగును. ఆ రెండును గొంతకాలమునకు రెండేసి పిల్లల నీనును. ఆనాలుగింటికి నెనిమిది పిల్లలు పుట్టును. ఈవిధముగాఁ గొంతకాలమునకు వేలఁకొలఁదియు మేఁకలగును. తరువాత వాని నమ్మి నూఱావులఁ గొందును. అవి ప్రతి సంవత్సరము నీనుచుండును. కొన్ని సంవత్సరములకు వేలకొలఁది సంఖ్యగల యావులతోను, బెయ్యలతోను, కోడెలతోను దొడ్డి నిండియుండును. కొన్నికోడెల నరకలు గట్టించి దున్నించి విస్తారమయిన పంట పండించి యాధాన్యముల నమ్మివేయుచుందును. కొన్నికోడెలను విక్రయించి మఱికొంత ధనము సంపాదింతును.

ఈప్రకారముగా సంపాదించిన ధనముం జూచి "నీకుఁ గన్యనిచ్చెద" మని యనేకులు వచ్చెదరు. వారిలోఁ గులంబును రూపంబును, గుణమును గలిగిన కన్య నెంచికొని పెండ్లియాడి యామెతో సంసారము చేయఁగా నొకకుమారుడు పుట్టును. ఆబాలునకు సోమశర్మయని పేరువెట్టుదును. కొన్ని నెలలయిన తరువాత వానికి బంగరు మువ్వలమొలత్రాడు, రావిరేక మురుగులు, గొలుసులు, అందెలు మొదలయిన నగలుపెట్టి యాదరముతోఁ జూచెదను. వా డాడుకొనుచు నల్లరిచేయు సమయమున నేను పనితొందరలోనుండి పిల్లవానిం దీయుమని నాభార్యను బిలిచెదను. ఆమెయు నేదోపనిలోనుండుట వలన నాలస్యము గావచ్చును. ఆలస్య మైనందులకుఁ గోపగించి యామె నీకఱ్ఱతోఁ గొట్టెదను" అని యాలోచించుచుఁ బేలపిండి తినుటకుఁ గుక్కలు మొదలగునవిరాకుండ బెదరించుటకు దగ్గఱనుంచుకొన్న కఱ్ఱగిరగిరఁ ద్రిప్పికొట్టెను. ఆదెబ్బతగిలి పేలపిండి యున్నకుండ పగిలిపోయి పిండియంతయుఁ జెదరి మంటిపాలయి పోయెను. దానితో మెలఁకువవచ్చి, జరిగినది తెలిసికొని యా బ్రాహ్మణ కుమారుడు మిక్కిలి విషాదము నొందెను. కాఁబట్టి యనాగతకార్యముల గుఱించి చింతింప రా దంటిని" అని చెప్పిన భార్యమాటలు విని దేవశర్మ కొంచెము సిగ్గుపడియూరకుండెను.

తరువాతఁ గొన్నిదినములకు యజ్ఞసేన శుభలక్షణములతోఁగూడిన కుమారునిఁ గనెను. కొన్నాళ్ళయినపిమ్మట నొకనాఁడు పర్వదినమగుటచేత నామె కుమారునిఁ బెనిమిటి కప్పగించి నదికి స్నానమునకుఁ బోయెను. ఆమెనది కేఁగిన వెంటనే యాదేశము నేలు రాజా యగ్రహారమందలి బ్రాహ్మణులను దాన మిచ్చుటకై పిలువనంపెను. బ్రాహ్మణులు కొందఱపుడు దానము గ్రహించుటకై వెళ్ళుచుండిరి.

వారిం జూచి దేవశర్మ యిట్లు చింతించెను. "అయ్యో నేఁడు నాభార్యను స్నానమున కెందుల కంపితిని? నేను రాజ దర్శనమునకుఁ బోయినచో నిపు డీ శిశువు నెవ్వరు

గాపాడుదురు? "రాజు నన్నెపుడు పిలుచును? ఎపుడు దాన మిచ్చును? ఎపుడు భాగ్యవంతుఁడ నగుదును?" అని చిరకాలమునుండి నిరీక్షించుచుంటిని. ఇపుడవకాశము రాఁగా వెడలుటకు వీలు లేక పోవుచున్నదే!" ఇట్లు విచారించి యించుకసే పాలోచించి, చాలకాలము నుండి బిడ్డనువలెఁ బెంచిన ముంగిసను బాలునియొద్దఁ గావలియుంచెదనని నిశ్చయించి దానినిఁ బిలిచి "నీ విచటనుండి యీ శిశువును గనిపెట్టుచుండు" మని సంజ్ఞాపూర్వకముగాఁ దెలిపి, దానిని ద్వారమందు నిలిపి రాజ భవనమునకుఁ బోయెను.

బ్రాహ్మణు డట్లు వెడలిన తరువాత నొక నల్లత్రాచు శిశువు చెంతకుఁ బ్రాకిపోవుచుండెను. ముంగిస యదిచూచి సర్పము మెడఁబట్టి కొఱికి చంపివైచి దానిశరీరమును ముక్కలు ముక్కలుగాఁ జేసివైచెను. నోటినిండఁ, దనదేహమునిండఁ బాము రక్త మెట్టిగా నిగనిగలాడుచుండగా నాముంగి మరల ద్వారము నొద్దకు వచ్చి నిలిచెను.

అచట నాదేవశర్మ రా జొసగిన విలువయైన దానముఁ బుచ్చుకొని బిడ్డ యేమయ్యెనో యని తలఁచుకొనుచు మిక్కిలి త్వరితముగా నింటికి వచ్చెను. వచ్చియురాఁగానే నెత్తుటితో నిండియున్న ముంగి తన విధిని జయప్రదముగా నెఱవేర్చితి నన్న గర్వముతో యజమానుని పాదముల కడకుఁ బరుగిడెను. ఊయలలోను, దాని శరీరమునను గల రక్తము కంటఁబడఁగానే యాముంగిస దన బిడ్డను గొఱికివైచినదని యెంచి యా బ్రాహ్మణుఁడు కోప మాపుకొనలేక యచటనున్న రోకటితో గొట్టి దానిం జంపి వైచెను. అనంతర మాతఁడూయెలదగ్గఱకు బోయి సంతసముతో గాలుసేతు లాడించుచు నవ్వుచున్న తనబిడ్డను గనుఁగొనెను. ప్రక్కను తునుకలుగాఁ జేయబడి యున్న సర్పమును గాంచెను. వెంటనే జరిగిన సంగతి గ్రహించి గుండెలు బాదుకొనుచు "మందబుద్ధినగు నేను బాగుగా నాలోచింపక తొందరపడి దారుణము గావించితి" నని విలపించు చుండెను. ఇంతలో యజ్ఞసేన స్నాము చేసివచ్చి జరిగినది తెలిసికొని విచారించెను. కావున నేపనియు దూరమాలోచింపక చేయరాదు."

హిరణ్యకుఁడీవిధముగా నెంతచెప్పినను వినక భయము చేత మంథరుడు మఱియొక చోటునకుఁ బోవుటకే నిశ్చయించి పయనమాయెను. స్నేహవశమున హానిని శంకించుచు హిరణ్యకాదులును వెంట నేగుఁచుండిరి. అట్లు నేలమీదఁ ప్రయాణము సేయుచుండగా నొకవేటకాడు చూచి మంథరునిఁ బట్టుకొని వింటికొనకుఁ గట్టివైచి తిరిగి తిరిగి యాకలి గొని యింటికి మరలిపోవుచుండెను. వెంటనున్న మృగవాయస మూషికము లీసంగతి చూచి మిక్కిలి విషాదమొంది వేటగాని ననుసరించి పోవుచుండెను. అట్లు పోవుచు హిరణ్యకుఁ డిట్లు చింతించెను.

"ఒక దుఃఖము ముగియులోపలనే మఱియొక దుఃఖము సంప్రాప్తమయ్యెను. సందు దొరకినపుడే యనర్థములన్నియు నొకదానివెంట నొకటి వచ్చి మీఁదఁబడును. ఆపద గలిగినపుడు ప్రాణములు సయితము లెక్కసేయక కాపాడు సన్మిత్రుడు మహాభాగ్యమువలనఁ గాని లభింపడు. శోకము నుండియు, శత్రువుల నుండియుఁ గాపాడునట్టియు; బ్రీతి విశ్వాసములకుఁ బాత్రుఁడు నగు "మిత్రుఁడు" అను నక్షరత్రయముతోడి రత్న మెవరివలన సృష్టింపఁబడెనో కదా! సన్మిత్రుని యందుండు నమ్మకము తల్లియందును, దండ్రియందును, భార్య యందును, సోదరునియందును గుమారుని యందును గూడ, గలుగదు.

ఇదియంతయు దైవకల్పితము. పూర్వకర్మవలని ఫలము మంచిదైనను, జెడ్డదైనను ననుభవింపక తప్పదు. శరీరమున కెల్లప్పుడు నపాయము సిద్ధము. సంపద లాపదలకు మూలములు. స్నేహము లనిత్యములు. జనించిన దేదియు నశింపక మానదు.

ద్రవ్యాభిలాషచే సంపద గలిగినపు డందఱును మిత్రులగుదురు. సుఖమునందువలె దుఃఖమునందును బాలుపంచు కొనువాఁ డెవ్వఁడో వాఁడే నిజమగు మిత్రుఁడు. దీనికి విపత్తులే నికషోపములు." ఇట్లు విచారించి చిత్రాంగ లఘుపతనకులతో నిట్లనియెను.

"ఇంక విచారించుచు నూరకుండిన లాభములేదు. బోయవాఁడీ యడవి దాటకముందే మిత్రుని విడిపింపవలయును. నాకొక యుపాయము తోఁచుచున్నది. చెప్పెదను. వినుఁడు. చిత్రాంగుఁడు కిరాతకుఁడు పోవుమార్గమున నొక మడుగుచెంతఁ జచ్చినట్లు పడియుండవలయును. కాకి చిత్రాంగునిపై వ్రాలి ముక్కుతోఁ బొడుచుచున్నట్లు నటింపవలయును. ఈ బోయ మృగము చచ్చి పడియున్నదని తలఁచి తప్పక మంథరు నచట విడిచి మృగమును గ్రహించుటకై ప్రయత్నపడును. నే నపుడు క్షణములో మంథరుని బంధములు దెగఁగొఱుకుదును. అపు డాతఁడు నీటిలోఁ బ్రవేశించును. బోయ మిమ్ము సమీపించు సరికి వేగముగాఁ బాఱిపొండు" అని చెప్పఁగా నవి రెండును నట్లే కావించెను.

కిరాతుఁ డలసినవాఁడై పానీయముల ద్రావి యామడుగుదరి నున్న చెట్టునీడ యందుఁ గూరుచుండి యాహరిణముంగాంచి సంతసమంది దాని దరికేఁగెను. హిరణ్యకుం డంతలోవచ్చి మంథరుని బంధములు గొఱికివేయఁగా నాతఁడు జలములలోఁ బడెను. బోయ సమీపించుసరికి లేఁడిలేచి వేగముగాఁ బాఱిపోయెను. ఆవ్యాధుఁ డిదియంతయు జూచి "సిద్ధించిన దానిని విడిచి యెవ్వఁడు మఱొకదానికై లోభపడునో వాఁడు తుదకు "రెండింటికి జెడిన రేవఁ" డగును అని విచారించి నిరాశుఁడై యింటికిఁ బోయెను. మంథరాధులందఱు నీవిధమున నాపదనుండి తప్పించుకొని సుఖముగా నుండిరి.

రాజపుత్రులారా! మీరును సుజనులగు మిత్రులను సంపాదించి మీరు మేలొంది లోకమునకు మేలుగూర్చుఁడు" అని విష్ణుశర్మ చెప్పగా వినివారు కడుంగడు

మోదమొందిరి.

మిత్రభేదము

అనంతరము రాజపుత్రులు విష్ణుశర్మతో “ఆర్యా తమదయవలన మిత్రలాభము వినియుంటిమి. ఇక మిత్రభేదము విన< గుతూహలముతో నుంటి” మని పలికిరి. విష్ణుశర్మవారికిట్లు చెప్ప<దొడ<గెను.

“దక్షిణదేశమున సువర్ణపురమను నగరముగలదు. ఆనగరమున వర్ధమాను<డను వణిజుడు నివసించుచుండెను. అతడు ధనికుడే యైనను దనకంటె నైశ్వర్యవంతులయిన బంధువులను జూచి వారికంటె నెక్కువ ధనము సంపాదింప వలయునని యూహించెను. తనకంటె< దక్కువవాని< జూచిన నెవ్వడైన నధికు<డే యగును. తనకంటె నధికులను గుఱించి యాలోచించినపు డెంతవా<డైన< దాను దరిద్రు<డుగనే యుండును.

“మహాపాతక మొనరించిన ధనముగల నరు<డు పూజింప<బడును. చంద్రునివలె స్వచ్ఛమయిన వంశమున< బుట్టిన వా<డైనను నిర్ధను<డు నిరాదరింప< బడును. కావున ధర్మముదప్పని యేమార్గమున నైన ధనము సంపాదింపవలయును. ధర్మార్థకామమోక్షము లనెడి నాలుగు పురుషార్థముల లోపల నర్థమే ముఖ్యమయినది. అట్టిధనము సంపాదించి దానిం గాపాడి పెంపొందింప వలయును. పెంపొందిన దానిని సరియైన విధమున నుపయోగింపవలయును.

ధన ముండియు సరిగా< గాపాడకున్నచో నది నశించి పోవును. లభించినధనము వృద్ధినొందింపని యెడల< గొంచెముగా ఖర్చుపెట్టుచున్నను గాటుకవలె హరించిపోవును. ధనముండియు ననుభవమునకు రానిచో నది నిరుపయోగము దానభోగముల కుపయోగింపని ధనమును, శత్రువిజయము సంపాదింపలేని బలమును, ధర్మమాచరింపని వాని పాండిత్యమును, నింద్రియజయములేనివాని బుద్ధివిశేషమును నిరుపయోగములు.

జల బిందువులను సేకరించుటవలన ఘటము పూరింప<బడునటులు సకలవిద్యలు, ధర్మము, ధనము క్షణక్షణము< గణము కణముచొప్పున సంపాదింపవలయును. దానోపభోగములు లేక రోజులు వెళ్ళ<బుచ్చువాడు చర్మముతో< జేయ<బడిన కొలిమితిత్తివలె శ్వాసగలిగియున్నను జీవములేనివా<డే.

అట్టిధనము సంపాదించు మార్గములలో వాణిజ్యమే యుత్తమ మయినది. అవసరమయిన యెడల దూరదేశముల కేగి<యైన వాణిజ్యము చేయవలయును. ఆలస్యము, స్త్రీసేవ, రోగము, జన్మభూమి విడువకుండుట, యల్పసంతుష్టి, భయము నను నవి యభివృద్ధికి< బ్రతిబంధకములు.” ఈవిధముగ నాలోచించి వర్ధమాను<డు వాణిజ్య మొనరించి విశేషధనము సంపాదింప నిశ్చయించుకొనెను.

ఒక మంచిముహూర్తమున నందక సంజీవకము లనెడి రెండెద్దులను గట్టించి వర్ధమానుఁడు బండి సిద్ధము చేయించెను. కాశ్మీర దేశమునఁ దక్కువగానుండి తనదేశమునఁ బుష్కలముగా నుండు విలువయైన వస్తువులను సేకరించి తన బండియం దుంచుకొనెను. ఇంకను విస్తారమయిన పలురకములయిన వస్తువులను సంపాదించి పెక్కు బండ్లనిండ వేయించెను. మరికొన్ని సామగ్రులను కావళ్ళతోఁ గొనిరా సేవకులను నియోగించెను. ఈవిధముగాఁ దగుపరివారమును గూడబెట్టుకొని వర్ధమానుఁడు వాణిజ్యమునకై కాశ్మీరదేశమునకుఁ బయనమాయెను. సమర్థులకుఁ జేయరాని పనియు, నుద్యోగులకు దూరభూమియుఁ, బండితులకుఁ బరదేశమును, బ్రియమైన మాట లాడువారికి శత్రువులును గలుగరు.

వర్ధమాను డటులు బయలుదేఱి సుదుర్గపర్వత సమీపమందలి యడవి మీఁదుగాఁ బోవుచుండెను. ఆ యరణ్య ప్రదేశమున దారి సమముగా నుండక మిట్టపల్లములుగా నుండుటవలన నొక చోట సంజీవకము కాలుజాఱి పడిపోయెను, ఈవిధమున గాలు విఱిగి పడిపోయిన సంజీవకముం జూచి వర్ధమాను డిట్లు చింతంచెను.

"పురుషుఁ డెంతప్రయత్నము జేసినను దైవానుకూల్యమును బట్టియే యది ఫలించుచుండును. ఊరక విచారించిన నించుకంతయుఁ బ్రయోజనములేదు. కావునఁ బురుషుఁడు వృథావిచారము మాని కార్యసిద్ధికై మరలమరల యత్నింపవలయును." ఇట్లు నిశ్చయించి సంజీవకము కాడికట్టు వదలించి సేవకులను బంపి యచ్చటికి సమీపమునున్న ధర్మపురమను గ్రామమునుండి బలిష్ఠమైన యెద్దును గొని తెప్పించి దానిని బండికిఁ గట్టించుకొని సంజీవకము నచ్చట దిగవిడచి ముందునకు సాగిపోయెను.

సంజీవకము దైవవశమునఁ గ్రూరజంతువుల బారిఁబడక యచటి పచ్చిక దిని, సమీపమందలి వాగులోని నీరుద్రావి క్రమక్రమముగాఁ గాలినొప్పి తగ్గి విఱిగినకాలు తిన్నఁబడి యిటునటుం దిరుగులాడఁ జొచ్చెను. ఆయువు గట్టిగా నున్నయెడల సముద్రమున మునిఁగినను, బర్వతము మీఁది నుండి పడినను, మహాసర్పముకాటు దిన్నను బ్రాణములు పోవు. కాలము రానంతవఱకు బాణశతములచేఁ గొట్టినను చావు గలుగదు. కాలము సమీపించినపుడు దర్భముల్లు తాఁకినంత మాత్రముననే ప్రాణము లెగిరిపోవును. దిక్కులేక యడవియందు విడువఁబడిన వాఁడైనను నెట్లో జీవించును. దైవము సాయపడనిచో నింటియందు సకలోపచారములు నుండియు మరణించును.

కొంతకాల మైన పిమ్మట సంజీవకము స్వేచ్ఛగా విహరించుచు బలిసిన శరీరము గలది యయ్యెను. ఒక్కనాఁ డుత్సాహాతిశయమున గుహలు ప్రతిధ్వనించునట్లు మిక్కిలి గట్టిగా అంకె వైచెను.

ఆవనమునఁ బింగళకుడను నొక సింహము కలదు. అది తనబలముచేత నచటి జంతువు లన్నిటిని లోఁబఱచు కొని సుఖముగా నా యడవి నేలుకొనుచుండెను. ఆసింహ

మానాఁడు దప్పిగొని పానీయములు ద్రావుటకై యమునానదికిఁ బోవుచు సంజీవక మొనరించిన యకాల మేఘ గర్జనమువంటి యఱపువిని భయపడి పానీయములు గ్రోలకయే వెనుకకు మరలి తనతావునకుఁ బోయి "ఇది యేమై యుండు" నని యాలోచించుచు విన్నఁబోయి యుండెను.

ఆవనములోనే నివసించుచున్న కరటక దమనకము లనెడి రెండు జంబుకములు పింగళకుఁడు నీరు ద్రావఁబోయి భయపడిన విధము గమనించినవి. అందులో దమనకుఁడు కరటకునిఁ జూచి "సఖుడా! మన రాజైన పింగళకుఁడు దప్పిగొనియు జలములు గ్రోలక వెనుదిరిగి పోయి వెఱపుతో నుండెను. కారణ మేమియై యుండును? విషయముఁ కనుఁగొని యాతని భయము మాన్పి యాతని యాశ్రయము సంపాదింప వీలు పడునేమో?" అనఁగా గరటకుఁడు "మన మాతని సేవించుట లేనపు డాతని చేష్టలు విమర్శించుట మన కనవసరము. మఱియు నీరాజు, పూర్వ మీతని సేవలు చేయునపుడు నిరపరాధులమగు మనల నవమానించి యున్నాడు. జీవనార్థియై పరులను సేవించుటలో ననుభవించు శీతవాతాతపక్లేశములో నాల్గవపాలు సహించి, తప మొనరించి సుఖము పడయ వచ్చును. ఎవరి జీవనము పరుల కధీనమై యుండదో వారి జన్మము సఫలము. పరాధీనులై జీవించుటకంటె మరణించుటమేలు. "లెమ్ము, రమ్ము పొమ్ము, మాటాడకుము, చెప్పుము" అని సేవకులను రాజులు బాధించుచుందురు. పుణ్యస్త్రీలవలె మూర్ఖులు ధనలాభము కొఱకు మాటిమాటికిఁ దమ యాత్మను సంస్కరించి సంస్కరించి పరుల కుపకరణము గావింతురు. సహజముగాఁ జంచలముఁ, దగని విషయములపైఁ బ్రసరించు నదియు నగు యజమానుల దృష్టిని సేవకులు కడుంగడు గౌరవించుచుందురు.

ఔన్నత్యముం గోరి యడఁగి యుండవలయును. జీవనముంగోరి ప్రాణములు విడచుట కైనను సిద్ధపడవలయును. సుఖముంగోరి దుఃఖముఁదెచ్చి పెట్టుకొనవలయును. ఇట్టివిధమున సేవకుఁడు కాఁగోరు మూఢుఁ డెవ్వ డుండును" అని పలుకగా విని దమనకు డిట్లనెను.

"మిత్రుఁడా! అట్లనుట యుచితముగాదు. సంతుష్టినొంది సకలమనోరథములు దీర్పఁగల ప్రభువులను సేవించుటలోఁ దప్పేమియు లేదు. రాజులకు శ్వేతచ్ఛత్రము, హస్తి తురగాది సైన్యము, చామర వీజనాది సంపదలు ప్రజాసేవను బట్టియేకదా లభించుచుండును?" అన, విని మరలఁ గరటకుఁడిట్లనెను.

"ఏమయినను నది మనపనిగాదు. సంబంధము లేనిపనికి సిద్ధపడినవాఁడు మేఁకు నూడఁబెఱికిన కోతివలె మృతినొందుట నిజము. నీకా కథ చెప్పెదను, వినుము.

మేకును బెఱికి మరణించిన కోఁతి కథ

మగధదేశమునందు శుభదత్తుఁడను నొక వైశ్యుఁడు గలఁడు. చాలకాలము వఱ కాతనికి సంతానము గలుగలేదు. అందువలన నాతఁడు సప్తసంతానములలోనివి యైన దేవాలయనిర్మాణము, చెఱువులు ద్రవ్వించుట, చెట్లునాటించి వనమహోత్సవము చేయుట మున్నగు పుణ్యకార్యములందుఁ దన ధనము వెచ్చించుచుండెను.

ఒకనాఁ డొకదేవాలయము శిథిలమై యుండుటఁ గాంచి దానిని బాగుచేయించుట కావైశ్యుఁడు పూనుకొని తగిన శిల్పులను, బనివాండ్రను నేర్పఱిచెను. ఒకనాఁడు వడ్రంగి యొక చేవదూలమును బనివాండ్రచేఁ గోయించుచు నది సులభముగాఁ జీలుటకై యచటనచటఁ గొయ్యమేకులు దిగఁగొట్టించెను. అంతలో వేళదాటుటచేతఁ బనివారందఱు దమతమ యిండ్లకుఁ బోయిరి.

ఇంతలో నొక కోఁతులమంద యచటికి వచ్చి దేవాలయపు గోడలమీఁదను సమీపమందలి చెట్లమీఁదను విహరించుచుఁ బెక్కు రకములుగా జేష్టలు చేయుచుండెను. వానిలో నొకకోఁతి మేకులు దిగఁగొట్టియున్న దూలము నొద్దకు వచ్చి దానిపై గూరుచుండి కొయ్యమేకు రెండు చేతుల తోడను గట్టిగాఁ బట్టుకొనియెను. అపుడాఁకోఁతి తోఁక దూలపు నెఱియలోఁబడి వ్రేలాడుచుండెను. ఆకోఁతి సహజమగు చపలత్వముచేత మేకును బలవంతముగా నూడఁబెఱికెను. నెఱియలోఁ జిక్కుకొనియున్న తోఁక నలిగివెంటనే యాకోఁతి బాధతో నఱచుచు మరణించెను. కావున మనకు సంబంధము లేని పనికిఁ బోరాదు.

కరటకుఁ డిట్లు చెప్పగా దమనకుఁడు, “స్వామి కార్యమునెడ నుపేక్షింపరాదు. ఒకపు డాతఁడు మనల నెట్లు చూచినను నాతఁడు మనకుఁ ప్రభువు కాకపోఁడు” అని పలుకఁగా మరలఁ గరటకుఁడు “ఆపని రాజోద్యోగులది. మన మిపుడు రాజోద్యోగులము గాము. కానపు డితరుల యధికారము పయిఁ బెట్టుకొనఁ గూడదు. పరుల యధికారము మీదఁ బెట్టుకొనువాడు కుక్క మొఱుగుటకు బదులుగా నోండ్రవెట్టి దెబ్బతిన్న గాడిదవలె హాని నొందును. నీకా కథ చెప్పుదును; వినుము.

పరుల యధికారము మీఁదఁ బెట్టుకొని మరణించిన గాడిద కథ

వారణాసి యందుఁ గర్పూరపటుఁడను నొక చాకలి గలఁడు. వాఁడొక నాఁటి రాత్రి, పగలంతయు బట్ట లుదికిన బడలికచేత నొడలెఱుంగక నిదురించుచుండెను. అర్ధరాత్రమున వాని యింటియం దొక దొంగ ప్రవేశించెను. వాని యింటిముందు గాడిద

యొకటి కట్టివేయబడి యుండెను. ఆయింటి కావలికుక్కయు నచటనే కూరుచుండి యంతయు జూచుచుండెను.

అపు డచటి గాడిద కుక్కతో “సఖుఁడా! దొంగ యింటఁ జొచ్చుట చూచి యుంటివి గదా! గట్టిగా మొఱిగి యజమానుని మేల్కొల్పుటకుఁ బ్రయత్నింపవేలఁ? ఇది నీపని కాదా?” యన శునక మిట్లనెను. “నావిధిని గుఱించి చర్చింప నీకేమి యవసరము? నీవేమి యెఱుఁగుదువు. రాత్రియుఁ బవలుఁ గష్టమనక యీయిల్లు గాచుకొని యుందును. యజమానుఁడు నాయుపయోగముఁ గొంచెమైనను గ్రహింపకున్నాఁడు. నా కాహార మవసర మనెడి యూహయే యాతనికి లేదు. అవసరము లేనపు డధికారులకు సేవకులయం డాదరము తొలఁగి పోవుటలో నాశ్చర్య మేమున్నది?”

ఆ మాటలు వినుసరికి గార్దభమునకుఁ గోపము వచ్చెను. “పని గలుగునపుడు లంచమడుగు భృత్యుఁడు, మిత్రుఁడు నీచులు” అని పలుకగాఁ “గార్యకాలమున మాత్రమే భృత్యులయం దాదరముఁ జూపు ప్రభువు యోగ్యుఁ డెట్లగు”నని శునకము గార్దభమును బ్రశ్నించెను.

దానికా గాడిద మఱింతగాఁ గోపించి “యాపత్కాలమున స్వామికార్యము విడనాడు నీవు పాపాత్ముడవు. పోనిమ్ము. నీతోడనే యున్నదా? ఏలికను లేపి నాఋణముఁ దీర్చు కొందును.” అని పలికి గట్టిగా నోండ్రపెట్టెను. ఆధ్వనికి గాడనిద్రలోనున్న రజకుఁడు మేలుకొని నిద్రాభంగమైనదని కోపించి యొకబడియ చేతఁబట్టుకొని తిన్నగా గాడిద యొద్దకుఁ బోయి దానిం జావమోదెను. ఆదెబ్బ లాయువుపట్టునఁ దాఁకి వెంటనే యది మరణించెను. కావునఁ “బరుల యధికారము మనకేల?” యని పలికితిని. చచ్చిన పసరముల వెదకి కొనుటయే మనపని. మనకు గావలసినంత తిండి దొరకును. పోవుదము రమ్ము.” అని కరటకుఁడు చెప్పినదంతయు విని దమనకుఁడిటు లనియెను.

“ఏమీ! తిండికొరకే కేవలము రాజును సేవింప వలయుననియా నీ యుద్దేశము? నీవు చెప్పినది మిక్కిలి యనుచితము. మిత్రులకు మేలును, విరోధులకు హానియుఁ జేయఁదలచి బుద్ధిమంతులు రాజు నాశ్రయింపఁ గోరుచుందురు. ఏదోవిధమునఁ బొట్ట నింపుకొనలేకపోవుదుమా? విప్రులకు, బంధుమిత్రాదులకు నుపకారము చేయఁగల జీవితమే ధన్యమైనది. తనపొట్ట నిండించుకొనుటకు మాత్రమే యత్నించుచుండువాని జీవితము నొక జీవితమే యగునా? కాకి కడుపు నింపుకొనుచు నెంతకాలము జీవించిన నేమి ప్రయోజనము.

మాంసములేని వట్టి యెముక దొరకి నంతమాత్రము ననే కుక్క మిక్కిలి సంతుష్టినొందును. జంబుకములుమున్నగు జంతువులు వేలఁకొలఁదియు జెంతఁ దిరుగులాడుచున్నను సింహము వానిదెసఁ గన్నెత్తి చూడక యేనుఁగుల కుంభస్థలములు చీల్చి మెదడు భక్షించుటకై యత్నించుచుండును. ఎవ్వరైనఁ దమ సామర్థ్యమునకుఁ దగిన

ఫలమునే కోరుదురు. కుక్క తనకుఁ దిండిపెట్టువానిఁ జేరి తోకాడించును. చరణములు చాచి నేలపై బడి కడుపు, నోరుఁ జూపును. ఇన్నిపాట్లు పడినను దాని కొకటి రెండు ముద్దలకంటె నెవ్వరు నెక్కువ పెట్టరు. ఏనుఁగు గంభీరముగాఁ జూచుచు మంచి మాటలచే బతిమాలించుకొనుచు నాహారము గైకొనును. పౌరుష జ్ఞానకీర్తులచేఁ బ్రసిద్ధి నొందినవాని బ్రదుకే బ్రదుకు. ఎంగిలి మెదుకు లేఱికొని తిను కాకి కేమి గౌరవముండును? మంచి చెడ్డ లెఱుఁగక యందఱిచే నిందింపఁబడుచు నుదరపూరణమే ముఖ్యముగాఁ దలఁచువాడు పశువుకన్న నధముఁడు."

ఈవిధముగాఁ దమనకుఁ డిచ్చిన యుపన్యాసము విని కరటకుఁడు "మనము ప్రధానులము గానపు డింతియాలోచనము మనకేల?" యన దమనకుఁ డిట్లు జవాబిచ్చెను.

"ప్రధానులగుట కెంతకాలము గావలయును! తాము గావించు కృత్యములే జనులను గౌరవనీయులగు ప్రధానులుగాను, ఖలులుగాను జేయుచున్నవి. మానవులకు గౌరవగౌరవములు వారి ప్రవర్తనముం బట్టియే కలుగుచుండును. ఖ్యాతి గాంచుట కష్టము. నిందపడుట తేలిక. బండరాయి కొండ మీఁది కెక్కించుట మహాకష్టము. కొండమీఁదిఁనుండి క్రిందికిఁ ద్రోచివైచుట కడు సులభము. నూయి ద్రవ్వువాఁడు చుట్టు బ్రాకార మేర్పఱచుకొనుచుఁ దన చర్యచేతనే క్రమముగాఁ గ్రిందికి దిగిపోవునట్లు మానవుడు తన కృత్యములచేతనే యధస్థ్సితిం జెందును.

దమనకుని పలుకులు విని తుదకుఁ గరటకుఁడు "సరే నీమాటలు యుక్తముగనే యున్నవి. ఇపుడేమి చేయవలయు నని నీతలంపు?" అని యడిగెను.

"మనరాజు నీరుద్రావుటకై యమునకుఁ బోయి యెద్దుఱంకె వినియే భయపడి యదియేమో గుర్తింపలేక మరలి యింటికిఁ బోయి విషణ్ణుడై యున్నాఁడు. ఇందుఁ దెలియని దేమున్నది? ఈసంగతి యెవ్వరును జెప్పనక్కఱ లేదు. నోటఁ జెప్పిన విషయములు పశువులు, హయములు, గజములు, సర్పములు గూడ గ్రహింపఁ గలవు. చెప్పకుండ నాకారాదులచేఁ బరుల యూహలు గ్రహింపఁ గలవాఁడే పండితుడు. నేనిపుడు మనరాజు దగ్గఱకుఁబోయి సందర్భము ననుసరించి యవసరములయిన మాటలు సెప్పి యాతనిభయముఁ బోఁగొట్టి యాతనిఁ బ్రసన్నునిగా జేసికొందును.

"సందర్భమునకుఁ దగిన మాటలు, మంచితనమునకుఁ దగిన ప్రియవచనములు, శక్తికి మించని కోపముఁ గలవాఁడే వివేకి" యని దమనకుఁడు చెప్పఁగా "నీవు సేవాధర్మము నెఱుఁగవు. చూడుము. పిలువని పనికిఁ బోవువాఁడును, నడుగనిదే సమాధాన మిచ్చువాఁడును, దనవిషయమునఁ బ్రభువు ప్రీతుఁడై యుండెనని నమ్మువాఁడును నవివేకులు" అని కరటకుఁ డనెను.

దానికి దమనకుఁడిట్లు జవాబిచ్చెను. "నేనుసేవాధర్మమునెఱుంగ కుండుటేమి? సహజముగా సుందరమైనను గాకున్నను నెవరికేది యిష్టమో యది సుందరముగనే కనఁబడును. ఎవనికేయది ప్రియమగునో తెలిసికొని బుద్ధిమంతుఁడు వానినిఁ దనకు సముఖునిగాఁ జేసికొనును. "అది నాపనిగాదు. సరిగా నాజ్ఞాపింపుము" అనిపలుకక యథాశక్తి రాజాజ్ఞను నెఱవేర్చు చుండవలయును. అధికమైన ప్రతిఫలముఁ గోరనివాఁడై నీడవలె ననుసరించుచు నాజ్ఞకెదురాడక ప్రాజ్ఞుఁడు రాజసేవయందు బ్రవర్తింపవలయును.

ఏదైననొకవేళ రా జవమానము కలిగించునేమో యను నూహించి రాజసన్నిధి వీడరాదు. ఏదైనఁ గీడుకలుగునని కర్తవ్యము విడుచుట యవివేకుల లక్షణము. అజీర్ణము కలుగునేమోయని భోజనము మానివైచు మూర్ఖుఁడెవ్వఁడైన నుండునా? అకులీనుఁడు, విద్యాహీనుఁడు, నయోగ్యుఁడునైనను సర్వదా కనిపెట్టుకొనియుండువానిని రాజు లాదరింతురు. రాజులు, లతలు, వనితలు తఱచుగా దగ్గఱనున్న వానిపై నభిమానము చూపుట సహజము" అనిన విని గరటకుఁ డంగీకరించి "సరే! నీవిపు డట కేఁగి యేమి పలుకుదువు?" అని ప్రశ్నింప దమనకుఁడిట్లు చెప్పెను.

"ముందుగాఁ బ్రభువు నాకు సుముఖుఁడో, కాఁడో తెలిసి కొందును. దూరమునుండి చూచుట, మనవిచేయునపు డాదరము గలిగి వినుట, పరోక్షమున సుగుణముల నెన్నుట, ప్రియ విషయములు తటస్థించి నపుడు స్మరించుట, దానము, ప్రియ వచనము లాడుట, దోషములు గుణములుగా గ్రహించుట సుముఖుని చిహ్నములు. మఱియుఁ గాలయాపనము, నాశలు రేకెత్తించుట, ఫల మొసఁగకుండుట, విముఖుని లక్షణములు. బుద్ధిమంతుఁడీ సంగతులన్నియు గుర్తింపవలయు. ఇన్ని విధములు నెఱిఁగి పింగళకుని స్వాధీనునిఁ జేసికొందును.

అన విని కరటకుఁడు "అయినను సమయోచితము గాని ప్రాస్తావముఁ జేయకుము. బృహస్పతితో సమానుఁ డైనను సమయోచితములు గాని పలుకులచేత నవమానము నొందును. అనిపలుకఁగా దమనకుఁడు "మిత్రుఁడా! కరటకకుఁడా! భయపడకుము. సమయమెఱుఁగక మాటలాడను. ఆపదయందును నపమార్గములఁ బోవునపుడును నడుగకున్నను భృత్యుఁడు స్వామిహితమును గోరి సంభాషింపవలయును. అవసరమయినపుడు కూడ "మనకేల" యని యాలోచనము సెప్పకయూర కుండు నెడల సేవకుని యునికియే నిరుపయోగము. కాఁబట్టి సఖుఁడా! నాకు బోవుటకు సెలవిమ్ము" అని కోరెను. కరటకుఁడును "శుభమగుఁగాక. నీదారి సుగమ మగుఁగాక! నీకు యుక్తమని తోఁచిన విధమున జాగరూకుఁడవై ప్రవర్తింపుము. పోయిరమ్ము." అని దమనకునిఁ బంపెను.

దమనకుఁడు పింగళకుం జేరుట

అనంతరము దమనకుఁడు వచ్చుచుండుట దూరము నుండియే చూచి పింగళకుఁడు దగ్గఱకుఁ బిలిపించుకొనెను. దమనకుఁడును సాష్టాంగనమస్కారముచేసి కూరుచుండెను. తరువాత రాజు"చాలకాలమునకుఁ గనఁబడితివి. సేమమా?" యని యడిగెను.

"ప్రభువులకు నావంటి యల్ప సేవకునివలనఁ బ్రయోజన మేమియుండును? అందుచేతఁ దఱచుగాఁ వచ్చుటలేదు. సర్వసమర్థులగు మీ సత్పరిపాలనమున మాసేమమునకు లోటేమి యుండును? ఎంతటి యల్పుఁడైనను సమయము వచ్చినప్పుడు భృత్యుఁడు ప్రభువునకుఁ దగిన యాలోచనము సెప్పుట ధర్మమని మీ దర్శనమునకు వచ్చితిని. పల్లు కుట్టుకొనుటకును, చెవి గోకికొనుటకును నెంతవారికిని గడ్డిపుల్లకూడ నుపయోగపడు చుండఁ గాలుసేతులు గల జంతు వెపుడైన నుపయోగింప కుండునా?

ధైర్యము గలవాని కవమానము గలిగినను మతిసెడదు. దివిటీ తలక్రిందుగాఁ బట్టుకొన్నను దాని మంటలు మీఁదికి బ్రసరించుచునే యుండునుగాని క్రిందికిఁ బ్రసరింపవు గదా! ప్రభువు లెఱుఁగని దేముండును? మణి పాదములందు దొరలినను దాని ప్రభ చెడదుగదా! గాజుముక్కను శిరమున ధరించినను దానికి శోభగలుగఁ జాలదు. పరిజనులందఱియందు భేదములేక రాజొకే తీరున వర్తించినయెడలఁ గ్రియాదక్షులగు వారు నిరుత్సాహు లగుదురు. పురుషులలో నుత్తములు, మధ్యములు, నధములు నని మూఁడు విధములు. వారిని మూఁడు రకముల పనులయందును నేలిక నియోగింపవలయును. వారికి వారికిఁ దగిన పనులందు యోగింపక వ్యత్యస్తముగాఁ జేసినచోఁ జూడామణి పాదములందును గాలియందె తలయందును దాల్చి నట్లగును. బంగరు నగలయందుఁ దాపింపవలసిన మణి యిత్తడియందుఁ బొదిగినయెడల నారత్నమున కేమియు లోటురాదు. భృత్యులకుఁ దగిన గౌరవమొసఁగని దోసము రాజుదే యగునుగాని భృత్యులది గాదు.

అశ్వము, ఆయధము, శాస్త్రము, వీణ, విద్య, నరుఁడు, నారియు నుత్తములప్రాపుచే గణన కెక్కుటయు నధములఁ సాంగత్యమున జెడుటయు లోకప్రసిద్ధములు, అసమర్థున కెంతభక్తి యున్నను, శక్తిమంతుఁ డపకారియైనను నుపయోగ మేమి? రాజావమానమొందిన పరిజనునకు మతిసెడును. వానిం జూచి బుద్ధిమంతుఁ డెవ్వఁడు రాజసమీపమున కేఁగుటకు వెఱచును. పండితులు వీడినరాజ్యమున నీతి సెడును. నీతి చెడినపుడు సకలముఁ జెడిపోవును. రాజుగౌరవ మొందిన వాని నందఱుఁ గౌరవించెదరు. రా జనాదరించినట్లు తెలిసిన జనులందఱు నవమానింతురు. ఉచితమైన దానిని బాలుఁడు తెలిసినను గ్రహింపఁదగును. రవిలేని సమయమునఁ జిఱుదీప

ముపయోగింపకుండునా?” యని దమనకుఁడు పలుకుచుండఁ బింగళకుఁ డిటు లనియెను.

“దమనకా! ఇంతగాఁ జెప్పనేల? నీవు మాకుఁ బరమాప్తుఁడవు. కడు యోగ్యుఁడవు. ఇంతకాల మేదో దుష్టుల బోధవలన రాకపోకలు తగ్గించితిని. ఇపుడు స్వేచ్ఛగా నీవు చెప్పఁదలఁచిన ముఖ్యాంశములు చెప్పుము.” అను రాజు మాటలు విని దమనకుఁడు “మనవి చేసి కొనుచుంటిని. ప్రభువువారు నీరు ద్రావుటకై యమునకుఁ బోవుచు నీరు ద్రావకయే వెఱఁగొంది వెనుదిరిగివచ్చినట్లు కానఁబడుచున్నది. ఇందులకుఁ గారణము దెలిసికొని యవసరమైన సేవ చేయఁదలఁచి దర్శనమునకు వచ్చితిని” అని వినయమునఁ బలికెను.

అంతటఁ బింగళకుఁడు “దమనకా! అడుగఁ దగిన యంశమే యడిగితివి. ఈరహస్యముఁ దెలిపి యాలోచన మడుగుటకు నమ్మదగినవాఁ డొక్కఁడును గానరాకున్నాడు.

ప్రస్తుత మీవనమున కేదో యొక పపూర్వ మృగ మేతెంచియున్నది. కాబట్టి మన కియ్యది విడువఁదగినదని తోచుఁచున్నది. ఆకారణమున వెఱఁగొంది యుంటిని. ఇంతకు ముందే యొక మహాధ్వని వినవచ్చినది. ఆశబ్దముఁ బట్టి చూచిన నాజంతువు మహాబలముగలదై యుండవలయును” అని పల్కెను.

అది విని దమనకుఁడు “ఔను; ఆధ్వని మేమును విని యుంటిమి. అది భయముఁ గలిగించునట్లుగనే యున్నది. అయినప్పటికి నాలోచన లేకుండ ముందుగానే దేశత్యాగము చేయుటకును, యుద్ధమునకుఁ బూనుకొనుటకు మంత్రియైన వాఁడెట్లు ప్రోత్సహించును? ఇట్టి విషమ పరిస్థితులలోనే భృత్యుల సారము దెలియవలయును. బంధువులు, భృత్యులు, స్త్రీలు ననువారి బుద్ధియు, సామర్థ్యము నాపద లనెడి నొఱపురాళ్ళ యందే తేలిపోవును. నేఁ జీవించియుండగాఁ దమకు భయమక్కఱలేదు. కరటకుఁడు మున్నగువారిఁ గూడఁ గొంచెము చేరఁ దీయుడు. ఏలయన, నాపత్సమయములందుఁ బురుష సాహాయ్య మెంతయు నవసరము.” అని చెప్పెను.

పిమ్మటఁ గరటకునిఁ గూడఁ బిలిపించి పింగళకుఁడు వారిర్వురను సర్వవిధముల గౌరవించెను. అపుడు దమనకుఁడిట్లనెను. “ప్రభూ! ధ్వని విన్నంతమాత్రాముస భయపడరాదు. ధైర్యము వహించి కారణముఁ దెలిసికొని ప్రతిక్రియ యాలోచింపవలయును. ఈయర్థముఁ దెలుపు కథ యొక్కటి గలదు. వివరించెదను; జిత్తగింపుడు.

పొలికలని యందలి నక్క కథ

పూర్వమొక నక్క యాకలిగొని వనమం దాహారమునకై తిరుగాడుచు విసువొంది యదృష్టమువలనఁ దుద కొకయుద్ధ భూమిం గాంచెను. అందుఁ గుప్పలుగాఁ గూలినరథములు, నవయవములు, పలురకములుగా ఖండితములై పడియున్న యేనుఁగులు, గుఱ్ఱములు, సైనికసమూహములు నిండుగా నుండెను. ఆనక్క యవియన్నియుఁ జూచి సంతసముతో వానిఁ దినుటకై దగ్గఱికిఁ బోవుచుండఁగా నేదో యొక పెద్దచప్పుడు వినఁబడెను. ఆధ్వనితో గుండె లదరి యది పాఱిపోవఁ దలఁచెను. కానియంతలో నేమి దోఁచినదో యాధ్వని విన వచ్చిన దెసకుఁ బరికించి చూచెను. దూరమున నొకచోటబడియున్న దుందుభియను వాద్యముపైఁ జెట్టుకొమ్మ గాలికి గదలి గట్టిగా దగులుచుండుటవలన నది బిగ్గఱగా ధ్వని చేయుచుండెను. అపు డా నక్క దాని దగ్గరికిబోయిఁ యది కొఱికి చూచి యందుఁ బ్రవేశించి బయటికి వచ్చెను. అట్లు భేరీముఖమందలి చర్మముఁ గొఱికివేయఁగానే యాధ్వని నిలిచిపోయెను.

అపు డాజంబుకము "ఎంతపొరపడితిని. ఇంత యాహారము విడిచిపెట్టి యాశబ్దమునకు జడిసి పాఱిపోవుటకు సిద్ధపడితిని" అని యనుకొనుచు సంతసముతో గావలసినంత యాహారముఁ దిని తనదారింబోయెను. కావున నాధ్వనికిఁ గారణ మరసి ప్రతిక్రియ చేయుదు" నని పలికెను. పింగళకుఁడు "సరే" యని సెలవిచ్చి పంపెను.

దమనకుఁ డట్లు బయలుదేఱి పోవుచుండ వానివెంట నరిగి కరటకుఁ డిటు లనియెను. "భయమునకుఁ గారణ మెఱుంగకుండ, నది తొలఁగింప శక్యమైనదో కాదో తెలియకుండ భయప్రతీకారమునకు శపథముచేసి రాజసత్కారము నొందితిమి. ఉపకారముఁ జేసియేకాని యెవ్వరివలనఁ గానుకలు గ్రహింపరాదు. అందునను రాజువలన నెంతమాత్రము స్వీకరింపరాదు. ఏలయన రా జనుగ్రహించెనేని సంపదలు, విక్రమించినయెడల విజయముఁ, గోపించినయెడల మృత్యువును గలిగింపఁగల సమర్థుఁడై యుండును. ఎట్టివాఁడైనను రాజు నవమానింపరాదు. రా జన నరరూపమున నుండు దైవమే కాని యన్యుఁడుగాడు." అనుమాటలకు దమనకుఁడు నవ్వి యిటులనియెను.

"నఖుఁడా! నీ కేమియు నాందోళన మవసరము లేదు. భయకారణము దెలిసియేయున్నది. అది వర్థమానుఁడను వణిజునిచే నడవియందు విడువఁబడిన యెద్దు వైచిన ఱంకెయే గాని యన్యము గాదు. వృషభములు మనముకూడ సులభముగా భుజింపఁదగినవి. రాజువిషయమై సందియ మేల?" యను దమనకుని పలుకుల "కట్లైన ముందే స్వామికిఁ దెలిపి యాతని భయము మానుపరాదా?" యని కరటకుఁడు ప్రశ్నించెను.

దానికి దమనకుఁడు "వెంటనే భయము మాన్పించిన మనకుఁ జిరకాలగౌరవ మెటులు గలుగును? భృత్యులెన్నఁడును స్వామి నిఁక దమ యవసరములేని స్థితికిఁ దేరాదు. ప్రభుని యవసరములన్నియు మిగులకుండఁ దీర్చువాఁడు దధి కర్ణునివలెఁ జెడును. నీకా కథ యెఱింగించెదను వినుము.

సింహము పనియంతయు నెఱవేర్చి చెడిన పిల్లి కథ

ఉత్తరదేశమం దర్బుదశిఖర మనెడి యొక పర్వతము గలదు. అందు దుర్దాంతుఁడను మహాబలముగల సింహము వసించుచుండెను. అది కొండగుహాలో సుఖముగా నిదురించు చుండునపు డొక యెలుక రోజును కేసరములు గొఱుకు చుండెను. ఆసింహము పట్టుకొనఁ బోగా నది దొరకక కలుఁగులోనికిఁ బాఱిపోవుచుండెను.

అపుడు దుర్దాంతుడు క్షుద్రశత్రువును బలముచే సాధించుట కష్టము. అట్టివానిం జంపుటకు వానికిఁ దగినవాఁడే యుండవలయును." అని యాలోచించి యొక గ్రామమునకుఁ బోయి కడుశ్రమతో దధికర్ణుఁడనెడి మార్జాలమును నమ్మించి తీసికొనివచ్చి గుహలోఁ దనయొద్ద నుంచుకొని యాహారాదులచే దానిం బోషించుచుండెను. దాని భయము వలన మూషికము కలుఁగువెడలి వచ్చుటకే భయపడు చుండెను. అందువలనఁ గేసరములు కొఱుకుబాధ తప్పి యా సింహము సుఖముగా నిదురించుచుండెను. ఎలుక చప్పుడు వినవచ్చి నపుడెల్లఁ బిల్లికి దుర్గాంతుడు మాంసాహార మొసఁగి ప్రోత్సహించుచుండెను.

పిమ్మటఁ గొంతకాలమైన తరువాత నాకలికిఁ దాళలేక యాయెలుక కలుఁగు వెడలివచ్చి పిల్లిచే భక్షింపఁబడెను. అనంతరము చాలకాలమువఱకు నెలుక చప్పుడుగాని యెలుక గాని దుర్దాంతునకుఁ గనఁబడలేదు. ఆ కారణమున దుర్దాంతుఁడు దధికర్ణున కాహార మిడుటయం దశ్రద్ధవహించుచుఁ గొంతకాలమునకు బూర్తిగా మానివైచెను. దధికర్ణుఁడును దిండిలేక క్రమముగా బలహీనుఁడై కృశించి మరణించెను. కాఁబట్టి యెన్నఁడును బ్రభువును నిరపేక్షునిగాఁ జేయరాదు." అని పలికి కరటకుని నొక చెట్టుక్రిందఁ గూరుచుండ నియమించి సంజీవకుని యొద్ద కేఁగి యిట్లు పలికెను.

"ఓ వృషభేంద్రా! ఈయడవిం గాపాడుటకై మృగ రా జగు పింగళకునిచే నియమింపఁబడిన సేనాధిపతి కరటకుఁ డిట్లాజ్ఞాపించుచున్నాడు. "త్వరితముగ నాకడకు రమ్ము. లేదేని యీ యడవినుండి దూరముగఁ దొలఁగి పొమ్ము. ప్రభువు కోపించిన యెడలఁ గలుగు ఫలితము లెఱిఁగియే యుందువు. ప్రభువుల కాజ్ఞాభంగము, బ్రాహ్మణుల కనాదరము, స్త్రీలకు పృథఙ్మందిర నివాసము శస్త్రమక్కఱ లేని చిత్రవధ వంటిది."

సంజీవకుఁడు మిగులభయపడి చప్పునఁ గరటకుని కడకుఁ బోయి సాష్టాంగనమస్కారముచేసి “సేనాపతీ! నే నెఱుఁగక చేసిన తప్పు లున్నచో క్షమింపుము. ఇఁక నీయాజ్ఞానుసారముగా మెలఁగుదును.” అని విన్నవించుకొనెను.

అది విని కరటకుఁడు “ఓవృషభమా! నీవు మా యరణ్యమున నివసించుచున్నావు. కావున మాప్రభువుని కడకు వచ్చి నమస్కరించి విధేయుడవై యుండుము.” అని యాజ్ఞా పూర్వకముగాఁ బలికెను.

దానికి సంజీవకుఁడును “నా కభయ మొసఁగుము. నీయానతి చొప్పున వచ్చి స్వామిసేవ చేయఁగలను.” అని వేడుకొనఁగాఁ గరటకుఁడు “భయపడకుము. సింహము మేఘ గర్జనలకు తిరిగి గర్జించునుగాని నక్క కూఁతలు లెక్క సేయదు. వాయువు సమున్నతములైన వృక్షములనే పెల్లగించునుగాని వంగియుండు తృణముల జోలికిఁ బోఁడు. నీవును వినయ విధేయతలతో మెలఁగిన మారాజు పింగళకుఁడు నీ కేహానియుఁ జేయడు సరిగదా! నీకేదైన నుద్యోగము కూడ నొసఁగి గౌరవించును.” అని పలికెను.

ఈవిధముగా సంజీవకుని లోబఱచుకొని కూడఁదీసికొని పోయి యాతనిఁ గొంతదూరమున నుంచి కరటక దమనకులు పింగళకుని సమీపమునకుఁ బోయిరి. రాజునకు వందన మొనరించి కూరుచున్న యనంతరము “దమనకా! నీవు పోయినపని యేమైనది? శబ్దకారణ మెఱిఁగి యావైరియెవ్వడో తెలిసికొంటివా?” యని పింగళకుఁడు ప్రశ్నించెను.

దమనకుఁడు “దేవా! అంతయు మనవిచేయు చున్నాను. మీ రూహించి నటు లాతఁడు మహాజంతువే కాని క్షుద్రజంతువుకాడు. అయినను దమకు విధేయుఁడై వర్తింపఁ దలఁచినవాడు కాని విరోధమునకుఁ బూనుకొను వాఁడుగాడు. స్వామి యనుగ్రహమున్నచో నుద్యోగిగా నుండి సేవచేయఁ గలడు. ఆజ్ఞ యైనచో రప్పించెదను.” అని విన్నవించెను. పింగళకుఁ డందుల కంగీకరించెను. దమనకుఁడు బయటికివచ్చి సంజీవకుని రాజు నెదుటికిఁ గొనిపోయెను.

సంజీవకుఁడు మంత్రియుఁ, గరటక దమనకులు కోశాధికారులు నగుట

సంజీవకుఁడు విధేయతతో బింగళకునకు సాష్టాంగ వందన మాచరించి “ప్రభుని యాజ్ఞలకు బద్ధుఁడను” అని పలికెను. పింగళకుఁడు సంతసించి యావృషభమునకు మంత్రి పద మొసఁగి గౌరవించెను. నాటినుండియుఁ బింగళక సంజీవకులు కడుంగడు

నమ్మకముతో జెలిమి యొనరించుచు సుఖముగాఁ కాలము గడుపుచుండిరి. పింగళకుఁడు కరటక దమనకులను గోశాధికారులుగా నియమించి గౌరవించెను.

స్తబ్ధకర్ణుని రాక - సంజీవకుఁడు కోశాధికారి యగుట

అనంతర మొకనాడు పింగళకుని సోదరుడయిన స్తబ్ధకర్ణుఁ డచటికి వచ్చెను. పింగళకుఁ డాతని సగౌరవముగా నాహ్వానించి గౌరవించి యాతని కాహార మొసఁగుటకై మృగములను జంప స్వయముగా బయలు దేఱుచుండెను. ఆసమయమున సంజీవకుఁడు "ప్రభూ! చంపఁబడిన జంతువుల మాంసము నిలువలేదా?" యని యడిగెను.

"కరటక దమనకులకు దెలియవలె" నని సింహము చెప్పెను. "ఉన్నదో లేదో తెలిసికొనుట మంచిది" అని సంజీవకుఁ డనెను. పింగళకుఁడు వర్తమానించి తెలిసికొని "మాంసము నిలువ లే" దని చెప్పెను. "మాంసమంతయుఁ గరటక దమనకులే తినివైచుచుండిరా?" యని సంజీవకుఁడడిగెను. "ఔను ప్రతిదిన మట్లే జరుగుచుండెను" అని పింగళకుఁ డనఁగా సంజీవకుఁడు "ఈపని ప్రభువుల యెఱుకలోనే జరుగుచుండెనా?" యని యడిగి "నాకుఁ, దెలిసియుఁ, దెలియకయు జరుగుచుండె" నని పింగళకుఁడు చెప్పగా సంజీవకుఁ డిట్లు విన్నవించెను.

"ప్రభూ! ఇది యెంతమాత్రముఁ దగదు. ఆపదకుఁ బ్రతిక్రియ యొనరించుట దక్క మఱేపనియుఁ బ్రభువునకు నివేదింపకుండ భృత్యుఁడు తనంతఁదాను స్వతంత్రించి చేయరాదు. కమండలువు తనలోని సారమంతయుఁ ద్యజించి యజమానుని మేలునకై మిక్కిలి జలమును గ్రహించునట్లు మంత్రియైనవాఁడు ప్రభువునెడల వర్తింపవలయును. కోశముఁ బెంపు సేయువాఁడే నిజమైన మంత్రి. ఏలయన; రాజునకుఁ గోశమే ప్రాణములు గాని, ప్రాణములు గావు. పురుషున కేయితరగుణములచేతను గోశసమృద్ధివలన వచ్చినంత గౌరవము రాఁజాలదు. ధనహీను నాలుబిడ్డలే నిరాదరింతు రన నితరుల మాట సెప్పనేల? అతివ్యయము, సపరిశీలనము, సధర్మార్జనముఁ, గోశవ్యసనమునకు లక్షణములు. ఆదాయము గుఱుతింపక స్వేచ్ఛగా వ్యయము చేయువాడు కుబేరతుల్యుఁడయినను ననతికాలమున జేటు నొందును."

సంజీవకుని పలుకులు విని స్తబ్ధకర్ణుఁ డిట్లు పలికెను. "సోదరా! వినుము. సంధి విగ్రహాది కార్యములందు సమర్థులును జిరకాలమునుండి యాశ్రయించి యున్నవారు నగు కరటకదమనకు లెన్నఁడుఁ గోశాధికారమున నియోగింపఁ దగినవారు గారు. ఉద్యోగప్రసక్తిలో నేను వినియున్న ధర్మములు తెలుపుదును. వినుము.

బ్రాహ్మణుఁడు క్షత్రియుఁడు, బంధువుఁ గోశాధికారమున నియోగింపఁదగరు. బ్రాహ్మణుఁడు సంపాదింపఁబడిన ధనము కష్టకాలమున నైన వినియోగింపడు. క్షత్రియుఁ డన్నిటికి ఖడ్గముఁ జూపును. బంధువు జ్ఞాతిభావముచేత సమస్తము నాక్రమించి హరించును. చిరసేవ యొనరించు నియోగి దోషమునకైనను వెఱవక స్వామిని లెక్కగొనక నిరంకుశుఁడై చరించును. ఉపకారినెన్నడుఁ గోశాధికారమున నియమింపరాదు. తానొనరించిన యుపకారము నిమిత్తముగాఁ జేసికొని నిత్యము రాజసన్నిధానమునఁ జరించుచుఁ దానే రా జన్న ట్లాతఁడు చరించును. సమృద్ధిగలవానిని మంత్రిగా నియమించిన నసాధ్యుఁడగును. సమృద్ధి చిత్తవికారముఁ గలిగించును.

పిండినకొలఁదియు ద్రవించు దుష్టవ్రణమువలె నుద్యోగులు ప్రభుని యంతస్సారముఁ బీల్చివేయుదురు. ఎంతపిండినను దడివస్త్రము పయోధారల నొసఁగఁ జాలనట్లెంత యొత్తుడు గలిగినను నుద్యోగులు హరించిన ధనముఁ దెచ్చి యీయరు.

ఈ విషయము లన్నియు బాగుగా నాలోచించి సందర్భానుసారముగా మెలంగవలయును.” సోదరుని యీ మాటలు విని పింగళకుఁడు “అది నిజమేయగును. కరటకదమనకు లీమధ్య నన్నివిధముల నాయాజ్ఞలకు బద్ధులై యుండుచున్నట్లు గానరాదు.” అని చెప్పఁగా మరల స్తబ్ధకర్ణుఁడిట్లనెను.

“ఆజ్ఞ మీఱెడి వారిని క్షమించెనేని నాతనికిని జిత్రప్రతిమకు భేధమేమి? సోమరియైన వానికిఁ గీర్తియు, సరళతలేనివానికి స్నేహమును, నింద్రియ నిగ్రహము లేని వానికి గులమును, ధనాశాపరునకు ధర్మమును, లుబ్ధునకు సౌఖ్యమును, వ్యసనములు గలిగియుండు వానికి విద్యాఫలమును, మంత్రుల విషయమై యేమఱియుండు నరపతికి రాజ్యమును నచిరకాలమునఁ జెడిపోవును. కావున సోదరా! తప్పక నామాట పాటింపుము. సస్యము మాత్రమే తిని జీవించు సంజీవకునిం గోశాధిపతిగా నియమించుట యుక్తమని నాయూహ.”

ఇట్లు పలికిన సోదరుని మాటల కంగీకరించి యప్పటి నుండియుఁ బింగళకుడు సంజీవకునిఁ గోశాధికారమున నియోగించెను. ఈ విధముగాఁ బింగళక సంజీవకుల స్నేహము మఱింత ప్రబలెను. అంతేకాక యితరబంధువులందును, మంత్రులందును బింగళకుని కాదరము తగ్గిపోయెను.

కరటక దమనకుల విషాదము - పన్నుగడ

అనంతర మీవిషయము లన్నియుఁ గరటక దమనకులకు మిక్కిలి ఖేదముఁ గలిగించెను. దమనకుఁడు కరటకునితో మిత్రమా! యిపుడు గర్తవ్య మేమి? ఇది

స్వయంకృతాపరాధము. స్వయంకృతదోషమునకు విలపించుట కూడ యుక్తముగాదు. తాము చేసికొన్న దోషముచేత నొక రాజకుమారుడు నొకసన్న్యాసియు హాని నొందిరి. నీకా కథలు చెప్పెదను వినుము.

స్వయంకృతాపరాధమువలనఁ జెడిన రాజకుమారుని కథ

సింహళ దేశరాజయిన జీమూతకేతునకుఁ గందర్పకేతుఁడను నొక కుమారుడు గలడు. ఆతఁ డొకనాఁ డుద్యానవనమున నుండఁగా నొక యోడబేరగాఁడు వచ్చి “ప్రభూ! సముద్ర మధ్యమున మొన్నటి చతుర్దశినాఁడు డొకకల్ప వృక్షము బయలు దేఱినది. ఆవృక్షముక్రింద రత్నకాంతులతో దేదీప్యమానముగా నున్న పానుపుపై సర్వాలంకారములు ధరించి వీణవాయించుచు లక్ష్మివలె నుండు నొక కన్య కానఁబడినది.” అని చెప్పఁగా రాజకుమారునకుఁ గుతూహలము గలిగి యాతనితో సముద్రతీరమునకుఁ బోయెను.

సరిగా వణిజుఁడు చెప్పిన చొప్పున నున్న కన్యకా మణింజూచి యామె రూపలావణ్యములచే రాకొమరుఁ డాకర్షింపఁబడెను. వెంటనే యాతఁడు మహాసాహసమున నాబాలా మణియొద్ద కుఱికెను. అట్లుఱుకుటయే తడవుగా నాతఁడు బంగరుమేడలతో నిండిన యొకపట్టణమునకుఁ బోయి యందొక సుందరసౌధమున విద్యాధరకన్యలచే సేవింపఁబడుచున్న యా సుందరాంగిం జూచెను.

ఆమెయు రాకొమరుని దూరమునుండియే చూచి యాతనితో మాటలాడుటకై తనచెలికత్తె నంపెను. చెలికత్తె యాతనికడకుఁ బోయి “రాజకుమారా! మాచెలి కందర్ప కేళియను విద్యాధరచక్రవర్తి కూతురు రత్నమంజిరి. ‘ఎవఁడు తనంతటఁ దానీ సువర్ణనగరముం జూచి చేరవచ్చునో యాతనిఁ బెండ్లి యాడవలయు’ నని యామెసంకల్పము. కావున నీవామెను గాంధర్వ విధిచే వివాహమాడుము” అని పలికెను.

కందర్పకేతుఁ ‘డట్లే’ యని యంగీకరించి రత్నమంజరిని వివాహమాడి యచటనే హాయిగా సమస్తసుఖములు ననుభవించుచుండెను. ఒకనాఁ డామె యాతనితో “స్వామీ! యీసర్వైశ్వర్యము నీయధీనము, నీయిచ్చవచ్చినట్లు దీని ననుభవింప వచ్చును. ఈచిత్రపటమందలి యాకృతిస్వర్ణ రేఖయను విద్యాధరకన్యది. దీనినిమాత్రము నీవెన్నఁడుఁ దాఁకవలదు. అట్లు తాఁకినయెడల మహాప్రమాదము సంభవింపఁ గలదు. అని పలికెను.

కొంతకాల మట్లు కడచిన పిమ్మట నొకనాఁడు కందర్పకేతుఁడు కుతూహలము నిలుపుకొనలేక యా స్వర్ణ రేఖను జేతితోఁ దాఁకెను. వెంటనే యది చిత్రమే యయినను

నామె తన చరణముచేత నారాజకుమారుని౯ దన్నెను. అతఁడెప్పటివలె౯ దన రాష్ట్రమందలి యుద్యానవనమున౯ బడి యెన్నఁడు నిక రత్నమంజరి జాడగానఁజాలక దుఃఖపీడితుఁ డయ్యెను. ఇంక సన్న్యాసి కథ వినుము.

స్వయంకృతాపరాధము వలన౯ జెడిన సన్న్యాసికథ

మలయపర్వత సమీపమున నొకానొక సాధువు నివసించుచుండు వాఁడు. ఆతఁడొకపుడు పండ్రెండుసంవత్సరములు పయనము సాగించి మలయపర్వత ప్రదేశమునుండి కాంచనపురమను నొకనగరము జేరెను. నాఁటిరేయి యానూతన నగరమున నొకవిశాలభవనపు టరఁగుమీద బండుకొనెను.

అదియొక వేశ్యాగృహము. గృహద్వారమున దారు నిర్మితమైన భేతాళ విగ్రహమొకటి గలదు. దాని శిరము మీఁద బ్రశస్తమైన యొకమణి ప్రకాశించుచుండెను. దానిం జూడఁగా నాసాధువున కాస కలిగెను. దానింగ్రహింపఁదలఁచి యాతడు చేయిచాచి తాఁకినంతనే బేతాలుని చేతు లా సాధువును బంధించి వైచినవి. బేతాళునిచేతుల బిగి కాగలేక యాతఁడాక్రందన మొనరించుచుండఁగా లోనుండి యొక పరిచారిక యరుదెంచి “ఓయీ! నీవు మలయపర్వతము దరినుండి వచ్చితివి. నీయొద్దనెన్నో మణులుండవలయును. వాని నన్నిటిని గౌరవముగా నిచ్చివేయుము. లేనిచో నీబంధము నుండి నీకు విముక్తిగలుగుట యసంభవము” అని స్పష్టపఱచెను. పది మందియు విన్నచో నింకను నవమానము గలుగునని వెంటనే తనతగ్గఱనున్న మణులన్నియు నిచ్చివైచి శూన్యహస్తుఁడై యాతడు మిక్కిలి విచారము నొందెను.

ఇట్లే యాషాడభూతి యనువానిచే మఱొక సన్న్యాసికి, మేషయుద్ధమువలన నొక నక్కకు స్వయంకృతాపరాధముచే హాని సంభవించెను. నీకాకథయు వివరించెదను వినుము.

సన్న్యాసిని మోసఁగించిన యాషాడభూతి కథ

పూర్వము దేవశర్మయను నొక సన్న్యాసియుండెను. అతడు సన్న్యసించినను లోభగుణము విడువలేకుండెను. జనులకు నిత్యము వేదాంతవిషయము లుపన్యసించుచుండువాడు. వారు భక్తితోఁ దెచ్చియిచ్చు కానుకలయెడ ననాదరముఁ జూపువాఁడు. కాని వారిం జిన్నఁబుచ్చు నిష్టములేని వానివలె నటించి యవి

స్వీకరించుచుండువాడు. ఇట్లు సంపాదించిన ధనమంతయు నొక బొంతలో నుంచి యెవ్వరికిఁ దెలియకుండు నట్లు దానిం గుట్టి మీఁద గప్పుకొని దేశసంచారము చేయు చుండువాఁడు.

ఆషాడభూతి యను పేరుగల వంచకుఁ డీవిషయము గుర్తించెను. అతఁడా సన్న్యాసింజేరి యధికమైన భయభక్తులతోఁ బరిచర్యలు సేయుచుండెను. మఱియు వేదాంతార్థము లెఱుఁగఁగోరిన వారివలె నటించుచు నాతని నమ్మించి యాతని వెంట దేశాటన మొనరించుచుండెను.

ఒకనాడు వారిరువురు దారిఁ బయనము సేయు చుండఁగా నాషాడభూతి యొకచోటఁ దటాలున నిలిచెను. తనబట్ట కంటుకొనియున్న యొక పూరిపుడక చేతఁబట్టుకొని దేవశర్మకుఁ జూపి "స్వామీ! నిన్నరాత్రి మనము నిదురించిన వారియింట నీపూరిపుడక నావస్త్రమున కంటుకొన్నది. ఇది వారి సొమ్ము. పరులసొమ్ము తృణమైన నపహరించుట ధర్మముగాదు. కాఁబట్టి యిది వారి కిచ్చి వచ్చెదను" అని పలికి కొంతదూరము వెనుకకుఁ బోయి దాని నచటఁ బాఱవైచి పిమ్మట దేవశర్మను గలిసికొనెను.

ఈ చర్య కా సన్న్యాసిని కడు నచ్చెరువొందెను. ఆతని నిస్పృహకు మనసున మెచ్చుకొనెను. తాను ధరించుచున్న బొంత మోయుటకు బద్ధకించి దానిని శిష్యునకిచ్చి పదిలముగాఁ దీసికొనిరమ్మని చెప్పెను. వాఁడు మిక్కిలి సంతసించి యాబొంత నెంతయో జాగరూకతో మోయుచుండెను. మునుపటికంటె గురువునకు విశ్వాస మధిక మగునట్లు మెలఁగు చుండెను.

వా రట్లు పయనించుచు నొక యరణ్యమార్గమున నుండఁగా సూర్యు డస్తమించెను. ఆచటనున్న యొక చెఱువుం జూచి యాచమనము చేయుటకై యా సన్న్యాసి యందు దిగెను. ఆసమయమున నా చెఱువుగట్టుమీద రెండు పొట్టేళ్లు భయంకరముగా డీకొని పోరాడుచుండెను. తలలు పగిలి కారిన రక్తము గాలికి గడ్డకట్టి వాని నడుమ మాంసఖండము వలె నేలమీఁద గనఁబడుచుండెను.

ఒకనక్క యదిచూచి మాంస ఖండమే యనుకొని జిహ్వాచాపల్యమున దానిం దినఁదలఁచి దగ్గఱి కేఁగెను. ఇంతలో నంతకుముందు డీకొని మరల డీకొనుటకై వెనుకకు దూరముగాఁ బోయిన పొట్టేళ్ళు మహావేగముగా ముందునకు వచ్చి డీకొనఁగా నడుమనున్న యానక్క వాని తాకుఁడునకు నలిగి వెంటనే చచ్చిపోయెను.

చెఱువులలో నాచమనము చేసిన సన్న్యాసి యదిచూచి 'మాంసమందలి యాశయేకదా నక్కకుఁ బ్రాణాంతకమయ్యె' నని తలఁచుచు గట్టెక్కి శిష్యునిఁ గానక గట్టిగాఁ బిలిచెను. అడవి యంతయు నిటునటు వెదకి చూచెను. ఎచటను వాని జాడ గానరాలేదు. తుద కాతఁడు తన్ను వంచించి ధనముతో నిండిన బొంత హరించినాఁడని నిశ్చయించుకొని మిగుల దుఃఖించెను.

కావున స్వయంకృతదోష మనుభవింపకతప్పదు” అని పలికి కొంతసే పాలోచించి “పింగళకసంజీవకులకుఁ జెలిమి యెట్లు గావించితిమో యట్లే వా రిరువురకు మిత్రభేదము గల్పింపవలయును. కార్యభంగము వాటిల్లినపు డెవని బుద్ధి చలింపకయుండునో వాడే యాపద గడచి గట్టెక్కగలడు.” అని దమనకుఁడు చెప్పెను.

“ఎట్టి బుద్ధిమంతున కైన నొక్కొక్కమాఱు పొరపాటు కలుగుచుండును. అందులకై విచారింప నక్కఱలేదు. కాని గాఢముగ హృదయములందు నాటుకొనియున్న పింగళక సంజీవకుల స్నేహమునకు విఘాతము గలిగించుట శక్యమా?” యని కరటకుఁడు సందేహముతో బ్రశ్నింపగా దమనకుఁడిట్లు చెప్పెను.

ఉపాయ మున్నచో సాధింపరాని కార్య మేదియు నుండదు. కాఁబట్టి చక్కని యుపాయ మాలోచింపవలసి యున్నది. పూర్వమొక వాయస ముపాయముచేత శత్రువయిన కృష్ణసర్పముం జంపెను. నీ కా కథ తెలుపుదును. వినుము.

ఉపాయముచేఁ ద్రాచుబామును జంపిన కాకి కథ

పూర్వకాలమున నొక మఱ్ఱిచెట్టు మీఁద గూడు కట్టుకొని వాయసదంపతులు నివసించుచుండెను. ఆ చెట్టు తొఱ్ఱలో నొక కృష్ణసర్పముండి యా కాకి పిల్లలను దినివేయు చుండెను. అందులకుఁ గాకము మిక్కిలి దుఃఖించెను. మరలఁ బ్రసవసమయము రాగా నాఁడుకాకి ప్రియుని జూచి “నాథా ఈ వృక్షమును విడిచి మఱియొక చోటి కేగుఁదుము. ఇందలి సర్పము మన సంతతి నెల్లప్పుడు దినివేయుచుండెను గదా! అవినీతురాలగు భార్య, దుష్టుఁడగు మిత్రుఁడు, నెదురాడు సేవకులు, సర్పముగల యింటిలో నివాసము నిక్కముగా మహాపాయకరము” అని పలుకగా భర్త యిట్లనెను.

“ప్రియురాలా! భీతిల్లకుము. ఇంతవఱకీ సర్ప మొనరించిన యపరాధములు సహించితిమి. ఇఁక నోర్వఁదగదు. తప్పక ప్రతీకార మొనరించెదను.”

ఆమాటలకు “బలవంతునితో విరోధము మేల?” యని భార్య పలుకఁగా భర్త “నీకు సందేహము వలదు. బుద్ధిబలముగలవానికి దేహబలముతో నిమిత్తము లేదు. బుద్ధిబలములేకున్న శరీరబల మెందులకుఁ గొఱగాదు. మదించిన సింగమును బుద్ధిబలముచేతనే కదా కుందేలు చంపినది నీకా కథ యెఱింగించెదను; వినుము.

బుద్ధిబలమున సింహముం జంపిన కుందేటి కథ

మందర మనెడి కొండమీద దుర్గాంత మనెడి సింహము గలదు. అది యెల్లవేళల జంతువు లన్నిటిని వేటాడి చంపు చుండెను. ఆ యుపద్రవమునకుఁ దాళలేక యొకనాడు జంతువు లన్నియు సభచేసి యాలోచించుకొని తమ ప్రతినిధిగా నొకజంతువు నాసింహము నొద్దకుఁ బంపినవి. అది సింహమును సమీపించి వినయముతో “మృగరాజా! ఒకేపర్యాయ మనేక జంతువులను జంపినయెడల నీ కేమి లాభము. జంతు సంతతి యంతయుఁ నశించినవెనుక రాజ్యాధిపత్య మెవరిపై వహింతువు. దయచూపితివేని మేమే నీయాహారమునకై దినమునకొక్క మృగమువంతునఁ బంపఁగలము.” అని విన్నవింపఁగా సింగము ‘సరే’ యని యంగీకరించెను. నాటినుండియు నాజంతువులు పంపిన యాహారమే తినుచుండెను.

ఇట్లు కొంతకాలము జరిగినవెనుక నొకనాఁ డొక కుందేటికి వంతు వచ్చెను. అపు డది యిట్లు తలపోసెను. “భయ హేతువు గలిగినపుడు ప్రతిప్రాణియు జీవితాశచేత నుపాయము వెదకును. మరణ మెటులైనఁ దప్పనియప్పుడు సింహమునకేల జడియవలయును?” ఇట్లాలోచించుచు నాకుందేలు నెమ్మదిగా వెడలుచుండెను.

సింగ మాకలికిఁ దాళలేక యాకుందేలు కనఁబడఁగానే కోపముతో “నీవేల యింత యాలస్యము చేసితివి?” అని యడిగెను. “దానికి స్వామీ! కరుణింపుము. నేను బయలు దేఱి వేగముగా వచ్చుచుండ దారిలో నన్నొక సింహము పట్టుకొని తినఁబోయెను. ‘తప్పక తిరిగి రాఁగల’ నని శపథముచేసి యాసింహమును నమ్మించి వచ్చుసరి కింతయాలస్యమయినది.” అని కుందేలు బదు లీయఁగా సింహము కనుల నిప్పులు రాలునట్లు చూచి మిక్కిలి కోపమున “రమ్ము శీఘ్రముగా నాసింహ మెచ్చటనున్నదో చూపుము. నారాజ్యమునం దింకొక సింహము ప్రవేశించి నాయాహారము నరికట్టుటయా?” యని గర్జించెను.

కుందే లిట్లు సింహమును గొంతదూరము తీసికొని పోయి యచటనున్న యొక లోతైన పాడునూయి చూపి “స్వామీ! యిందున్నది; చూడు” మనెను. ఆసింహము బుద్ధిహీనతచే నూతియందుఁ దన ప్రతిబింబముఁ జూచి వేఱొక సింహ మనిభ్రమించి కోప మాపుకొనఁజాలక గట్టిగా గర్జించుచు నందుఱికి ప్రాణములు గోలుపోయెను.

కుందే లొనరించిన సాహసము విని యాయడవి యందలి జంతువులన్నియు దానిని మిక్కిలి మెచ్చుకొనెను.”

ఈమాటలు విని “యిప్పుడేమి యుపాయ మాలోచించితివి?” అని భార్య యడుగగా వాయస మిటులనెను.

“ఇచటికి సమీపమున నున్న సరోవరమునందు రాజ పుత్రుఁడు ప్రతిదినము వచ్చి జలక్రీడ సేయుచున్నాఁడు. స్నాన సమయమం దాతఁడు మణులు పొదిగిన తన చేతియుంగరముం దీసి గట్టుపై నిడును. అపుడు దానిని ముక్కునఁ గఱచికొని వచ్చి యీచెట్టు తొఱ్ఱయం దుంచెదను.” అనిపలికి యొక నాఁ డావాయస మట్లే చేసెను.

రాజభటులు లాయుధములు చేతఁబట్టుకొని యుంగరము వెదకుచు నాచెట్టును సమీపించి తొఱ్ఱలో నుంగరముం జూచి యచట ‘బుస్సు బుస్సు’ మనుచున్న కృష్ణసర్పముం జంపి యాయుంగరముఁ గొనిపోయిరి. కాబట్టి యుపాయముచేతనే పింగళక సంజీవకులకు విరోధము గలిగింపవచ్చును” అని పలికి కరటకుని వీడుకొని పింగళకునియొద్దకుఁ బోయి వందన మాచరించి దమనకుఁ డిట్లనెను.

దమనకుఁడు పింగళకుని మనసు విఱుచుట

“ప్రభూ! ‘ఆపద గలిగినపుడును జెడుత్రోవఁబట్టినపుడు, గార్యసమయము దాఁటిపోవునపుడును మేలుకోరు మంత్రి రాజడుగకున్నను హితముఁ జెప్పవలయు’ నని పెద్ద లందురు. రాజుపభోగమునకుఁ దగినవాడు. కర్తవ్య మేమఱక మంత్రి కనిపెట్టుచుండవలయును. అట్లు చేయని మంత్రి ద్రోహియగును. సమయము వచ్చినపుడు స్వామి కార్య ముపేక్షించుటకంటె మరణము మేలు.”

ఇట్లు పలుకుచుండ బింగళకుడు “దమనకా! నీకు సందియము వలదు. చెప్పఁదలచినది నిశ్శంకముగాఁ జెప్పుము. నీమనసునకు బాధ కలిగించిన విషయ మెయ్యది?” యని యడుగ దమనకుఁ డిట్లనెను.

“దేవా! మీవిషయమై సంజీవకుని నడవడి యేమియుఁ జక్కఁగాలేదు. తొలుత నాతఁ డిట్టివాఁడని యెంత మాత్రముఁ గనిపెట్టలేక పోయితిమి. అచట నచట మీమీఁద నేరము లెన్నుచు మీసామర్థ్యముం దూలనాడుచున్నాడు. ఆతని వైఖరిం జూచినచోఁ గ్రమక్రమముగాఁ గొలఁది కాలములో నీరాజ్యమే వశపరచుకొన నూహించు విధము గోచరించున్నది. ఈసంగతి కొంతకాలమునుండి వినుచుండియు నేసంగతి యైనను స్పష్టముగా గమనింపకయే వ్యవహరింపరాదని యూరకుంటిని, కాని యింక నూరకున్నయెడలఁ గార్యము మించిపోవున ట్లుండుటచేతఁ జెప్పక తప్పినదిగాదు. మంత్రులందఱిం బరిత్యజించి సర్వాధికారము లీతని కిచ్చుటవలన నీ యపాయము గలిగినది.

రాజ్యలక్ష్మి, సమర్థుడైన మంత్రియం దొకపాదమును, రాజునం దొకపాదమును మోపి నిలిచియుండి స్త్రీసహజమైన చాపల్యముచేత నొకరిని విడిచి మఱియొకరిం

జేరుచుండును. ఒక్కనికే రాజు సర్వాధికారము లొసఁగినచో నాతఁడు గర్వించి స్వతంత్రింప నెంచును. స్వాతంత్ర్యమం దిచ్ఛగలిగిన మంత్రి రాజునకుఁ బ్రాణాపాయముఁ గలిగింప సాహసించుటలో వింత యేమి యున్నది?

విషము గలిసిన యన్నమును, గదలిన పంటిని, దుష్టుఁడగు మంత్రిని సంపూర్ణముగా విసర్జించుటే యుత్తమము. ఎవఁడు రాజ్యలక్ష్మిని సచివాయత్త నొనరించునో వాఁడు మంత్రి దుష్టుఁడైనపుడు గతిలేక దుఃఖ మనుభవించును. సంపద గోరని వాఁడును లోకమున నుండడు." అని దమనకుఁడు చెప్పిన మాటలన్నియు విని కొంచె మాలోచించి పింగళకుఁ డిట్లనెను.

"ఓయీ! దమనకా! శరీరము సకలరోగములకుఁ దావలమైనను దాని నెవ్వరును విడిచిపెట్టుటకు సిద్ధపడరు. అట్లే ప్రియమిత్రు డొకవేళఁ గొంత తప్పిద మొనరించినను విడిచి వేయవచ్చునా? నాకు సంజీవకునితోడి చెలిమి మేర లేనిది కదా! ఇండ్లు, సకల సామగ్రులుఁ గాల్చివేయునదియే యైనను సకల జనులకు నగ్ని యాదరణీయముగాదా?" ఇట్లు ప్రశ్నించిన రాజునకు దమనకు డిట్లనియె.

"సుతునియందుఁగాని, యమాత్యుని యందుఁగాని తటస్థునియందుఁగాని మితిమీరిన ప్రీతిఁ జూపు రాజును లక్ష్మి విడుచును. పథ్యపుఁ బదార్థ మంతరుచిగా లేకున్నను దుద కారోగ్యసుఖము గలిగించును. హితము చెప్పువాఁడును, నది చక్కఁగా గ్రహించువాఁడును గలుగుచోట లక్ష్మి నిలిచియుండును. నీవు చిరసేవకుల నీసడించి నూతనముగా వచ్చినవాని కాధిక్య మిచ్చితివి." దమనకుని యీమాట లాలకించి "ఇది కడు వింతగా నున్నది. నన్ను శరణు సొచ్చి; యభయ మొసఁగి పోషించుచున్న నన్నే యాతఁ డెట్లు ద్రోహము సేయును?" అని పింగళకుఁడు ప్రశ్నింపఁగా మరల దమనకుఁ డిట్లు పలికెను.

"ఎన్నివిధముల యత్నించినను గుక్కతోకకు వంకర పోజాలదు. దుర్జనుఁ డెన్ని యుపకారములు పొందినను వాని మనసు పరిశుద్ధము కానేరదు. విషవృక్షము లమృతము వోసి పెంచినను మంచి పండ్లీయఁ జాలవు. వర్ధనము, పోషణము దుష్టునకు మంచిగుణములు గలిగింప లేవు. హానినుండితప్పించు మిత్రుడును ననుసరించి వర్తించు స్త్రీయును, గర్వము గలి గింపని సంపదయు, నింద్రియములకు లోబడని పురుషుఁడును నుత్తములు. కాఁబట్టి యడుగకున్నను స్వామికిఁ బరాభవము దటస్థించుట సహింపఁజాలక చెప్పుచుంటిని. సంజీవకుని తప్పు లన్నిటిని వినియుఁ బ్రభు వూరకున్న యెడల నాదోషము లేదని తృప్తివడుదును."

ఇంతగా నొక్కిచెప్పుచున్న దమనకుని మాటలు విని "గుణదోషము లెఱుఁగక యేపనియుఁ జేయరాదు. గర్వము చేత నెవడు సర్పమునోటఁ జేయిదూర్చును? దోష మున్నచో దండింపక విడుచుటయుఁ దప్పే. దోషము లేనిచో దండించుట యెంతమాత్రముఁ దగదు." అని పింగళకుఁడు మనసున నాలోచించుకొని దమనకునితో

“అతని నిరాకరించి వెడలఁగొట్టుట యుచితమా? హెచ్చరించి చూచుట మంచిదా?” యన దమనకుఁ డిట్లనెను.

“వలదు, వలదు. ఇంతలోనే మంత్రభంగము గావింపరాదు. మంత్రబీజము భగ్నము గాకుండ బహుయత్నములచేఁ గాపాడవలయును. ఒకసారియది భగ్నమైన నిఁక నది యంకురింపఁ జాలదు. చేయఁదగినది యెవ్వరు నెఱుఁగకుండ వేగముగాఁ జేయుట మంచిది. అధీరుఁడగు యోధుఁడు సర్వాంగములు గవచముచేఁ గప్పుకొనియుండియుఁ బరులు భేదింపఁ గలరను భయమునఁ జిరకాలము యుద్ధరంగమున నిలువఁ జాలఁడు. అట్లే మంత్ర మెన్నివిధములఁ గాపాడుచున్నను జిరకాలము నిలువఁజాలదు.”

ఈమాటలు విని పింగళకుఁడు “ఆతఁడు నిజముగా విరోధించినను నా కపాయము జేయఁగలుగు సామర్థ్య మాతని కేమిగలదు” అని మరలఁ బ్రశ్నింపగా దమనకు డిటులయెను.

“అ ట్లెన్నఁడుఁ దలఁపరాదు. క్షుద్రశత్రువు కూడ నొకపు డెంత యపకారమైనఁ జేయఁగలడు. అతనికిఁ బరంపరగా నెందఱి స్నేహ ముండునో యెవ్వరి కెఱుక? చూడుము. ఒకతీతువు మిత్రవర్గము దోడుగాఁగా సముద్రమును సాధించెను.

తీతువు సముద్రుని సాధించిన కథ

దక్షిణసముద్రతీరమున నొకపు డొక తీతువు, దాని భార్యయు నొక చెట్టుమీద గూడు కట్టుకొని నివసించు చుండెను. భార్యకుఁ బ్రసవదినములు సమీపింపఁగా నొకనాఁడది భర్తతో నిట్లు సంభాషణము సాగించెను.

భార్య - నాథా! ప్రసవమునకుఁ దగినచోటు వెదుకుము,

భర్త - ఇది తగిన స్థలము గాదా?

భార్య - ఇది సముద్రము నానుకొని యున్నది.

భర్త - సముద్రముచేఁ బీడింపఁ బడునంత యసమర్థులమా మనము?

భార్య - మనకును సముద్రునకును భేదము చాలఁగలదు. యుక్తాయుక్తములు, శక్యాశక్యములుఁ దెలియ పరిజ్ఞానము గలుగువాఁ డెన్నడు దుఃఖము పాలుగాడు. మఱియుఁ దనకుఁ గలుగఁ బోవు పరాభవముఁ దొలఁగించుకొనఁ గలుగును. అనుచితమైన పనులు చేయుట, బలవంతునితోడి పగ, స్త్రీల యెడ నమ్మకముననునవి మృత్యువునకు ద్వారములు.

ఇట్లు సంభాషణము జరిగిన వెనుక భర్త భయములేదని భార్యకు నచ్చఁజెప్పెను. తుదకు భార్య యచటనే ప్రసవించెను.

ఆదంపతుల సంభాషణము లన్నియు విన్నవాఁడగుటచేత సముద్రునకు వారి శక్తి యెఱుఁగవలయునని తలఁపు గలిగెను. తన తరంగములచే వాని గ్రుడ్లున్నియు నపహరించెను.

అందు కాడుతీతువు మిక్కిలి విచారించెను. మగతీతువు భార్య నోదార్చి తనజాతిపక్షుల నెల్ల రావించి తనకుఁ గలిగిన హాని వానికి వివరించెను. వాని సానుభూతి సంపాదించి వాని నన్నిటిం దీసికొని గరుత్మంతునికడ కేఁగెను. వినయపూర్వకముగా వందన మొనరించి “ప్రభూ! తప్పేమియుఁ జేయకున్నను సముద్రుఁడు నా కపకార మొనరించినాఁడు. నాసంతతిని నాశన మొనరించినాఁడు” అని విచారమునఁ బలికి తనకు గలిగిన కష్టములు వివరించెను.

గరుత్మతుంతుఁ డీమాటలు విని జాలినొంది తనస్వామియగు విష్ణువునకు వృత్తాంత మంతయు నివేదించెను. సేవకుని మనవి యాలకించి విష్ణువు సముద్రుని దండించుట కాజ్ఞ యొసఁగెను.

సముద్రుఁడా సంగతి విని భయపడి పక్షిగ్రుడ్లన్నియు బంగారు పాత్రమున నిడి తీసికొనివచ్చి యా తీతువునకు సమర్పించెను. కాఁబట్టి సంజీవకుని క్షుద్రుఁడని తేలికగాఁ జూడరాదు. తాము పరాకున నున్నపుడు దర్పమునఁ గొమ్ములతోఁ బొడువ వచ్చినపుడే యా సంజీవకుని స్వభావము గుఱుతింపవచ్చును.” అని శక్య మయినంత వఱకు బోధించి సెలవుఁ బుచ్చుకొని దమనకుఁడు మెలమెల్లగా సంజీవకుని కడకుఁ బోయెను.

దమనకుఁడు సంజీవకునకు దుర్బోధ చేయుట

దమనకుఁడు చింతాకులుని వలె నుండుటఁ జూచి సంజీవకుఁడు “మిత్రమా! కుశలమేకద! నీవింత దైన్య మొందినవానివలె నుండుటకుఁ గారణమేమి?’ యని ప్రశ్నింపఁగా దమనకుఁ డిట్లనెను.

“సేవకునకుఁ గుశల మనునది యెట్లుగల్గును? సంపదలా పరాధీనములు. చిత్త మెల్లపుడు నశాంతమై యుండును. జీవితమందు విశ్వాసముగూడ నుండదు. సేవకునివిధ మిట్టిది.

ధనము సంపాదించి గర్వింపని వాఁడును, విషయాసక్తుఁడై యాపదలకు లొంగనివాఁడును, తరుణులఁ జూచి మనసు చలింపనివాఁడును, రాజున కెల్లకాలముఁ

బ్రియుఁడై యుండఁగలుగువాఁడును, మృత్యువునకు వశుఁడు గానివాఁడును, యాచకుఁడై గౌరవముఁ గాంచువాఁడును, దుష్టుల పన్నాగములకు లొంగి కుశలముగాఁ దప్పించుకొనఁగలుగువాఁడును లోకమున నుండు టరిది."

దమనకుని పలుకులు విని సంజీవకుఁ "డిపు డేమి యాపద దటస్థించినది? తెలుపు" మనఁగా దమనకుఁడు మరల నిట్లనియెను.

"ఏమని చెప్పుదును? దురదృష్టవంతుఁడును. సముద్రమున మునిఁగిపోవుచు సర్ప మాధారముగా లభించి నపుడు దానిని గ్రహించుట యెట్లు? విడచుట యెట్లు? ఒకవంక రాజవిశ్వాసము, మఱియొకవంక బంధువినాశము. ఏమి చేయుదును?" ఇట్లు పలికి నిట్టూర్పువిడిచి యూరకుండఁగా సంజీవకుఁడు "మిత్రమా! ఏది యెట్లు జరిగినను వృత్తాంత మంతయు నున్నది యున్నట్లు వివరింపుము" అని పలుకఁగా దమనకుఁడు మిక్కిలి సమీపమునకు వచ్చి రహస్యముగా నిట్లనెను.

"రాజవిశ్వాసమువలన నీసంగతి యెంతమాత్రముఁ జెప్పరానిది. అయినను నీవు నాయందలి నమ్మకముచేత నిచటికి వచ్చిన వాఁడవు. పరలోకవాంఛవలన నీకు హితము చెప్పుట నా విధి. వినుము. మన ప్రభువు నీపయి నెంతయో యలుకఁ జెందియున్నాఁడు. నినుఁజంపి సేవకులకు సంతర్పణముఁ జేయుదునని రహస్యముగా శపథముఁ బూని యున్నాడు. ఈసంగతి విన్నప్పటినుండియు నేను పొందుచున్న పరితాపమునకు మేరలేదు."

దమనకుని మాటలు విని సంజీవకుఁడు "సఖుఁడా! విషాద మొందకుము. దైవవశమున నెప్పు డేది వచ్చునో దానికి సిద్ధపడి యుండవలయును. ఆపద వచ్చినపుడు సమయానుసారముగా వర్తించి వీలయినచో దప్పించుకొనవలయును" అని పలికి యించుకనే పూరకుండి తనలో " ఈ వ్యవహారము వలన దుర్జనుల చిత్తవృత్తి యెట్టిదో తెలియుచున్నది. ఈలోకమున స్త్రీలు దుర్జనులకే వశులగుదురు. రా జపాత్రులనే యాదరించును. లోభికే ధనము లభించును. మేఘుఁడు కొండల యందు వర్షించును. ఎంతహాని సంభవించినది? ఎన్ని విధముల యత్నించి కొలిచినను రాజునకుఁ దృప్తికలుగ దనుమాట ముమ్మాటికిని నిజము. ఇది యుపాయము గానరాని యపాయము. ఏలయన నెవరైనఁ గారణముండి కోపించినచో నా కారణము తొలఁగఁగానే యదియుఁ బోవును. కారణము లేకుండ బగఁ బూనినవాని కోప మెవరు పోఁగొట్టఁగలరు? రాజునకు నే నేమి యపకార మొనరించితిని? రాజు లనఁగా నకారణము గనే హాని సేయువారా? ఒక్కొక్కరాజు తనకు మేలు చేసిన వారి యెడనే పగవహించును. కీడొనరించిన వారియం దమితమగు ప్రీతిఁ జూపును. సేవాధర్మమిట్టిది. ఇందలిరహస్యము యోగులకైన నెఱుగ రానిది.

మంచిగందపుఁ జెట్టునఁ ద్రాచుఁ బాములుఁ, జక్కని కమలములుగల చెఱువులందు మొసళ్లు, సుఖములయందు విఘ్నములుఁ జేరియుండును.

మంచిగందపుఁ జెట్టున మొదట సర్పములు చుట్టుకొని యుండును. కుసుమములయందుఁ దుమ్మెదలు క్రమ్ముకొని యుండును, శాఖములపై నెలుగుబంటులు నివసించును, శాఖాగ్రములపైఁ గోతు లల్లరిచేయుచుండును. దానియందు దుష్టు లాశ్రయింపని భాగము గొంచెమైననులేదు. ఈ ప్రభువు మాటలు తియ్యఁగాఁ బలుకును. హృదయమున విషము ధరించియుండును. చేష్టలన్నియుఁ బ్రేమమయముగఁ గానఁబడును. ఈతఁ డీవిద్య యెచ్చట నేర్చినాఁడో కదా!

సముద్రము దాఁటుటకు నావయుఁ, జీకటి దొలఁగించుటకు దీపము, గాలి లేనపుడు విసనకఱ్ఱయు, నేనుఁగుల మద మణంచుట కంకుశము ననెడి యుపాయములు దేవుఁడు కల్పించియున్నాఁడు. కాని దుష్టుని మనసు మార్చుట కే యుపాయములుఁ జూపఁజాలక భగ్నమనోరథుఁ డయినాఁడు.” అని తలపోసి మరల నిట్టూర్పుపుచ్చి యిట్లు చింతించెను.

“కేవలము సస్యముఁ దిని జీవించు నన్ను మృగరా జేల చంపవలయును? విత్తము, బలము, సమముగాఁ గలవారితోఁ గలహించుటకుఁ గారణముండును గాని నావంటివానిపైఁ గోప మేల కలుగవలయును. ఎవఁడు నాపై రాజున కలుకపుట్టించెనో తెలియదు.

స్ఫటికముతోఁ జేయబడిన వలయము విఱిగినచో మరల నదుక రాని యట్లు రాజునకు విముఖత గలిగినపుఁ డాతని మనసు మరలుప శక్యముగాదు.

పిడుగు, రాజ తేజము మిక్కిలి భయంకరములు. అందు మొదటిది యొక్కచోటనే పడును. రెండవది యన్ని ప్రదేశము లందుఁ బడును.

ఇఁక నాతని యాజ్ఞ కెదురు చూచుట మంచిదిగాదు. మరణించిన స్వర్గము గలుగును. శత్రునిఁ జంపిన సుఖము గలుగును. శూరున కీ రెండే మంచిదారులు. యుద్ధము చేయకున్నను మరణము తప్పనిసరియై, యుద్ధము చేయునెడ బ్రదుకుటకుఁ గొంచెమైన వీలున్నపు డది యుద్ధముచేసి తీరవలసిన సమయమని బుద్ధిమంతులు తలఁచెదరు. కావున యుద్ధమొనరించి చచ్చుటయే మేలు.” సంజీవకుఁ డీవిధమున నాలోచించి దమనకునితో నిట్లనెను.

“మిత్రమా! ఆతఁడు నన్నేవిధమునఁ జంపఁ దలఁచెనని నీయభిప్రాయము?”

దానికి దమనకుఁడు “పింగళకుఁడు చెవులు నిగిడించి నోరు దెఱచికొని, చరణములెత్తి నీమీఁది కుఱుకుటకు సిద్ధ పడినపుడు కొలఁది గడియలలో నీవే తెలిసికొనఁగలవు.కాని యీ విషయ మంతయు గుప్తముగా నుంచుము. రహస్య మేమాత్రము వెల్లడియైనను

నీతోఁబాటు నాకును జీవితము నేఁటితో సరి." యని సమాధాన మిచ్చెను. కొంతసే పిట్లు తగని వగలు నటించి సంజీవకునిఁ బింగళకుని మీఁద యుద్ధమునకుఁ బురికొల్పి యాతని వీడుకొని కరటకుని కడకుఁ బోయెను. ఆతఁ "డేమి జరిగినది" యని యడుగఁగా దమనకుఁ డిట్లు చెప్పెను.

"సందియమేల? దుష్టులకుఁ జుట్టములును, యాచించినచోఁ గోపింపనివాఁడును, విత్తముతో సంతుష్టినొందువాఁడును నెందైన నుందురా?"

ఈ విధముగాఁ బలికి తిన్నఁగా దమనకుఁడు పింగళకుని కడకేఁగి వందన మాచరించి యెంతో దిగులు చెందిన వానివలెఁ గూరుచుండెను. పింగళకుఁడు "దమనకా! సంజీవకుని వైఖరి యేమైన మరలఁ దెలియవచ్చినదా?" యని ప్రశ్నింపఁగాఁ "బ్రభూ! చెప్పుటకు నోట మాట రాకున్నయది. ఆతఁడెంతదుష్టుఁ డయినను నేమైనను మంచి యూహ కలుగు నేమో యని యాసించి యాతనిజాడ గనిపెట్టి యుంటిని. ఆతఁడు తనపాపపుఁ జింత విడువలేదు సరికదా! యిఁక నెంత మాత్రము నాలసింపక ప్రభువువారి కాపదగలిగింప నుద్యుక్తుఁడై యున్నాఁడు. కొలఁది నిముసములలోనే ప్రభువు వారి మీఁది కాతఁడు రాఁగలడని యాతని వైఖరింబట్టి నాకుఁ దోఁచినది. కావునఁ బ్రభువువా రేమఱక యుండుదురు గాక యని నా మనవి.

సంజీవకుని వధ

దమనకుఁ డిట్లు పలుకుచుండఁగనే పింగళకునకు దూరమున సంజీవకుఁడు వచ్చుచున్న జాడ తోఁచెను. అంతటఁ బెల్లుబికి వచ్చుచున్న కోపము నడచుఁకొనఁ జాలక నోరు దెఱచికొని చరణము లెత్తి మీదికి దుమికి సంజీవకు నొక్కమ్మడిఁ జీల్చివేయుటకు సంసిద్ధుఁడై యుండెను.

సంజీవకుఁడును దూరమునుండియే పింగళకుని వైఖరింజూచి దమనకుఁడు చెప్పిన దంతయు 'అక్షరాల' నిజము కదా! యని యెంచి తనశక్తి కొలదియు విక్రమముఁ జూప దలఁచి తలవంచి కొమ్ము లేటవాలుగాఁ జేసి యతి వేగమున సింహము నొక్క క్రుమ్ము క్రుమ్మెను. పింగళకుఁడు నాదెబ్బకు నొచ్చుకొనియు సంజీవకుని బలమునకు మెచ్చుకొని, తనకు గలిగిన యవమానము భరింపలేక మండిపడి యావృషభముం జిత్రవధ గావించి కసిదీర్చుకొనెను.

పిమ్మటఁ గొంతసేపటికిఁ బ్రాణమిత్రుడగు సంజీవకుని జంపుట యక్రమమని తలఁపు గలిగి పింగళకుఁడు దుఃఖా కాంత్రుఁడై యిట్లు చింతించెను.

"పాపము లన్నిటికి రాజే పాత్రుఁ డగును. ఇతరులు రాజ్యసుఖ మనుభవింతురు. రాజ్యమునఁ గొంతభాగముం గోలు పోయిన నెన్నఁడైనను మరల సంపాదింపవచ్చును. ఉత్తములగు సేవకులం గోలుపోయిన యెడల నట్టివారు తిరిగి లభించుట యసంభవము."

ఇట్లు విచారించుచున్న పింగళకుం జూచి దమనకుఁడు "స్వామీ! పగవానిం జంపి విచారించుట పాడిగాదు. సుతుఁడుగాని, సోదరుడుగాని, సఖుఁడుగాని, యపాయముఁ గలిగింపఁ దలఁచెనేని సంపదల నందగోరు రాజు వారిం జంపితీర వలయును. ధర్మార్థ కామముల తత్త్వమెఱింగిన వారెవరు నతిదయకు లోనుగారాదు. మితిమీఱిన యోరిమిగలవాఁడు చేతఁ జిక్కిన ఫలమయిన ననుభవింపఁ జాలఁడు. మిత్రుల యెడలను, శత్రుల యెడలను సమానముగా శాంతిఁ బూనుట యోగులకు మాత్రమే తగును. ఆశాంతియే యపరాధులందు జూపుట రాజులకు దోసమగును. అహంకారము చేతను, రాజ్యమందలి యాశచేతను బ్రభుపదము నాక్రమింపఁ దలచువానికి మరణదండన మొక్కటియే ప్రాయశ్చిత్తము.

జాలిగలరాజు, సర్వభక్షకుఁడగు బ్రాహ్మణుఁడు, వశము దప్పిన భార్యయు, దుష్టచిత్తుఁడగు మిత్రుఁడును బ్రమాదముఁ గలిగించు నధికారియు, జేసినమేలు మఱచువాడుఁను సర్వదా విడువందగుదురు. రాజనీతి వేశ్యాంగన వంటిది. ఒకపుడు సత్యముతోను మఱియొకపు డసత్యముతోను గూడినదై యుండును. ఒకపుడు గాఠిన్యము గలిగియుండి మరియొకపుడు ప్రియవచనములతోఁ గూడినదైయుండును. ఒకపుడు క్రూరముగను నింకొకపుడు దయా యుక్తముగను నుండును. ఒకపుడు లోభముగలిగియుండి మఱియొకపుడు దానగుణముతో నొప్పు చుండును. ఒకపు డతివ్యయము గలదియు, మఱొకపుడు విస్తారమయిన ధనము, రత్నములు సంపాదించునదియునై యుండును." అని బోధించి యోదార్పఁగాఁ బింగళకుఁడు సరిపెట్టుకొని యూరడిలి యుండెను. దమనకుఁడును సంతసిల్లి 'సకలజనులకు శుభమును, రాజునకు జయమును వర్ధిల్లునుగాక యని పలికి తిరిగి రాజాదరము నొంది సుఖముగా నుండెను."

అని వినిపించి విష్ణుశర్మ రాజపుత్రులతో నిటులనెను. "మీ రిపుడు మిత్రభేదము సొంతముగా వినియుంటిరి. మీరును శత్రునిలయములం దిటులే మిత్రభేదముఁ గల్పించి విజయముం గాంచి వర్ధిల్లుఁ" డని పలికెను.

విగ్రహము

అనంతరము రాజకుమారులు విష్ణుశర్మతో “ఆర్యా! మీదయవలన మిత్రభేదము సాంతముగా వింటిమి. విగ్రహము విన, గుతూహలముతో నున్నాము.” అని పలుక, విష్ణుశర్మ యిటులు చెప్పఁదొడఁగెను.

“సమానబలముగల హంసలకు మయూరములకు విరోధము గలిగినపుడు వాయసము శత్రుమందిరమందుండి నమ్మించి హంసలను వంచించినవి. మీకా కథ వివరించెదను వినుడు.

హిరణ్యగర్భుని వృత్తాంతము

కర్పూరద్వీపమున పద్మకేళి యను పేర నొప్పు నొక చెరువు గలదు. అందు హిరణ్యగర్భుడను రాజహంస నివసించుచుండెను. అది జలచరములగు పక్షు లన్నిటిచే పక్షిరాజుగా నభిషేక మొందెను. ప్రజలు, చక్కగా నడపు నాయకుఁడు లేకున్నచో కర్ణధారుఁడులేని నావవలెఁ బ్రమాద మొందుదురు. ప్రజను రాజు రక్షించినచో ప్రజ రాజును గాపాడును. పెంపు సేయుట కన్న ఉన్నదానిని రక్షించుట మంచిది. రక్షణము లేకున్న పోషణమున కవకాశమే యుండదుకదా!

ఒకనాడు రాజహంస చక్కగా పఱువంబడిన కమల పర్యంకమున గూరుచుండి పరివారముతోఁ గొలువుదీరి యుండెను. అపుడు దీర్ఘముఖమను నొకకొంగ యెచట నుండియో వచ్చి ప్రభువునకు నమస్కరించి కూర్చుండెను.

రాజపుడు “దీర్ఘముఖుడా! దేశాంతరమునుండి వచ్చి యుంటివి. విశేషము లే మైన నున్న చెప్పుము.” అనెను. అపుడా బకము “ప్రభూ! గొప్ప విశేషము గలదు. అది తమకు మనవి చేయుటకై తొందరపడి వచ్చితిని. జంబూద్వీపమున వింధ్యమను పేరుగల కొండ గలదు. అచట చిత్రవర్ణుడను మయూరము పక్షులకు రాజై యుండెను. నే నొక యడవిలోఁ దిరుగుచుండగాఁ చిత్రవర్ణుని యనుచరులు నన్ను జూచి ‘నీవెవఁడవు? ఎచటనుండి వచ్చితివి?’ అని యడుగ నే నిటుల చెప్పితిని.

“కర్పూర ద్వీపమునకు జక్రవర్తియైన హిరణ్యగర్భుడను రాజహంసుని యనుచరుడను. దేశాంతరములఁ జూడ వలయు నను వేడుకతో నిచటికి వచ్చితిని. ”

అపుడు వారు ‘మీ దేశము, మాదేశము జూచితివి గదా! ఈరెండు దేశములలో నేది యుత్తమమైనది? ఏ దేశపు రాజు యోగ్యుడు, సమర్థుడు నై యున్నాఁ’డని ప్రశ్నింప; నే నిటు లంటిని :

“ఏమి పలుకుచుంటిరి? చాల భేదము గలదు. కర్పూర ద్వీపమనగాఁ గేవలము స్వర్గమే. మరియు రాజహంస యపర దేవేంద్రుడు. ఈమరుస్థలమున బడియున్నచో మీకేమి ప్రయోజనము? మాదేశమునకు రండు.”

నాపలుకులకు వానికన్నింటికిం గడుంగడుఁ గ్రోధము కలిగినది. అది యుచితమే. ఎట్లన; పామునకు బాలుపోసి పెంచిన వాని విషము వర్ధిలునటులు మూర్ఖుల కొనరించిన మంచిబోధ వారికిఁ గోపము కలిగించునే కాని శాంతి నొసఁగదు. మరియు నెఱుక కలవానికి బోధింపవలయుఁ గాని మూర్ఖున కెన్నడును బోధింపరాదు. వానరముల కుపదేశించి పక్షులు స్థానభ్రష్టములైన కథయొకటి కలదు. దాని నెఱింగింతును వినుము.

వానరములకు బోధచేసి చెడిన పక్షుల కథ

నర్మదాతీరమున నొక విశాల మైన బూరుగు చెట్టు గలదు. అచట గూళ్ళు కట్టుకొని పక్షులు కొన్ని సుఖముగా వాసము చేయుచుండెను. వర్షాకాలమున నొకనాఁడచట నాకస మంతయు మబ్బు లావరించి ధారాపాతముగా వాన పడెను.

కొన్ని వానరములు వానకుఁ దడిసి, చలికి బాధపడుచు బూరుగు చెట్టుక్రిందకుఁ జేరినవి. వాని పట్ల జాలికలిగి పక్షులు ‘ఓ వానరములారా! మేము మా యల్పశక్తిగల ముక్కులతో నెట్లో తృణములు సేకరించి గూండ్లుకట్టుకొని యుంటిమి. కరచరణాదులు కలిగియు మీరిట్లేల దుఃఖపడవలయును?’ అని పలికినవి. పక్షులపలుకులు వినుసరికి కోఁతుల కసూయ కలిగినది. ‘చలిగాలి తగులని గూండ్లనడుమ సుఖముగా నుండి యీపక్షులు మనలను నిందించుచున్నవి. వాన వెలిసిన వెనుక వానిపని పట్టింతు’ మని కూడఁబలికికొని వానరములా బూరుగు చెట్టెక్కి పక్షి గూండ్లన్నిటిని భగ్నపఱచి గ్రుడ్లను చిదిపి క్రిందఁబడ వైచినవి. కావున మూర్ఖులకు బోధింపరాదు.”

అని దీర్ఘముఖుఁడు పలికిన మాటలు విని రాజహంస “పిమ్మట నాపక్షులేమి చేసినదియుఁ జెప్పు” మని యడిగెను. మరల బక మిట్లు చెప్పఁదొడగెను. ఆ పక్షులు గోపగించి ‘రాజహంసను రాజును చేసిన వారెవ’ రని పశ్నించినవి. ‘మీ మయూరమునకు రాజ్యాభిషేకము చేసినవారెవ’ రని నేను కోపమునఁ బ్రశ్నించితిని. నా ప్రశ్న కలిగి యవి నన్ను జంప సిద్ధపడినవి. నేను నూరకుండక నా విక్రమముఁ గొంతఁ చవి చూపితిని.

స్త్రీలకుఁ సిగ్గు సొగసు కూర్చునటులు పురుషులకు నోరిమి యొకపుడు భూషణ మగును. కాని పరిభవము రాబోవునపుడు విక్రమింపక తప్పదుగదా?" యన రాజహంస "తనబలము నెదిరిబలముఁ జక్కగాఁ బరిశీలించి తారతమ్యము గుర్తింపనివాడు శత్రువులచేఁ నవమానింపఁ బడును. అది గ్రహింపక వాగ్దోష మొనరింపరాదు. చిర కాలము పులిచర్మము గప్పుకొని సస్యముతోనిండిన పొలమున సుఖముగాఁ దిరుగుచు వాగ్దోషమువలన గదా పూర్వ మొక గాడిద చనిపోయినది? నీ కాకథ వినుతు" నని బకముతో నిట్లు చెప్ప మొదలిడెను.

వాగ్దోషము వలనఁ జెడిన గాడిద కథ

హస్తినాపురమున విలాసుఁడను నామముగల చాకలి యొక్కఁడుగలడు. వాని గాడిద బరువు మోసి మోసి, చిక్కి శవమువలె నయ్యెను. దానిజూచి యారజకుఁడు పులితోలు సంపాదించి దానిపై గప్పి యరణ్యసమీపమున నొక పంట పొలముమీద విడిచెను. అనంతరము దానిని జూచి పులి యని బ్రమసి పొలముకాపులు పాఱిపోవజొచ్చిరి.

కొంతకాలమట్లు గడచిన వెనుక నొక పొలము కాపరి బూడిదరంగు గల కంబళము గప్పుకొని, విల్లమ్ములు సిద్ధపఱచుకొని, యొకచో దాగి యుండెను. స్వేచ్ఛతో సస్యములు దినుటజే బలిసిన యాగార్దభ మాతనిఁజూచి, వేఱొక గాడిద యని భావించి, జాతిస్వ భావముచే బిగ్గరగా నోండ్ర పెట్టుచు నెదురుగాఁ బరుగిడెను.

సస్యరక్షకుఁడా ధ్వనింబట్టి 'యది గాడిద యేకాని పులి కాదని నిశ్చయించి యవలీలగా దానిని జంపివైచెను. కావున బరబల మెఱుగక వర్తింపరాదు; వాగ్దోషమునకు బూనుకొనరాదు" అని రాజహంస చెప్పినది విని దీర్ఘముఖుడు మరల నిట్లు చెప్పఁదొడఁగెను.

"ఆపక్షులు నాపలుకులు విని "యోదుష్టబకమా! మా భూమియందుఁ జరించుచు మాస్వామి నాక్షేపించు చుంటివి. ఇది యెంతమాత్రము క్షమింపరానిది.' అని చెప్పుచు నవి యన్నియు ముక్కులతో నను బొడిచి కోపముతో నిట్లు పలికినవి. 'ఓమూర్ఖుడా! మీరాజయిన హంస సర్వవిధముల మృదువైనవాడు. వానికి రాజ్యాధికారము నిండుసున్న. ఏలయన మిక్కిలి మెత్తనివాడఱచేతి యందలి యర్థమునైన రక్షించు కొనఁజాలడు. అట్టివాడు నేల యెట్లేలఁ గలుగును? వానికి రాజ్యాధికార మెట్లు పొసఁగును? మఱియు నీవు కూపస్థ మండూకమవు, కాబట్టియే యట్టివాని నాశ్రయింపుమని మాకుపదేశించుచుంటివి.

ఫలచ్ఛాయా సమన్వితమైన వృక్షము నాశ్రయించినచో దైవికముగా దాని ఫలము లనుభవింప జాలకున్నను దానినీడ ననుభవించుట కేయాటంకము నుండదు. కావున ఘనుల నాశ్రయింప వలయునే కాని హీనుల నెన్నఁ డాశ్రయింపరాదు. క్షీరమైనను గవండ్లదాని హస్తమునఁ బడినచో మద్యమని తలప బడును. గుణరహితమైన యాశ్రయమును బొంది ఘనుఁడు గూడ నల్పుఁడుగాఁ గానబడును. మహాగజముచిన్నయుద్ధమున నల్పజంతువుగాఁ గానఁబడునుగదా! అతిసమర్థుఁడగు ఠేని పేరు చెప్పికొన్నను నొకపుడు ఫలసిద్ధి యగును. చందమామ పేరుచెప్పుకొని చెవులుపిల్లులు సౌఖ్య మొందిన కథ యొకండు కలదు. నీకాకథ తెలుపుదుము వినుము.

చంద్రుని పేరుచెప్పుకొని మేలొందిన కుందేళ్ళ కథ

ఒకపుడు వానలు నేమి దాహపీడితమైన యేనుఁగుల గుంపు తమస్వామిని జేరి 'ప్రభూ! మన కిక జీవనోపాధి యేమి? క్షుద్రజంతువులై న మునుఁగుటకుఁ దగు గుంట కానరాదు. మనము స్నానమొనరించుటకు దగు వెరవులేక మృతప్రాయులమై యున్నాము. మనమేమి చేయుదము? ఎచటికిబోవుద' మని విలపింప గజరాజు కొంతదూరము తిరిగి నిర్మల జలముతో నిండినయొక చెఱువు గనుఁగొని వానిబాధ తొలగించెను.

ఏనుఁగులన్నియు నామడువునకు వచ్చుచుఁబోవుచుండ గట్టున నివసించుచున్న కుందేళ్ళు వానిపాదముల ద్రొక్కుడుచే మడియుచుండెను.

వానిలో శిలీముఖుఁడను నొక కుందేలు 'ఈయేనుఁగుల గుంపు దప్పికచే నిట్లు రోజు నీచెఱువునకు వచ్చు చుండును. అందువలన మన కుల మంతయు నశించునటులున్నది. ' అని పలుక విజయుడను నొక ముదుసలి కుందేలు 'విషాదము నొందకుఁడు. నేను దీనికి బ్రతిక్రియ చేయగలఁను' అని శపథముచేసి వెడలెను.

"ఏనుఁగు, స్పర్శమాత్రముననే చంపఁగలదు. పాము, కాటుచే మరణము గలిగించును. భూపాలుఁడు పరిపాలించుచునే ప్రజను హతమార్చును. దుర్జనుండు నవ్వుచునే హాని కలిగించును. కావునఁ కొండశిఖర మెక్కి మఱియు గజనాయకునితో సంవాదమునకు దిగుదు" నని యాలోచించి విజయుఁడట్లు గిరిశిఖర మెక్కెను.

అంతలో గజరాజువచ్చి యాతనిజూచి 'నీవెఁడ, వెచటనుండి వచ్చితి'వని ప్రశ్నింప 'నేను చెవులపిల్లిని, భగవానుఁడగు చందమామ నన్ను నీకడ కనుప వచ్చితిని' అని జవాబిచ్చాను. 'నీవు వచ్చిన పనియే' మని హస్తి యడుగ విజయుఁడిటులనియెను.

"శస్త్రము లెదుటఁ గానబడుచున్నను దూత యథార్థము పలుక వలయునేగాని మఱుగుపఱుపరాదు. కావున దూత యెల్లప్పుడు వధింప ననర్హుడు. నేను చంద్రుని యాజ్ఞచొప్పున నుడువుచుంటిని. వినుము. 'ఈ చంద్రసరోవరము కాపాడుచున్న శశకములను నీవు బాధించుచుంటివి. నీవు చేయు పని కడు ననుచితము. చిరకాలమునుండి యవి నారక్షణమున నున్నవి. కావుననే నాకు శంశాంకుఁడని ప్రసిద్ధి. కావున జీవిత మం దాశ గలదేని యిఁకెన్నడు నీ సరోవరము చెంతకు రావల' దని చంద్రభగవానుని సందేశము" అని పలుక నాగజపతి "చంద్రభగవానుఁ డిపు డెచట నున్నాడని యడిగెను. దానికి విజయుఁడు మీ త్రొక్కుడుచే నశింపఁగా మిగిలిన కుందేళ్ల నూరడించు నిమిత్త మీసరసునకు వేంచేసియుండి నన్ను నీకడ కంపె' ననెను.

అది విని యాగజము 'కరుణింపు. తెలియక యాతప్పు చేసితిని. ఇంకెన్నడు నిట్టిపని జరుగదు' అని పలికి "మీ స్వామి నొకపరి చూపుము. ప్రణామ మొనరించి వేఱు చోటికిఁ బోవుదు' నని గజము కోరను. 'అట్లైన నీ వొంటరిగా ర' మ్మని యర్థరాత్రమున నేనుఁగును దీసికొనిపోయి నిర్మలజలము నడుమనున్న చంద్రబింబముఁ జూపి "స్వామి సమాధియందున్నారు. కావున నెమ్మదిగా నమస్కరించి వెడలిపొమ్ము. కాదేని సమాధిభంగమున కాతడు మిక్కిలి కోపించును.' అని శశకము చెప్పెను.

ఏనుగుఁను మిక్కిలి భీతిల్లి యట్లే వందన మాచరించి వెడలిపోయెను. కుందేళ్లాదినము నుండి నిర్భయముగా తమ తమ తావులందు వసించి సుఖముగాఁ గాలక్షేపము చేయుచున్న వి."

అని యాబక్షులు చెప్పిన పలుకులకు "నేను "మా ప్రభువగు రాజహంస మహాప్రతాపవంతుండు. ఆతడు ముల్లోకములు నేలఁగల దిట్ట. ఒక రాజ్యమే యననేల?" యంటిని,

దీర్ఘముఖుఁడు చిత్రవర్ణుని దర్శించుట

అపు డవి కోపించి వారి రాజగు చిత్రవర్ణునొద్దకు నన్నుజేర్చి 'ప్రభూ! అవధరింపుము. ఈ దుష్టమగు కొంగ మన దేశమున సంచరించుచు దేవర నాక్షేపించుచున్నది' అని విన్నవించినవి. 'ఈతఁ డెవ' డని రాజడుగ 'హిరణ్యగర్భుఁడను రాజహంసుని యనుచరుడు కర్పూరద్వీపమునుండి

యీతఁడు వచ్చినాడు.' అని దెలిపినవి.

అపు డచటనున్న మంత్రియగు, గృధ్రము నన్నిట్లు ప్రశ్నించెను. "మీ రాజ్యమున ముఖ్యమంత్రి యెవరు?" "సకలశాస్త్రమర్మము లెఱిగిన సర్వజ్ఞుఁడను చక్రవాము మాకు మంత్రి?" యని నేనంటిని. "ఇది యుచితముగా నున్నది. మీ మంత్రి స్వీయదేశస్థుడే ; 'దేశస్థుని, కులాచారముల శుద్ధుడైనవానిని, వ్యసనములు లేనివానిని, మంత్రజ్ఞునిఁ, బండితునిఁ, గోశముఁ, బెంపొందింపఁ గలవానిని మంత్రిగా నియమించుకొనవలయు' నని ఆర్యులు పలుకుదురు" అని యా గృధ్రము చెప్పుచుండునంతలో నచటి చిలుక కల్పించుకొని యిట్లనెను.

"ప్రభూ! కర్పూరద్వీపము మున్నగునవి జంబూద్వీపమున నంతర్గత మైన చిన్న దీవులు. వానిపై నధిశారము దేవరవారిదే. "

దాని కా రాజు "ఔనౌను. రాజు, మత్తుఁడు, శిశువు, ధనికుడు నలభ్యము లైన వానిం గూడ వాంఛించును. సులభముగా లభించువాని నేల యుపేక్షింపవలయును" అని పలుక నపుడు నేను "మాటాడిన మాత్రమున నాధిపత్యము లభించునట్లైన మాప్రభువునకు జంబూద్వీపముపై నధికారము గల" దంటిని. 'దీనిని నిర్ణయించు టె" ట్లని చిలుక ప్రశ్నించెను. 'దీని నిర్ణయించునది యుద్ధమే' యని నేను బదులు పలికితిని.

అపుడు రాజు 'మీస్వామి కడకేఁగి సిద్ధపఱుపు' మని నుడివెను. 'మీదూతను కూడ నావెంట పంపుఁ' డని నే నన; రాజు "మీలో దూతగా నెవ్వరు వెడలుదురు? భక్తుడు, గుణవంతుడు, పవిత్రుఁడు, సమర్థుఁడు, శత్రుమర్మముల నెఱుగఁ గలవాఁడు దూత కృత్యమున కర్హుఁ" డని పలుక గృధము "ఇట్టివారు పెక్కుమంది కలరు; కాని వారిలో బ్రాహ్మణుడే పంపదగువాఁడు. ఆతనికి రాజధనమం దపేక్ష యుండదు." అను మాటలు పలుక రాజు "అటులైనఁ జిలుకయే యీపనికి వెడలవలయును. ఓశుకమా! నీ వితనితో నేఁగి నా యభిలాషను రాజహంస కెఱింగింపుము" అని యాజ్ఞాపించెను.

ఆయాజ్ఞ విని శుక మిటు లనియె. దేవరవారి యాజ్ఞకు విధేయుడను. కాని యీబకము కడుదుష్టమైనది. కావున దీనితో వెళ్ళజాలను. దుష్టు లొనరించు నేరమునకు ఫలితము వారివెంటఁ జను సాధువు లనుభవింతురు. సీతను రావణుఁడపహరింపగా మహోదధికి బంధనము ప్రాప్తించెనుగదా! కావున దుష్టునితో వసించుట, పయనము సేయుట యుక్తము కాదు. కాక స్నే హమువలన నొక హంసయు, నొక వర్తక పక్షియు హాని చెందెను, నీ కా కథ యెఱి గింతును వినుము.

కాక స్నేహమున మరణించిన హంస కథ

ఉజ్జయినీ మార్గమున నొక జువ్వి చెట్టు గలదు. అచట హంస కాకములు వసించుచుండెను. గ్రీష్మకాలమున నొకనాడు బాటసారి యొకడు మార్గశ్రాంతుఁడై యాచెట్టు నీడను విల్లమ్ముల నిడుకొని నిదురించెను. క్షణకాలమున నాతని ముఖమునుండి నీడ తొలఁగిపోయెను. ఆతని ముఖమున గాటమగు నెండ సోకుచుండెను. అది చూచుచున్న చెట్టు మీది యంచకు జాలికలిగెను. అది తన రెక్క లాతని ముఖముపై నీడ పడునట్లు విప్పియుంచెను. కొంత సేపైన పిదప సుఖనిద్ర నొందిన యాతడు నోరు తెరచి యావులించెను. అపుడు పరసుఖమును సహింపనిదియు, సహజముగా దుష్టమైనది నగు కాకి యాతని నోట రెట్ట వైచి పాఱిపోయెను. బాటసారి తలపైకెత్తి చూచుసరికి హంస కానఁబడియె. ఈ పని చేసిన దిదియే యని తలంచి యాతడు తన వింటిచేఁ గొట్టి దానిం జంపి వైచెను.

కాక స్నేహమువలనఁ జనిపోయిన వర్తక పక్షి కథ

ఒకపుడు గరుడయాత్ర నిమిత్తమై పక్షులు బయలుదేరి సముద్రతీరమున కేఁగినవి. అపుడొక కాకివెంట నొక వెలిచె పిట్టకూడ జనుచుండెను. గోపాలుఁడొకండు పెరుగు కడవ తలపై నిడుకొని పోవుచుండెను. కాకి యా కుండ యందలి పెరుగు మాటిమాటికి దొంగిలించి తినుచుండెను. పెరుగుకుండ క్రిందనుంచి గొల్లఁడు పైకి చూచుసరికి కాకవర్తకములు గానఁబడియె. అద నెఱిగి కాకి పాఱిపోయెను. ఆ వర్తకపక్షి నిజముగా నిరపరాధి కావున మెల్లగా నెగురుచుండ గొల్లఁడు దానింబట్టి చంపివైచెను. కావున నే నిట్లు చెప్పవలసివచ్చెను."

ఆ శుక మిట్లుపలుకఁగా, నే నిట్లంటిని. "సోదరశుకమా! యిట్లు పలుకుట దగదు. నాకు ప్రభు వెంతయో నీవు నంతియ." నామాటల కది 'యగుఁ గాక దుష్టుల పలుకులు ప్రియముగాఁ గానఁబడినను నకాల కుసుమముల వలె భయ సంజనకము లగును. నీ మాటలవలననే నీ దుర్జనత్వము వెల్లడి యగుచున్నది. మన, భూపాలు రిర్వురకు యుద్ధ కారణము నీ మాటయే కదా!' యని బదులాడెను.

అపుడు రాజును నన్నుఁ దగురీతి సత్కరించి పంపెను. చిలుకయు వెనుక నుండి వచ్చుచుండెను. ఈ వృత్తాంత మంతయుం జిత్తగించి కర్తవ్య మాలోచింపు" డని దీర్ఘముఖుడు రాజహంసతో బలికెను.

అపుడు మంత్రి యగు చక్రవాక మిటు లనియెను. "దేవా! ఈకొంగ విదేశములకుఁగూడ నేఁగి తనకుఁ దోఁచిన రీతి రాజకీయములు నడిపెను. మూర్ఖుల విధ మిట్టిదియే నూ

యొసఁగియైన వివాద ముడిపికొనుట విజ్ఞుని లక్షణము. కారణము లేకున్నను వివాదమునకు దిగుట మూర్ఖుని చిన్నె."

ఆ పలుకులు విని రాజహంస "నిందించుటవలన నేమిలాభము ప్రస్తుత కర్తవ్య మాలోచింతము" అనియెను. ఆపుడు మంత్రి "స్వామీ ఏకాంతమున మాటాడుదము. వర్ణాకారనేత్రముఖసంజ్ఞాదులచే మనసు నూహింపఁ గలరు. కావున మంత్రాలోచనము రహస్యమునఁ జేయఁదగును." అను పలుకులు విని యితరు లందఱు వెడలిపోయిరి.

అపుడు చక్రవాకము "ప్రభూ! నాకిటులు దోచు చున్నది. మన యుద్యోగులలో నెవరో యొకరిట్లీ బకమును పురికొలిపి యుందురు. వైద్యులకు రోగార్తుఁ డవసరము. ఉద్యోగులకు వ్యసనపరుఁడగు ప్రభువు ప్రియుఁడు. పండితులకు మూర్ఖుఁడన్న వింత. సత్పురుషులకు మాత్రము మంచి విషయములం దిష్టము" అని పలికెను.

దానికి రాజు "అగుఁగాక! కారణము పిమ్మట నిశ్చయింతము. ముందు కర్తవ్యము నిరూపింపవలయును." అనెను. అపుడు చక్రవాకము "దేవా! గూఢచరు నొకనిఁ బంప వలయును. పిమ్మట వారిజాడ, బలాబలము లెఱుంగఁ దగును. పరరాష్ట్రము లందలి కార్యా కార్యము లెఱుఁగఁ జాలిన గూఢచారులులేని రాజు నిక్కముగా నంధుఁడు.

ఆ దూత యొక విశ్వాసపాత్రుడగు ననుచరునిఁ దీసికొని వెడలుట మేలు. ఒకఁ డచటనుండి అచటి మంత్రకార్యము చక్కగా రహస్యముగా నెఱింగి రెండవవానికిఁ దెలిపి పంప గలడు. గూఢచారుడు జలస్థలముల రెండింటఁ జరించువాఁడగుట మంచిది. కావున నీబకమునే పంపుము. ఇట్టి మఱొక బకమునే సహాయునిగా బంపుము. ఈసంగతి యతిరహస్యముగాఁ గావింపుము. ముప్పురిచెవుల బడిన మంత్రాలోచనము వెల్లడియైపోవును. కావున రాజెపుడు మూడవవాఁ డుండగా మంత్రాలోచన చేయరాదు. 'మంత్రము భగ్న మైనందున కలుగు ననర్థములు చక్కబఱుప నశక్యము' లని నీతివిదులు పలుకుదురు." అను మంత్రిమాటలకు రా జాలోచించి "నాకుఁ దగిన గూఢచరుడు లభించినాఁ" డని పలికెను. దానికి మంత్రి "యట్లైన సంగ్రామమున విజయము లభించినట్లే" యనెను.

చిలుక రాయబారము

ఇంతలో ద్వారపాలకుండువచ్చి నమస్కరించి "జంబూ ద్వీపమునుండి వచ్చిన యొకశుకము తమ దర్శనార్థము ద్వారమున నుండె నని విన్నవింప రాజహంస చక్రవాకమువైపు చూచెను. అపుడా చక్రవాకము "ఆతని నతిథి బసయం దుంచుము. పిమ్మటఁ జూడవచ్చు నన ద్వారపాలకుఁ డాతని దీసికొని వెడలిపోయెను.

రాజు జక్కవతో "మనకిఁక యుద్ధము సంప్రా ప్తమయి నట్లే" యన జక్రవాకము "ముందుగనే యుద్ధము చేయ రాదు. ముందుగనే యుద్ధమునకును, స్వభూమిఁ ద్యజించుటకును ననాలోచితముగాఁ బ్రభువును బ్రోత్సహించు నాతఁడు దుష్టమంత్రి యనబడును. శత్రువులను రణముచే జయింపవలెనని యెన్నఁడు దలయరాదు. యుద్ధములో జయ మెవ్వరికగునో యేరి కెఱుక? సామదానభేదములలో నే యొకదానిచేఁ గాని; లేదా యన్నింటిచేఁగాని వై రులను సాధించుటకు యత్నింపవలయును. యుద్ధమునఁ జొరబడి యరుల సామర్థ్యముఁ జవిచూడనంతవఱ కందఱును శూరులే.

ఇక యుద్ధము సమీపించినదను సంగతి గమనింపఁ దగినది. సకాలప్రయత్నమువలనఁ కృషి ఫలించునటులు నీతి చక్కగా రక్షింపబడినచోఁ జిరకాలము ఫలింపగలదు. యుద్ధము దూరమున నున్నపుడు భయమును, సమీపించిన కొలఁదియు శూరత్వమును మహాత్ముల లక్షణములు. ఆపద కలిగినపుడే మహాత్ముడు ధైర్యము నొందఁగలడు. తొందర పాటు సక లసిద్ధులకుఁ గడు నంతరాయము. అతి శీతలమైన జలము పర్వతముల గదల్చి వేయలేదా?

మఱియు మయూరరాజగు చిత్రవర్ణుఁడు మహాబలుడు. బలవంతునితో సంగరమొనర్పవలె ననుట కెచటను దృష్టాంతము గానరాదు. ఆయుద్ధము తగరుకొండను డీకొనుటయే కూర్మము వలె కాలము కానపుడు సంకోచ మొంది యవమానమైన సహింపందగును.

సమయము సంప్రాప్తించినపుడు నీతిజ్ఞుడు క్రూరసర్పము వోలె విజృంభింపవలయును. నదీవేగము తృణములను సమానముగా పెకలింపఁ గలుగునట్లుపాయశాలి యెట్టివానినైన నున్మూలింప శక్తుఁడగును.

కావున నాదూతను రావించి దుర్గము సన్నద్ధ మొనర్పఁ బడువఱకుఁ గాలయాపన చేయఁదగును ఏలయన; గోటయందున్న యొక్క యోధుఁడు బయటి నూఱుగురితోఁ బోరగలడు. నూఱుగురైనచో లక్షమందితో యుద్ద మొనరింపవచ్చును.

కావున దుర్గమం దిట్టి విశేషము గలదు. దుర్గమున లేని రాజు తెప్పనుండిజాఱిన మనుజునివంటివాఁడుఁ. అట్టివాఁడు శత్రుపరాభవమునకు సులభుడు.

దుర్గముచుట్టుఁ బెద్ద యఖాతముఁ ద్రవ్వింపవలయును. ఉన్నతమైన ప్రాకార ముండదగును. కొండలనుగాని, నదులలనుగాని, వనములనుగాని, యాశ్రయించి యుండవలయును. విస్తీర్ణత, అతివిషమత్వము జలసమృద్ధి, ధాన్యసమృద్ధి, కట్టెల సమృద్ధి, ప్రవేశము, నవసారము నను నవి దుర్గమునకు స ప్తసంపద లనబడును."? అని చక్ర వాకము పలుక; రాజహంస 'అయిన దుర్గ సన్నాహమున నెవరు నియమింపదగుదు' రనఁ జక్రవాకము మరల నిటు లనియె.

"ఏవడేపనియందు సమర్థుడో వాఁడాపనియందు నియోగింపఁదగినవాఁడు. శాస్త్రపండితుఁడు కూడ వ్యవహారానుభవము లేమి బ్రమాద మొందుటగలదు. కావున సారసపక్షిని రప్పించుట యుచితము."

ఆ ప్రకారము పిలువలబడి వచ్చిన బెగ్గురుపక్షితో రాజిటు లనియెను. "ఓయీ, సారసా! నీవు శ్రీఘ్రముగా నొక దుర్గము నిర్మింపు " మన నా సారసము "ప్రభూ! ఇప్పటికపుడే దుర్గము సునిర్మితమై యున్నదనియే భావింపుము. ఈ మహా సరోవరమధ్యమందలి ద్వీపమున ద్రవ్యములన్నియు జేర్చుటయే తరువాయి. అన్నిటికంటె నాహార ధాన్యాదిక సంగ్రహమే కడుంగడు ముఖ్యము. ముఖమున మణులునిచినను నాహారము లేనిదే ప్రాణధారణ మసంభవము కదా! సర్వ రసములకు నుత్తమము లవణము. అది లేని యే వ్యంజనమైనను గోమయ తుల్య మగును." అని విన్నవింప; రా 'జటులైనఁ ద్వరితముగఁబోయి సకలము సమకూర్పుము' అని యాజ్ఞాపించు నంతలో బ్రతీహారి ప్రవేశించి 'దేవా సింహళద్వీపము నుండి మేఘవర్ణమను వాయసము సపరివారముగా నరుదెంచి 'భవదీయదర్శనాపేక్షతో ద్వారమందుండె' నని విన్నవిం చెను.

హిరణ్యగర్భుడు మేఘవర్ణునిఁ గొలువునఁ జేర్చుకొనుట

"కాకములకు బహువిషయములు తెలియును గానజేర్పఁ దగునని రాజు పలుక జక్రవాకము "నిజమేశకాని కాకము స్థలచరము, మఱియు శత్రుపక్షమున నుద్యోగి; కాన నెటులు చేర్పఁదగును? ఆత్మ పక్షము విడిచి పరపక్షముం జేరు మూఢుడు నీలివర్ణపు నక్కవలెఁ బరులచే హాని నొందును. నీ కా జంబుకము గాథ తెలుపుదును వినుము.

ఆత్మపక్షము విడిచి పరపక్షముఁ జేరి మరణించిన నక్క కథ

ఒక యరణ్యమున నొక జంబుకము గలదు. అది యొకనాఁడు నగర పరిసరములందు స్వైరముగాఁ దిరుగుచు బ్రమాదమున నొక నీలిమందుకుండయందుఁ బడెను. పడి దానినుండి లేవఁజాలక ప్రాతఃకాలమునఁ, జనిపోయిన దానివలె నటించెను. అపుడు యజమానుడు వచ్చి, యది చచ్చినదని తలఁచి దూరముగాఁ బాఱవైవ నది యచటినుండి పాఱిపోయెను.

అనంతర మది యడవిలోనికిఁ బోయి తన నీలవర్ణముఁ జూచుకొని యిటులు తలపోసెను. 'నా రంగిపుడు ప్రశస్తమైనది కావున నేను నా గొప్పతనముఁ

జాటుకొనవలదా?' అని యాలోచించి తన జాతి నక్క లను బిలిచి యిటు లనియె. 'నాకీ వనదేవత స్వహస్తములతో వన రాజ్యమున సకలౌషధి రసములే నభిషేక మొనరించెను. కావున నేఁటినుండి యీ యరణ్యమున నాయాజ్ఞ చే వ్యవహారములు నడుపుకొన వలయును' అని పలుక, నక్కలన్నియు దాని వర్ణవిశేషముఁ జూచి సాష్టాంగ నమస్కారములు చేసి దాని యాజ్ఞలంగీకరించెను. ఈ రీతిగా సకలారణ్య వాసులయందు నధికారము దానికి లభించెను. అనంతర మా జంబుకము జాతి వార లందఱి సహాయ ప్రోత్సాహములచే ఘనత నొందెను. పిమ్మట నా జంబుకంబునకు వ్యాఘ్రములు, సింహములు మున్నగు మహాసత్త్వములు గూడఁ బరిజనులై కొలువ జొచ్చెను.

ఇట్లు జరుగుచుండఁగా నొకనాఁ డానక్క సభలోఁ దన జాతి జంబుకములఁ జూచి సిగ్గిలి వాని నవమానించి దూరముగాఁ దఱుమఁ గొట్టెను. అందుచే నక్కలకన్నిటికి మిక్కిలి విషాదము గలిగెను. ఒక వృద్ధ జంబుకము కడమ వానిం జూచి "చింతింపకుడు. మన కవమానము గలిగించిన యీ జంబుకము నశించు నుపాయ మొండుగలదు. మనము దాని రహస్య మెఱుంగుదుము. నీతివేత్తలము కావున నాయుపాయ మవలంబింతము. ఈ వ్యాఘ్రాది జంతువులు వర్ణ మాత్రమున మోసపోయి నక్క యని యెఱుగక దీనిని రాజుగా గుర్తించినవి. కావున మన మందరము సంధ్యాకాలమున సమీపమునకేఁగి ఒక్క సారిగా గొప్పధ్వని చేయుదము. మన కూఁతలు విని జాతిస్వభావముచేత రాచనక్కయుఁ గూయును. కూఁతవలన నదియు జంబుకమేయని వ్యాఘ్రాది జంతువు లెఱుంగలవు. " అని పలికెను.

అనంతర మవి యన్నియు ననుకొన్నట్లు చేరి కూఁతలకు మొదలిడగానే నీలివర్ణ జంబుకమును కూయఁ జొచ్చెను. ఎవ్వరికైనను స్వభావము దాటరానిది. కుక్కను పసిడిగద్దె యెక్కించినను నది చెప్పు గొఱకకుండునే?

పిదప నాసవ్వడి విని వ్యాఘ్రము నీలివర్ణపు సృగాలమును జంపివై చెను. కావున నాత్మపక్షము విడిచి పరపక్షమును జేరదీయరాదు." అను మంత్రిమాటలు విని రాజహంస యిట్ల నియెను.

"ఈ సంగతి నిజమే యయినను ; ఈ శుకము దూరము నుండి వచ్చియున్న ది. కావున దీని జూచుట యుచితము. దానిం జేర్చు విషయము పిమ్మట నాలోచింపవచ్చును."

చక్రవాక మా మాటలు విని 'దూతను పంపుటయైనది. దుర్గము సర్వసంసిద్ధము కావున శుకమును బిలిచి మాటాడి పంపవచ్చు" ననెను. అనంతరము శుకకాకములు కొలువు కూటమునకుఁ గొనిరాఁబడెను.

ఉచితాసనమునఁ గూరుచుండి కొంచెము తలయెత్తి చిలుక "ఓ హిరణ్యగర్భుఁడా! మహారాజాధిరాజు శ్రీమచ్చిత్రవర్ణులవారు 'నీకు జీవితమునను, సంపదల యందును

గోరిక గలదేని, త్వరితముగవచ్చి నాచరణములకు నమస్క_రింపుము. లేదేని వెంటనే మఱొక చోటికి లేచిపొమ్ము.' అని యాజ్ఞాపించుచుండి " రని పలికెను. ఆ పలుకులకు హిరణ్యగర్భునకుఁ గోపమువచ్చి 'ఈ దుష్ట శుకమును మెడఁబట్టి గెంటివేయువారెవరు నిచటలేరా!' యనెను. అపుడు కాకియైన మేఘవర్ణుఁడులేచి 'ప్రభూ! ఆజ్ఞయైనచో నీ చిలుకను దునిమివైచెద'ననెను. సర్వజ్ఞుండపుడు రాజును, గాకమును వారించి ప్రభువుతో నిటు లనియెను.

"పెద్దలు లేనిసభ సభ యనిపించుకొనదు. ధర్మమును బలుకువారే పెద్ద లనఁబడుదురు. ధర్మము సత్యమును వీడియుండదు. 'మిషతోఁగూడిన యది సత్యము కానేర' దని పెద్దలు వచింతురు. ఇచట ధర్మ మేమన; రాజు దూతముఖముననే సందేశ ప్రతిసందేశములు నడుపును. కావున దూత యెట్టి వాఁడైనను వధ్యుఁడుగాడు. కత్తులుచూపి బెదరించుచున్నను దూత యధార్థము వచింపక తప్పదు. దూత వాక్యముల వలన దన హీనత్వమునుగాని, పరులయున్నతిని గాని భావింపరాదు. " చక్రవాకమాడిన యీ హితమును విన్నపిదప హంసకాకములు శాంతి నొందినవి. చిలుక లేచి కదలెను. చక్రవాకము చిలుకను బిలిచి యాదరించి బంగారునగలు మున్నగు కానుక లిచ్చి పంపెను.

ఇట్లు రాయబారము నడపి చిలుక వింధ్యపర్వతము మీఁదకిఁ బోయి తన రాజునకు వందన మాచరించెను. "విశేష మేమి?" యని రాజు ప్రశ్నింప "సంగ్రహముగఁ చెప్పుచున్నాను వినుము. వెంటనే యుద్ధ ప్రయత్నము చేయవలయును. ఆ కర్పూర చేశము స్వర్గములోని యొక భాగమని తోఁచినది, దాని రాజపరకశచీపతియే. ఇంతకు మించి వర్ణించుట కష్టము" అని విన్నవిం చెను.

అనంతరము రాజు, పెద్ద లందఱను రావించి వారితో మంత్రాలోచనమునకుఁ గూరుచుండి యిటులనెను. "ఇపుడు సంభవించిన యుద్ధము విషయమునఁ గర్తవ్యమే మా యాలోచించి తెలుపుడు. యుద్ధముమాత్రము తప్పదు. ఏలయన, బ్రాహ్మణులు సంతుష్టిలేకున్న లజ్జాహీనయగు కులస్త్రీ వలె చెడిపోవుదురు. మహీపాలురు సంతుష్టినొంది యున్నచో లజ్జావతులగు గణికలవలెఁ జెడిపోవుదురు."

ఆపలుకులు విని దూరదర్శియను గ్రద్ద యిటు లనెను. "రాజా! వ్యసనముఁ జెంది యుద్ధమునే ముఖ్యముగాఁ గోరుకొనరాదు. యుద్ధమునకుఁ బ్రయోజనములు మూఁడు. భూమి, మిత్రుడు, ధనము నను నవి. ఈమూఁడిటిలో నేయొకటియైనఁ దప్పక లభించునను నిశ్చయ మున్నయెడల యుద్ధ మొనరించుటలోఁ దప్పులేదు."

గ్రద్ద మాటలువిని రాజు. "ముందు మంత్రి నాబలము గుర్తింపవలయును. అపుడు దీనియుపయోగము నెఱుఁగ గలఁడు. అనంతరము దైవజ్ఞునిఁ బిలిచి ముహూర్త నిర్ణయమొనరింపఁ దగును." అని పలికెను. దానికి మంత్రి "ఒక వేళ యుద్ధమే

నిశ్చయింపఁబడినను వెంటనే దండెత్తుట యుచితము గాదు. శత్రుబలముఁబరిశీలింపక యుద్ధమునకుఁ జొరవసేయు వారు ఖడ్గధారల యాలింగనములు దప్పక పొందగలరు” అనెను.

అపుడు రాజు ‘మంత్రీ! యేమైనఁ నిఁక నాకుత్సాహభంగముఁ గల్పింపక శత్రువిజయమున కుపాయ మెఱింగింపుము.’ నావుడు ‘సరే! చెప్పుచున్నాను. అది యనుష్ఠింపబడినపుడు తప్పక ఫలితము చేకూఱును. ఆచరణము లేని మంత్రాలోచనము నిరుపయోగము. ఔషధము పేరుచెప్పిన మాత్రాన రోగము కుదరదుగదా! ప్రభువులయాజ్ఞ దాఁటరానిది. నద్యద్రివనదుర్గములలో నెచటెచట భయమునకవకాశమున్నదో యచటనచట సేనానులు వ్యూహములు పన్నుకొని యుండవలయును. సర్వసేనాని ముఖ్యులగు వీరులతో ముందుగా నేఁగ వలయును. మధ్యమునఁ బ్రభువు, భార్య, కోశము, బలహీనమగు సేనయు నుండవలయును. ఉభయపార్శ్వములందు గుఱ్ఱములు, వాని కిరువైపుల రథములు, వాని ప్రక్క నేఁనుగులు, వానిప్రక్క పదాతులు, వెనుక సేనాపతులు నుండి ఖిన్నుల నోదార్చు చుండవలయును.

రాజునకుఁ గోశము ముఖ్యము. కోశములేని రాజునకు రాజ్య మొక్కనాఁటికి నిలువదు. మానవుఁ డింకొక యెట్టి మానవునకు దాసుఁడు గాజాలడు. ధనమునకే దాసుఁడని నమ్ముము. గౌరవాగౌరవములకు గలిమిలేములే కారణము. సకల సేనలకు గజములు ముఖ్యములు. గజము తన యవయవములుచేతనే యష్టాయుధమనబడును. అశ్వములు సేనకు ప్రాకారము వంటివి. కావున నధికమగు గుఱ్ఱపు దళముగల వానికి విజయము తప్పదు. అశ్వము లధిరోహించి యుద్ధము చేయువారిని దేవతలై న జయింపలేరు. దూరమందలి శత్రువులును వారికిఁ జేతిలోనివారే. సైనికులకు బహుమానము లొసంగనలయును. అట్లుచేసిన, వారు ద్విగుణ మగు నుత్సాహముతో యుద్ధముచేయుదురు.

శతువ్రులలో భేదము పుట్టించుటకు జ్ఞాతిని మించిన యుపాయము లేదు. కావున నెట్లైన శత్రువునకు దాయాదు నొకని లేవదీయవలయును. యువరాజునుగాని, ముఖ్యమంత్రిని గాని లోబఱచుకొనవలయును. దానివలన వారిలో నంతర్ద్వేషము రగులుకొనును.

అహితులు తమలోఁ దాము విరోధించుకొనుటవలన మిక్కిలి మేలుకలుగును. ఈయర్థ ము వివరించు కథ యొక్క టి గలదు. నీకు దానిం చెప్పుదును. వినుము.

చోరబ్రహ్మరాక్షసులు కలహించుకొని యింటియజమానునకు మేలు చేసిన కథ

ఒకానొక యగ్రహారంబునఁ గర్మవిదుఁడైన నొక బాహ్మణోత్తముఁ డుండెను. ఆతడు హోమ క్రియాదుల నిమి త్తము రెండు ప్రశస్తమైన గోవులను గొని వానిం జక్కగా మేపుచుండెను. ఆగోవుల నెట్లైన నపహరింపవలయునని యొక దొంగ తగిన సమయమునకై నిరీక్షించుచుండెను.

ఒకనాఁ డాకసమున మబ్బులు కమ్మి సన్నని చినుకు రాలుచుం డెను. అపుడర్ధరాత్రము గూడ నై యుండుటవలనఁ జీఁకటి మరింత దట్టముగా నుండెను. మనుష్య సంచార మెచటను లేదు. గోవులను దొంగిలించికొని పోవుట కిదే మంచి యదనని యూహించి దొంగ బ్రాహ్మణు నింటికి మెల మెల్లన నరుగుచుం డెను.

ఆ చీఁకటిలో నట్లు కొంతదూరము పోయిన యనంతర మెదురుగా వచ్చుచున్న యెవ్వడో యొకవ్యక్తి యా దొంగకుఁ దగులుకొనెను. చోరుఁడు కొంచెము చెదరి "ఎవ్వడవు నీ" వని ప్రశ్నించెను.

"నే ను బ్రహ్మరాక్షసుఁడను. నన్నుఁ దాకఁ గలిగినంతటి ఘనుఁడవై న నీవెవ్వఁడ?" వని యాతడు తిరిగి ప్రశ్నించెను.

"నేను దొంగను లెమ్ము" అని యా చోరుడు పలుకఁగా "నింత ప్రొద్దుపోయి యెచటి కేఁగుచుంటి " వని యా బ్రహ్మరాక్షసుండడిగెను.

"ఈ గ్రామమున నొక బ్రాహ్మణోత్తముఁడు గలడు. ఆతనికడ ప్రశ స్తములైన రెండు ధేనువులు గలవు. వాని నపహరించుటకై పోవుచుంటి" నని దొంగ బదులు చెప్పెను.

"నేనుగూడ నాబ్రాహ్మణునిఁ బట్టుటకై పోవుచుంటిని. మన మిర్వురముఁ గలిసియే పోవుదము రమ్ము" అని యా బమ్మరక్కసుఁడు పలికెను.

ఈ విధమున వా రిరువుకు నడచి నడచి యాభూసురుని యింటి దరి కేఁగిరి. గృహ ద్వారముకడ నిలిచి బ్రహ్మరాక్షసుఁడు చోరునితో "నేను ముందుగాఁ బోయి యా బ్రాహ్మణునిఁ బట్టి లేపుదును. ఆతడు నాకింత భుక్తియిడి పంపును. అనంతరము నీవు గోవులను దోలుకొని పొమ్ము" అని పలికెను. దాని కంగీరింపక యాచోరుఁ డిట్లనెను.

"నీవు ముందుగానే యాబాపని మేలుకొలిపిన నిఁక నేను గోవులఁ దోలుకొనిపోవుట యెట్లు? ఆయింటి వారుఁ బొరుగువారు మేలుకొన్న గోవులను విడిచి నేను పలాయన మొనరింప వలసివచ్చును. కావున నేను ముందుగా ధేనువులఁ దోలుకాని , శీఘ్రముగా నూరు విడిచి పోవుదును. అనంతర మా బ్రాహ్మణునిఁ బట్టుకొని నీ కోరిక యీడేర్చుకొనుము"

ఈవిధముగా మాటమీద మాటవచ్చి వారిరువురకుఁ గలహము ముదిరెను. వారిరొద కింటిలో నిదురించు చున్న బ్రహ్మణునకు మెలకువ గలిగెను. ఆతడు వెంటనే లేచి ద్వారముకడకు వచ్చి తలుపుతీయకుండఁగనే “యర్థరాత్ర సమయమున వచ్చి మావాకిటఁ గలహా మాడుచున్నా వారెవ్వ”రని ప్రశ్నించెను.

“ఈతఁడు బ్రహ్మరాక్షసుడు. నిన్నుఁ బట్టి బాధించుటకై యదను జూచుకొని వచ్చినాడు” అని చోరుఁడు ప్రత్యుత్తర మిచ్చెను.

“ఈతడు దొంగ నీగోద్వయమును దొంగిలించి తోలు కొని పోవుట కీయర్థరాత్రమున వచ్చి యున్నాఁడు” అని బ్రహ్మరాక్షసుడు బదులు పలికెను.

బ్రాహ్మణుడు వారి సమాధానముల వలన సంగతి యంతయు గ్రహించెను. వెంటనే యెఁలుగెత్తి పిశాచోచ్చాటనమంత్రములు పఠించెను. వాని ప్రభావమున నచట నిలువ లేక యా బ్రహ్మరాక్షసుఁడు పాఱిపోయెను. ఎవ్వరైన మేలు కొన్నఁ దన్నుఁ బట్టుకొందురని యాచోరుఁడు సందులం బడి పలాయన మొనరించెను.

ఇట్లు మంత్రి చెప్పినకథ యాలించి రాజిటు లనియెను. “వేయిమాటలేల! ఆత్మోదయమూ, పరుల క్షీణత నను రెండు తెఱంగులు కలదియే నీతి. ఆరెండింటి నెఱుగజాలువాఁ డింద్ర పదవి నొందఁ గలుగు” నని వచించెను. పిదప దైవజ్ఞుఁ డిడిన ముహర్తమున దండయాత్రకు బయలు దేఱెను.

అచట హిరణ్యాగర్భుడంపిన దూత తిరిగి వచ్చి ప్రభూ రాజగు చిత్రవర్ణుఁడు దండెత్తి వచ్చి మలయపర్వతపుఁ జరియలలో విడిసియున్నాడు. ప్రతిక్షణ మేమరు పాటు లేక దుర్గ శోధనముఁ జేయవలయును. ఏలయన మహామంత్రి యగు

గృధ్రము విశ్వాసపాత్రుఁడగు నొకనితో ముచ్చటించుచుండ వింటిని. మన దుర్గమున నీవఱకే శత్రువులచే నియుక్తుఁడగువాఁ డొకఁడున్నట్లు నాకవగతమైనది’ నావుడు నామాట యందుకొని చక్రవాకము ‘ప్రభూ! అట్లు నియో గింపబడినది కాకమేకాని వేఱొండు కా’ దనెను.

అపుడు రాజు “అట్లెన్నడును గాదు. అదియే కదా చిలుకను జంపుటకు సిద్ధపడినది! మఱియుఁ జిలుక యిచటికి వచ్చిన నాఁటినుండి యది యుద్ధమునకు కాలుదువ్వుచుండెను.” నావుడు మంత్రి “అయినను నూతనాగంతుకుఁడు నమ్మదగఁడు” ఈయార్థము నెఱిఁగించు కథ యొకటిగలదు? నీకది యెఱింగింతును వినుము.

నూతనాగంతుకుని నమ్మిచెడిన మందవిసర్పిణి కథ

మందవిసర్పిణి యను పేరుగల యొక చీరపేను రాజశయ్యం జేరి యెచటికిఁ బోక చిరకాలము నివసించి యుండెను. రాజు గాఢ నిద్రావశుఁడై యున్న సమయమున నాతని రక్తము గ్రోలుచుం డెను.

ఒకనాడు డిండికమను పేరుగల నల్లి యారాజ శయ్యఁ జేరి చీరపేనితో నిట్లనెను. "నీ పాదములకు మ్రొక్కెదను. నేటినుండి నీవాడను. నీచుట్టముగా భావించి నన్ను గాపాడుము"

ఆమాటలు విని మందవిసర్పిణి "యీవిధముగా స్తోత్రము చేయనేల? నాపుణ్యమువలన నిచటికి వచ్చితివి. నా వంశము పావనమయినది. నే నీరాజశ్రేష్ఠుని పానుపున సుఖినై యుంటిని. నన్నేమి కోరఁదలఁచి యిచటికి వచ్చితివి? నాకిచట నేమి యైశ్వర్యము గలదని యెంచితివి?" యని పలుకఁగా నా డిండిక మిటు లనియెను.

"యాచకుడు తన యవసరము కొలఁది యాచించును గాని యెదుటివాని కలిమిలేములు పాటింపజాలడు. ధనాపేక్షచే మిక్కిలి యఱచునుగాని 'యీతఁడు లోభి, యీతఁడు దాత' యని యెరుంగలేఁడు. విత్తముంగోరి సభలలో నుపన్యసింపఁ బోవునుగాని, తన విద్య చాలదని గుర్తింపఁ జాలఁడు. డాబుగానున్న వాని నెల్లఁ జేరి నేర్పుకొలఁది మాటలాడి విత్త మడుగును. ఏ దాతయైన నిచ్చిన సంతసించును. లోభియై యేమియు నీయకున్నఁ జిన్న వోవును. మాటల సందర్భమునఁ జెప్పితిని గాని నిన్నే యర్థము యాచింపఁ దలఁచిరాలేదు.

నాకు నీవు చేయవలయు సాయ మాహార మొసఁగుట మాత్రమే. పూర్వమునుండియు నేను చెనఁటులగు మానవుల రక్తముఁ ద్రావుచుంటిని. యెన్నడు మహీపతుల రక్తము గ్రోలి యుండలేదు. అందువలన నాకు సంపూర్ణ సంతృప్తి గలుగలేదు. ఆకోరిక నెఱవేర్చుకొనుటకై నేఁడు నీ దర్శనమునకు వచ్చితిని. కావున నాయభిమత మంగీకరించి నన్ను సంతోష పెట్టుము.

నాకిట్టి యభిలాష పుట్టుటకుఁ గారణమేమన; రాజులు మహా భోగులు అమూల్యములై రసవంతములైన బహువిధ భోజ్య పదార్థములు వారు భక్షింతురు. మిక్కిలి పరిమిళము గల రకరకములయిన సుగంధ ద్రవ్యముల నుపయోగింతురు. అనుదినము విలాసవతులయిన కోమలాంగులతో సకల సుఖము అనుభవింతురు. అట్టివారి రుధిర పానమునకై యెన్నియో తావులఁ దిరిగి యుంటిని. ఇంతవఱకు నాయభిలాషము సిద్ధింప లేదు."

డిండికము మాటలు విని జాలిగొని దాని యభిలాష కంగీకరించి మందవిసర్పిణి యిట్లనెను. "కడు జాగరూకతతో వర్తింపుము. వేగిరపాటుఁ జెంది కార్యహానిఁ దెచ్చుకొనకుము. రాజు గాఢ నిద్రాపరవశుఁడై యున్న తఱి నాతని రక్తముఁ గ్రోలి తటాలునఁ దప్పుకొనవలయును.

ఉపాయ మెఱుఁగక కక్కుఱితిపడి సంజజామున నాతని గఱచిన యెడల మనకుఁ బ్రమాదము కలుగవచ్చును.

ఇట్లు బోధించిన యనంతరము మందవిసర్పిణియు, డిండికము నాశయ్యాయందుఁ బ్రీతితో నుండెను. కొంతసేపయిన తరువాతఁ జీరపేను కునుకు దీసెను. అపు డభిలాష నిలుపుకొన లేక యానల్లి సందెజామునసే భూమీశునిఁ గఱచెను. అంతట నిద్రాశూన్యుడైయున్న యా రాజదరిపడి పాదము లొత్తుచున్న సేవకులతో "దీపము దెచ్చి చూడుడు. నాదేహమున దేలుకుట్టిన యట్లైనది" అని పలికెను.

సేవకులు దీపము చెచ్చునంతలో డిండికము కడు వేగముగా మంచము పట్టె రంధ్రములోనికిఁ బోయి దాగుకొనెను. సేవకులు దానిం గనుఁగొనక పాన్పు నడుమ నేమియు నెఱుఁగక కునుకుచున్న మందవిసర్పిణిం జంపివై చిరి." కావున నూతనాగంతుకుని నమ్మి చేరనీయరాదు.

రాజు "ఆగంతుకులు నొకపుడు మహోపకారము జేయలగలరు. పరుఁడైన నొకపుడు మేలుకూర్చు బంధువగును. బంధువు నొకప్పుడు పరుఁడై కీడొనరించును. స్వశరీరమున జనించినదైనను వ్యాధి యపాయకరము. అడవిలోఁ బుట్టినదైన నౌషధి మేలొనరించును గదా! వీరవరుఁడను నొక యాగంతుకుఁడు శూద్రక మహారాజు నచిరకాలముననే తనకమారుని ప్రాణము లొసగి కాపాడబోయెను. నీ కాకథ వినిచెద వినుము.

వీరవరుఁడు తన కుమారుని ప్రాణము లొసఁగి శూద్రక మహారాజును గాపాడఁబోయిన కథ

నేను పూర్వము శూద్రకమహారాజు క్రీడాసరస్సునందలి కర్పూరకేళియను రాజహంస పుత్రికయగు కర్పూరమంజరిపై వలపుగలిగి యుంటిని. అపు డచటికి వీరవరుఁడను నొక మహారాజపుత్త్రుఁ డేదేశమునుండియో వచ్చి రాజద్వారమునొద్దకు వెళ్లి ద్వారపాలకునితోఁ దానొక రాజపుత్త్రుఁడనియ, రాజ దర్శనమునకై వచ్చెననియుఁ జెప్పెను. ద్వారపాలకుఁ డాతని రాజదర్శనమునకు గొంపోయెను. వీరవరుఁడు ప్రభూ! ఈ సేవకునిసేవ తమకంగీకార మగుచో దినమున కైదువందల సువర్ణముల జీత మేర్పఱుపుఁ డని కోరెను. దానికి రాజు 'నీయొద్ద గల సరకేమి' యని ప్రశ్నింప నాతడు 'రెండు బాహువులు, నొక ఖడ్గముము' నని బదులు పలికెను. 'అంతమాత్రము చాల' దని రా జనగా వీరవరుఁడు కదలిపోయెను.

అపుడు మంత్రి 'నాలుగు రోజు లావేతనమిచ్చి యాతని సామర్థ్య మెఱుంగవచ్చు' నని పలుక రాజు వీరవరుని఼ బిలిపించి తాంబూలముతోఁ బంచశత సువర్ణ ము లొసగెను. ఆ సొమ్ము దీసికొని, యాతడు దేవ బ్రాహ్మణుల నిమిత్త మందు సగము ఖర్చుపెట్టెను. మిగిలినదానిలో సగము దీనుల కొసఁగెను. మిగిలినది భోజ్యవస్తువులకు, విలాసవస్తువులకు నుపయోగించెను. ఇట్లు నిత్యకృత్యా మొనరించుచు గత్తి చేతబూని రేయుంబవళ్లు రాజద్వారమును గనిపెట్టుకొని సేవించుచుండెను. రాజు సెలవైనపుడు మాత్రమే యింటికేఁగుచుండెను.

పిమ్మట నొకనాటి రాత్రి రాజున కొక రోదనధ్వని వినఁబడెను. ద్వారమందున్న వీరవరుని఼ బిలిచి "యా రోదన మేమో తెలిసికొని ర" మ్మనెను. వీరవరుఁడు సెలవు గైకొని వెడలిన పిమ్మట 'గాఢాంధకారమున నీ రాకొమరుని఼ బంపితిని. నేను నీతని వెంట నేఁగి విషయము దెలిసికొందు' నని తలఁచి శూద్రకమహారాజును బయలు దేఱెను.

వీరవరుఁడట్లు వెడలి రూపయౌవన సంపన్నురాలును, సర్వాలంకారములును ధరించినదియు నగు నొక సుందరింగాంచి 'నీవెవ్వతెవు? యేల యేడ్చుచుంటి' వని యడిగెను. "నేనీ శూద్రకుని రాజ్యలక్ష్మిని. చిరకాలమునుండి యాతని బాహువుల నీడను సుఖముగా విశ్రమించియుంటిని. ఇపుడు వేరొక్క చోటికిఁ బోవలసివచ్చినది" అని యామె బదులు పలుకగా వీరవరుడు "అపాయమున్న చోట నుపాయముగూడ నుండును. కావున; నీ విచటనే యుండుటకుఁ దగు నుపాయ మేమైనఁ దెలుపు" మని మరల నడిగెను. "ముప్పదిరెండు శుభలక్షణ ములతోఁ గూడిన నీసుతుఁడగు శక్తిధరుని నీవు భగవతియగు సర్వమంగళకు బలియొసంగినచో నే నిచ్చోట గదలక చిరకాలము సుఖముగా నివసింపఁగల' నని పలికి యామె యంతర్ధాన మయ్యెను.

వీరవరుఁడంతట నింటికేఁగి నిద్రించుచున్న సతిని సుతుని మేలుకొలి పెను. వారు మేలుకొని లేచి కూరుచుండిరి. వీరవరుఁడు రాజ్యలక్ష్మి తెలిపిన సంగతి యంతయు వారికిఁ బూస గ్రుచ్చినటులు వివరించెను. అదివిని యానందముతో శక్తిధరుఁడు 'స్వామిని, రాజ్యమును గాపాడు నిమిత్త ముపయోగపడుట వలన నేను మిక్కి లి ధన్యుడను. ఇందుల కిఁక నాలసింపనేల? ప్రాజ్ఞుడు సకలసంపదలును, దుదకు జీవితమును, పరార్థమై విడువఁగలడు. వినాశ మెపుడో యొక్కప్పుడు తప్పనపు డిట్టి వినియోగము మేలుకదా!" యన విని యాతని తల్లి యిటులు పలికెను, "ప్రభువునొద్ద గొప్పజీతము తీసికొనుచు సమయము వచ్చినపు డిట్టి యుపకారముఁ జేయకున్న నాతని ఋణమింకేవిధమున దీర్పగలము?"

అనంతరమందఱు గలిసి సర్వమంగళాలయమునకు వెళ్ళిరి. అచట దేవిని బూజించి వీరవరుడు "తల్లీ! ప్రసన్నురాలవుగమ్ము. నీ వీ కానుకను స్వీకరించి శూద్రకమహారాజునకు శాశ్వతజయము గూర్పుము" అని ప్రార్థించి సుతుని తల నఱికివైచెను. పిమ్మట నాతఁ

డిటులు చింతించెను. "వేతనము దీసికొన్నందుకు రాజఋణము దీఱినది. ఇక నపుత్రకుడనై జీవించుట దుష్కరము" అని తలపోసి తన శిరమునుగూడ ఖండించుకొనెను. పతి సుత శోకమునకు దాళఁజాలక సతియు నటులే యొనరించెను.

చాటున నుండి యదియంతయుఁ జూచుచున్న రాజాశ్చర్యముతో నిటు లాలోచించెను. "నాబోటి క్షుద్రులనేకులు జనించు చుండిరి; గిట్టుచుండిరి. ఈతనికి సాటి రాఁదగువారు భూతభవిష్యద్వర్తమానములలో నెవ్వరు నుండరు.ఈతఁడు చనిపోయినపుడు నాకు రాజ్యముండియు నిరుపయోగము." అని తలంచి శూద్రకుఁడు తన శిరము ఛేదించుకొనుటకై కత్తి యెత్తెను. అపుడు భగవతియగు సర్వమంగళ శూద్రకుని చేయిపట్టుకొని నిలిపి "కుమారా! నీ సాహసమునకు మెచ్చి నీయెడఁ బ్రసన్నురాలనయితిని. మరణానంతరమైన నీ రాజ్యమున కేహానియుఁ గలుగదు"

నావుడు రాజు సాష్టాంగ నమస్కారము చేసి "తల్లీ! నాకిఁక రాజ్య మేల? జీవితము మాత్రమేల? నీకు నాయందుఁ గరుణగలదేని నా యాయుశ్శేషమును గ్రహించి వీరవరుఁడు సతీసుత సమేతముగా జీవించునటు లనుగ్రహింపుము, కానిచో నాగతికి నన్ను వదలుము." అని వేడికొనెను.

రాజు మాటలు విని యామె "కుమారా! నీ సేవక వాత్సల్యమునకు నీయెడఁ గడు సంతుష్టురాల నైతిని. పొమ్ము విజయము నొందుము. ఈ వీరవరుఁడును నాలుబిడ్డలతో జీవించును." అని పలికి యదృశ్యురాలయ్యెను.

అనంతరము వీరవరుఁడు కుటుంబముతోఁ గూడి యింటికిఁ బోయెను. రాజును వారలకు తెలియకుండ శీఘ్రముగా నంతిపురముఁ జేరెను.

మఱునాఁ డుదయమున రాజు ద్వారమందున్న వీరవరుఁ జూచెను. "ప్రభూ! ఆ యేడ్చుచున్న యామె నన్ను జూచి యదృశ్యురాలయ్యెను. మఱొక విశేష మేమియులే" దని యాతండు ప్రభువునకు విన్నవించెను. ఆపలుకులు విని 'యీతం డెంతటి మహాసత్త్వసంపన్నుడు? ఈతని నేమని కొనియాడుదును?

దైన్యము నెన్నఁడు తనయందుఁ దోప నీయక ఆత్మస్తుతి చేసికొనక, ప్రియవాక్యముల బలుకుచు, దానగుణము గలఁవాడై, యపాత్రుని కొసఁగక నిష్ఠురోక్తు లాడక యుండు వాఁడేకదా శూరుఁడనఁదగు. మహాపురుష లక్ష ణములన్నియు నీతని యందున్నవి" అని రాజు తలపోసి పిమ్మట శిష్టసభను సమావేశ పఱచి జరిగిన యావృత్తాంతముఁ దెలిపి, పొగడి వీరవరునకుఁ గానుకగాఁ గర్ణాట రాజ్యమొసంగెను. కావున నాగంతుకుఁడైన మాత్రాన జాతిమాత్రదుష్టుడైనంత మాత్రమున నట్లనరాదు. వారిలోనుత్తమ మధ్యమాధము లుండవచ్చును." అని హిరణ్యగర్భుఁడు వినిపింపఁగా మంత్రి చక్రవాక మిటులనియె.

ఎవ్వఁ డకార్యము జరుగుచుండ నది కర్తవ్యముగా నంగీకరించునో వాఁడు దుర్మంత్రి యఁనబడును. అకార్యమున కంగీకరించి ప్రభువునకుఁ నాశకారకు డగుటకన్న ప్రభువునకు దాత్కాలిక మనోదుఃఖము గలిగించినను దప్పు కానేరదు. వైద్యుఁడు, గురువు, మంత్రి యను మూవురు నేరాజుకడ ముఖప్రీతి కలిగించు మాట లాడుదురో యాఱేఁడు శరీరము నుండియు, ధర్మమునుండియు, కోశమునుండియు భ్రష్టుఁడై నశించుచున్నాడు. పుణ్యవశమున నెవ్వరికో లభించిన యర్థము నాకును దొరకు ననుకొనఁదగదు. నిధులు దొరకునను నాసతో భిక్షుకుని జంపి యొక మంగలి హానిం జెందెను. నీకాకథ వివరింతు నవధరింపుము.

క్షపణకులనుగొట్టి నిధులు పొందిన క్షత్రియుని గాథ

అయోధ్యానగరమున జూడామణి యను క్షత్రియుఁడొక్కఁ డుండెను. ఆతడు ధనమునుగోరి కడు శ్రమల కోర్చి చాలకాలము శివు నారాధించెను. కొంతకాలమున కాతని పాపములు నశించుటవలన నీశ్వరుని పనుపునఁ గుబేరుఁ డాతని కలలోఁ గానబడి "నీ వుదయము క్షౌరము గావించుకొని దుడ్డుకఱ్ఱ యొకటి జేతఁబట్టుకొని యింటియందు సడిగాకుండ నుండుము. అపుడే విధిని వచ్చు నొక భిక్షుకునిఁ జూడఁగలఁవు. అతనిపట్ల నెంతమాత్రము జాలిదలఁపక యీదండముచే నాతని గొట్టుము. అనంతర మా భిక్షుకుఁడు బంగరు గిన్నెగా మాఱి పోవును. దానితో నీవు యావజ్జీవము సుఖింపవచ్చు" నని పలికెను. చూడామణియు నాప్రకార మొనరించి సంపదల నొందెను.

భిక్షుకులనుగొట్టి యురి తీయబడిన మంగలి కథ

చూడామణికి క్షౌర మొనరించుటకు వచ్చిన మంగలి యిది యంతయుఁ జూచి 'నిధులు దొరుకవలె నన్న నిది యుపాయము గాబోలును; నేను నటులేచేసి సంపదల నార్జింతును' అని తలచి, దండము చేతఁబట్టి ప్రతిదినము భిక్షుకుని రాకకై యెదురుచూచుచుండెను. ఒకనాఁడు దురదృష్టవంతుఁ డగు నొక భిక్షుకుఁడు రాఁగా నాతనిఁ జావమోదెను. ఆ యపరాధమునకు రాజపురుషు లామంగలిని గొనిపోయి యురి తీసిరి."

అట్లు మంత్రిచెప్పిన కథ విని రాజు, "పూర్వపుకథలు చెప్పుకొని యొకఁడు విశ్వాసఘాతుకుఁడో, యకారణ బంధువో నిర్ణయించుట తేలికకాదు. సరే, అదియటుండనిమ్ము. శత్రు రాజు చిత్రకర్ణుఁడు మలయపర్వతమున నున్నచో నిపుడేమి

చేయఁదగు” నని ప్రశ్నింప మంత్రి ‘ప్రభూ! మనము పంపిన దూతవలన చిత్రవర్ణుఁ డాతని మహామంత్రియగు గృధ్రము సలహాలను గౌరవించుట లేదని వింటిని. కావున నాతడు మూఢుఁడని సులభముగా గెలువవచ్చునని నాతని తలఁపు.’

‘లుబ్ధుఁడు, క్రూరుఁడు, అలసుఁడు, నసత్యవంతుఁడు, పొరపడువాఁడు, భీరుఁడు, చంచలుఁడు, మూఢుఁడు, యోధుల నవమానించువాఁడు నగు శత్రువు సులభముగా జయింపఁబడు’నని పెద్దలవచనము కావున నాతఁడు మనకోట నరికట్టకముందే నద్యద్రివనమార్గముల యందు వానిబలములను హతమార్చుటకు సారస్వతాది సేనాపతులను నియోగింపవలయును. ‘దూరప్రయాణముచే నలసినవానిని, నద్యద్రివనములఁ జిక్కుకొన్నవానిని, ఘోరాగ్నికిఁ బాలుపడినవానిని, నాకలిదప్పులకు లోనైనవానిని, వ్యాధులచేతను దుర్భిక్షముల చేతను బీడింపఁబడినవానిని, దోపిడిగాంధ్ర బాధకు లోనైన వానిని మీదఁబడి నాశనము చేయవలయు’ నని యార్యులందురు. ‘శత్రువులు మీఁదఁ బడుదురను భయమున రాత్రి యంతయు మేలుకొని; పగలు సైనికులందఱు నిద్రింప దానును నిద్రించు శత్రువును జుట్టుముట్టి చంపివేయవలెను.’ అనియు నార్యుల వచనము. గావున నావిధముగా బ్రమాదములకుఁ బాలయిన శత్రుసేనఁజొచ్చి రేలుంబవళ్ళు మన సేనానులు చంపఁగలరు.” అని వచించెను.

ఆప్రకారము కావింపగాఁ జిత్రవర్ణుని సైనికులు, సేనానులు పెక్కుమంది మరణించిరి. చిత్రవర్ణుఁడపుడు మిక్కిలి కలఁతనొంది తన మంత్రియగు దూరదర్శి కిట్లనియె.

“పూజ్యుడా! యిట్టి సమయమున నన్నుపేక్షింపఁదగునా? నాయం దపరాధమేమైనఁ గలదా? రాజ్యము లభించినదని గర్వముతో నడువఁదగదు. ముసలితనము సౌందర్యమును హరించినట్లు వినయము సంపదలను హరించును. శక్తివంతుడు సంపదల నొందును. పథ్యముఁ గోరువాఁడే నీరోగత నొందును. అరోగి సుఖము నొందును. కృషిగలవాఁడు విద్యలనొందును. కాని వినయవంతుడు ధర్మము, నర్థము, యశముఁ గూడ నొందగలడు” నా విని మంత్రి గృధ్ర మిటులనియను.

“జల సమీపమున నుండు వృక్షము పల్లవ కుసుమ ఫలములతో నొప్పారునట్లు రాజు తా నవిద్వాంసుఁడైనను విద్యావృద్ధులను సేవించి గొప్పసంపదల నొందఁగలడు. మఱియు మద్యపానము, స్త్రీ వ్యామోహము, వేఁట, జూదము, అర్థదూషణము, మాట బిరుసుఁదనము, కఠిన

దండనము నను నవి రాజున కుండరాని సప్తవ్యసనములు.

కేవలము సాహసమువలన గాని, కేవల ముపాయములవలనఁగాని యున్నత సంపదలు గలుగవు. సమయానుగుణముగా నీతి శౌర్యములు చూపు వారికి సంపదలు దమంత దామే వచ్చి చేరును. నీవు సేనల యందలి యుత్సాహముఁ జూచి యతిసాహస

మొనరించి, నే నుపదేశించిన మంత్రాలోచన మందనాదరమును, వాక్పారుష్యమును జూపితివి. ఆ యవినీతికి ఫల మిపు డనుభవించుచుంటివి.

దుర్మంత్రము గలవానిని నీతిదోషములు తాఁకును. అపథ్యము భుజించువానిని రోగము లాశ్రయించును. శ్రీగర్వితుని మృత్యువు సమీపింపకమానదు. స్త్రీవాంఛ లెవ్వనికిఁ బరితాపము గూర్పకుండును? ముదమును విషాదము, శరత్కాలమును హిమాగమము, సూర్యుడు చీకటిని, కృతఘ్నత సుకృతమును, మైత్రి దుఃఖమును, నీతి యాపదలను హరించిన విధమున, సమృద్ధమైన సంపదలను గూడ దుర్నీతి నాశనము జేయును." అని పలికి మనమున నిట్లు తలపోసెను. "రాజిపుడు ప్రజ్ఞాహీనుఁడయ్యెను. కాకున్నచో నీతిశాస్త్రమను వెన్నెలను వాక్కు లనెడి కాగడాల చేతఁ జెడగొట్టునా? ఎవ్వానికి సహజముగఁ బ్రజ్ఞ యుండదో వానికి శాస్త్రము మాత్రమేమి మేలు జేయగలదు? లోచనములు లేని వాని కద్ద ముపయోగింపదు గదా!" అని యాలోచించి యూరకుండెను.

పిమ్మట రాజు దోసిలొగ్గి "పూజ్యుడా! నాతప్పు సైరింపుము. నేను మిగిలిన సేనతో మరల వింధ్యాచలముఁ జేరు నుపాయముఁ దెలుపుము. " నావుడు మంత్రి "యిక గోపముడిగి, యుపాయము వెదుకవలెను. ఏలయన 'దేవతలందును, గురునియందును, గోవులయందును, బ్రాహ్మణుల యందును, రాజులయందును, బాలవృద్ధాతరులయందును కోపము సూపరా' దని పెద్దల వచనము" అని మనమున దర్కించి చిఱునగవుతో రాజున కిటులనియె.

"ప్రభూ! భీతిఁజెందకుము. ఊరడిలుము. సన్నిపాత రోగముఁ గుదుర్చుటలో వైద్యుల ప్రజ్ఞ వెల్లడియగునట్లు చెడిన వ్యవహారములు చక్కఁబఱచు పట్టుననే మంత్రుల ప్రజ్ఞ వెల్లడి కావలయును. అన్నియుఁ జక్కగా నున్నపుడందఱును బండితులే యగుదురు. అజ్ఞులు సామాన్యపు యత్నములు ప్రారంభించి యవి నెరవేర్పలేక సతమతమగుచుందురు. ప్రజ్ఞావంతులు మహాయత్నముల నే సంకోచములేక నెరవేర్చుకొనఁగలరు. కావున నీప్రతాపము వలననే కోటను భేదించి కీర్తి పరాక్రమ సహితముగా శ్రీఘ్రకాలముననే వింధ్య పర్వతము నకుఁ గొనిపోవగలవు."

ఆ పలుకులు విని రాజు 'ప్రస్తుత మత్యల్పబలముతో నది యెట్లు శక్యమగు' నని యడిగెను. "దేవా! సర్వము సమకూఱును. జయమందిచ్ఛగలవాడు కేవలము సూత్రములు పన్నుకొనుచుఁ గూర్చుండరాదు. కావునఁ ద్వరితముగా దుర్గముఁ జుట్టుముట్టి యరికట్టవలయును." అని మంత్రి బదులు పలికెను.

గూఢచారిగాఁ బంపబడిన బకము హిరణ్యగర్భుని దగ్గఱకేఁగి 'ప్రభూ! అల్పమగుసేన గలిగియు రాజగు చిత్రవర్ణుఁడు మంత్రి గృధ్ర ముపదేశించుటచేఁ గోట నరికట్టు చున్నాఁడు" అని యెఱింగించెను. అపుడా రాయంచ 'సర్వజ్ఞా! యిపు డేమి చేయఁదగు' నని మంత్రి నడిగెను.

“మనసైనికులలో సారాసారపరిశీలనముఁ జేసి, యర్హతలను బట్టి సువర్ణవస్త్రాదికములగు కానుక లొసఁగి వారినుత్సాహపఱుపవలయును. ఒక్కకానియైన ననవసరముగాఁ బోవునపుడది పదివేలుగా భావించి కాపాడవలయును. కాలము వచ్చినపుడు కోట్లకొలఁది ద్రవ్యమైనను గవ్వలవలె వెచ్చించుటకు వెనుకాడరాదు. ఇటు లొనరించు రాజసింహుని లక్ష్మి యెన్నఁడును వరించియుండును? యాగమున, వివాహమున, వ్యసమున, రిపునాశనమందు, యశమును గలిగించుకార్యమున, మిత్రులను సంపాదించుటయందు, ప్రియురాండ్ర విషయమున, నిర్ధనులగు బంధువులయెడ నీయెనిమిది సందర్భములలోను నతివ్యయమని తలఁపక యెంతయైన వెచ్చింపవచ్చును. కొలఁదిఖర్చునకు వెనుదీసి సర్వనాశముఁ దెచ్చుకొనువాడు మూర్ఖుడు. బుద్ధిమంతుఁ డెవ్వఁడైనను పన్నిచ్చుటకు జంకి భాండము విడిచిపోవునా?” యను చక్రవాకము సలహావిని “యీవిపరీత సమయమున దుబారా ఖర్చు తగునా?” యని రాజహంస పలుక “ప్రభూ! సంకోచింపక దానమానములచే యోధుల నుత్సాహపఱుపుము. మన మెంతభద్రపఱచినను సమయము వచ్చినపుడు సంపద సంవ్యయమైపోవును. గౌరవాభిమానములచే దుష్టులగు యోధులవలీలగా శత్రువుల జయింపగలరు. శీల సంపన్నులు, నుత్సాహవంతులు, గృతనిశ్చయులు నగు శూరు లైదువందలమందియున్న నెంతశత్రుసేనఁనైన జెండాడఁగలరు. మఱియు సత్యము; శౌర్యము; దయ; త్యాగము నను నవి రాజున కుండవలసిన మహాగుణములు. ఈయవి లేకున్న వానికి నిందగలుగును.

ఇట్టి సమయములనే మంత్రులమాట చేకొనఁదగును. మేలుకీడులందెవ్వఁడు పాలుగొనునో యట్టిసచివనినమ్మి ధనప్రాణములయం దుపయోగించుకొనవలయును. ఎవనిమంత్రి ధూర్తుడును, స్త్రీయును, ననుభవశూన్యుఁడగు చిన్నవాఁడు నగునో యట్టి రాజవినీతివాయువు తాఁకున గార్యసముద్రమున మునిగి పోయి, తేలకుండును. హర్షక్రోధములయందు సమబుద్ధియు శాస్త్రార్థముల యందు విశ్వాసము, సేవకులయం దెపుడు ననుపేక్షయు గలుగు రాజునకు ధరిత్రి యెపుడును సంపద లొసఁగును. ‘హానివృద్ధులు రాజుతోడివే’ యని తలఁచు మంత్రుల నెన్నఁడు నవమానింపఁ జనదు” అని పలుకుచుండెను.

ఈసమయమున మేఘవర్ణుడు వచ్చి నమస్కరించి “ప్రభూ! యుద్ధముఁగోరి శత్రువు దుర్గద్వారము నరికట్టి యున్నవాఁడు. కావున దేవరయాజ్ఞ యిచ్చినచో దుర్గమువెలువడి నాపరాక్రముఁ జూపి ప్రభువుల బుణము దీర్చుకొందు” నని విన్నవించెను.

దానికి జక్కవ యిటులనియె. “బయటికి వెడలి యుద్ధము చేయఁదగినయెడల దుర్గము నాశ్రయించుట నిరుప యోగము. నీటియం దెంత బలిష్ఠ మైనను మొసలి బయటికి వచ్చిన నిర్వీర్యమయి లొంగిపోవును. మహాశూరమయిన సింహముగూడ నడవినుండి వెలువడి వెల్లడితావులలో నక్క వలెఁ జిక్కి పోవును. మరియుఁ బ్రభూ!

స్వయముగా నేఁగి యుద్ధము చూచెదరుగాక. రాజు సేనలను ముందుంచుకొని పరిశీలనజేయుచు యుద్ధ మొనరింపవలయును. స్వామి ప్రక్కనుండగా గుక్కయైనను సింహవిక్రమముఁ జూపునుగదా! ”

యుద్ధము

అనంతర మందఱు నేఁగి దుర్గద్వారమునొద్ద సంగరము చేసిరి. మఱుచటి దినమునఁ జిత్రవర్ణుడు గృధ్రముతో 'ఆర్యా! నీప్రతిజ్ఞ నెఱవేర్చు కొనవలసిన సమయము మిదియే, యనెను.

దానికి దీర్ఘదర్శి “రాజా! కాలమును సహింపనిదియు నత్యల్పమగునదియు; మూర్ఖుఁడు, వ్యసనవంతుఁడు, నాయకుఁడు గాగలదియు; గుప్తము కానిదియు; భీరులగు యోధులుగలదియు నగుట దుర్గవ్యసన మనబడును. అది యచట నెంతమాత్రమును గానరాదు. భేదోపాయమును, జిరకాలము ముట్టడించుటయు, నిద్రాసమయమునఁ బై బడుటయు, తీవ్ర పౌరుషముఁ జూపుటయు నను నాలుగును కోటను వశపఱచుకొను నుపాయములు. ఈవిషయమున యథాశక్తిగా యత్నముఁ జేయుచుంటి” నని పలికి చెవిలో నింక నేమియో చెప్పెను.

మేఘవర్ణుని మోసము

మఱుచటి దినమున సూర్యుఁడుదయింపకమున్నే నలగడల నాలుగు దుర్గద్వారములందు యుద్ధము జరుగుచుండగా గోట నడిమి గృహములం దొక్కసారిగాఁ గాకు లగ్నిముట్టించినవి. పిమ్మట 'గోటలొంగిపోయె; గోటపడిపోయె” నని కోలాహలము విని మండుచున్న యగ్నిజ్వాలలు చూచి రాజహంస సైనికులును, నితర దుర్గవాసులను నగు పక్షులన్నిలు శీఘ్రముగా జలాశయప్రవేశ మొనర్చినవి. మంత్రాలోచనము, విక్రమము, యుద్ధము, పలాయనము, సమయానుసారముగా సలుపవలెఁ గాని వెనుదీయరాదు.

సారసపక్షి స్వామిభ క్తి

సహజముగా మందగతియగు రాజహంస సారసద్వియుడై చిత్రవర్ణుని సేనానియగు కుక్కుటముచే నిరోధింప బడెను. అపుడు రాజహంస 'సేనాపతీ! నన్ననుసరించి యుండి యేల మరణమున కెరయగుదువు? నీవు శీఘ్రముగా నిపుడైనఁ దప్పించుకొనిపోగలవు. కావున నట్లు పోయి జలముఁ జొచ్చి యసువులు గాపాడుకొనుము. నా కొమరుఁడు చూడామణి యనువానిని సర్వజ్ఞుని సమ్మతితో రాజు నొనరింపుము. నావుడు సారస మిటు లనియెను.

'ప్రభూ! ఇట్టి మాటలు విననొల్లను. ప్రభువునకు జంద్ర దివాకరులున్నంత కాలము విజయము గలుగుగాక! నేను తమదుర్గమున కధికారిని, నా రక్తమాంసములచేఁ బూయఁబడిన ద్వారమార్గమున మాత్రమే శత్రువు దుర్గమునఁ జొరఁగలడు. మఱియును దాతయు, నోరిమి గలవాఁడును, గుణములు గ్రహింపఁగలవాడును నగు ప్రభు వెం తయదృష్టముననో కాని లభింపఁడు.' నావుడు రాజు 'అది సత్యమేయయినను సమర్థుఁడు, బవిత్రుండు, ననురాగవంతుఁడునగు సేవకుడు దుర్లభు' డనియెను.

"ప్రభూ! యుద్ధమునుండి తొలఁగిన నిఁక మరణభయము లేకుండుట స్థిరమైనచో మఱొకచోటికిఁ బాఱిపోవచ్చును. పుట్టిన ప్రతిప్రాణికి మరణ మొపుడో యొకపుడు తప్పని దైనపుడు యుద్ధమునుండి తప్పుకొని కీర్తి నేల మలినపఱ చుకొనవలయును? గాలి తాఁకునఁ గలుగు కెరటముల తిరుగుడుచే నేర్పడిన సుడిగుండమువలె క్షణభంగురమైన యీజన్మయందుఁ బరులనిమిత్తము జీవితము నర్పించు యోగము మహాపుణ్యమువలనఁ గలుగును.

ప్రభువు, అమాత్యుడు, రాష్ట్రము, కోట, కోశము, సేన, మిత్రుడు, పౌరశ్రేణులు నను నవి రాజ్యాంగములగు సప్తప్రకృతులు. అందు ప్రభుఁడవగు నీవు సర్వవిధముల రక్షింపఁబడఁదగిన వాఁడవు. ప్రకృతివర్గము సంపూర్ణమయ్యును బ్రభువు లేనిదే నిలువఁజాలదు.

వైద్యుఁడు ధన్వ తరియైన నాయుర్దాయము లేనివాని విషయమున నేమిచేయఁగలడు? సూర్యుని యుదయాస్తమయముల ననుసరించి కమలము వికసించుట, ముకుళించుట జరుగు నట్లు రాజభ్యుదయమున నున్నపుడు ప్రజలు సుఖింతురు, రాజు హాని నొందునపుడు ప్రజలును కీడునొందుదురు" అని పలుకుచుండగాఁ గుక్కుటమువచ్చి రాజహంస శరీరమున వాడియైన గోళ్ళతోఁ బొడిచెను. అపుడు సారసపక్షి శీఘ్రముగా రాజహంసను దన దేహమందిడుకొని భద్రముగా సరోవరజలమం దునిచెను.

అపుడు కుక్కుటములన్నియుఁ జుట్టుముట్టి సారసము దేహమంతయును దూంట్లువడునట్లు పొడిచెను. సారసమును దన విక్రమముఁజూపి కుక్కుటసేనను

జాలవఱకు నంత మొందించెను. కుక్కుటములు లెక్కలేనన్ని యగుటచే నన్నియు గలసి ముక్కులతోఁ బొడిచి తుదకు సారసముం జంపివైచినవి.

అనంతరము చిత్రవర్ణుడు దుర్గమునుజొచ్చి దుర్గమందలి విస్తారమైన ద్రవ్యము దీసికొని, వందిజనులు, జయజయ ధ్వనులు చేయుచుండ స్కంధావారము కేఁగెను.

విష్ణుశర్మయిట్లు చెప్పుచుండ రాజుకుమారు లిటులనిరి. 'రాజహంస సేనయందు స్వదేహమును త్యాగముచేసి ప్రభువును రక్షించిన సారసపక్షి సుకృతము కడు శ్లాఘ్యము. సర్వగోవులును ధేనువు నాకృతిగల వత్సములఁ బెక్కింటిని గనుచున్నవి. కొమ్ములు, మూఁపును దాఁకునట్టి ప్రశస్తమైన యాబోతు మాత్ర మేయొక్క గోవునకో జనించును" నావిని విష్ణుశర్మ యిట్లనియె.

"విద్యాధర స్త్రీలు పరిజనమై కొలువ మహాసత్వమగు నాసారసము స్వర్గసుఖ మనుభవించును. యుద్ధమున బ్రభువు నిమి త్తమై, దేశము నిమిత్తమై శరీరముల గోలుపోవునట్టి కృతజ్ఞులగు ప్రభుభక్తులు స్వర్గము నొందుదురు. పందతనము వహింపక యుద్ధరంగమున నెచ్చోట శత్రువులచే జంపబడిన శూరుడును నక్షయపుణ్యలోకము నొందును. పర మహీపతుల కరితురంగ పదాతి సేనలతో నెన్నడు మీకు యుద్ధము సంభవింపకుండునుగాక! నీతిమంత్రవాయువులచే జెదరగొట్టబడి మీవైరులు గిరి గహ్వరముల నాశ్రయింతురుగాక!"

సంధి

అనంతరము రాజపుత్రులు విష్ణుశర్మతో “ఆర్యా తమ దయవలన విగ్రహము సొంతముగా వింటిమి. ఇపుడు సంధిని గుఱించి మాకుఁ దెలుపు” మని కోరఁగా విష్ణుశర్మ యిట్లు చెప్పఁదొడఁగెను.

“రాజహంస జలాశయము జేరినపిమ్మటఁ జక్రవాక మంత్రితో “మనదుర్గమున నిప్పుముట్టించిన వాఁడెవ్వండు? మన కోటలోని వాఁడే యిట్లు చేసెనా? లేక శత్రువులచేఁ బంపఁబడిన మఱెవ్వఁడైనఁ గావించియుండునా?” యని పలికెను.

అపుడు మంత్రి “ప్రభూ! మీనిష్కారణ బంధువగు మేఘవర్ణుడు సపరివారముగా నదృశ్యుఁడయ్యె; నీపని యాతఁడే యొనరించి యుండునని నాయూహ. ” నావుడు రాజు క్షణమాలోచించి “యీ దురదృష్టమునకుఁ గర్త దైవము. మఱెవ్వరుఁ గారు. ఒకపుడు చక్కగా నాలోచించి చేసిన పనియు దైవయోగమువలన, నాశనమగుదును గదా!” యని పలికెను. ఆ మాటలు విని మంత్రి యిటు లనియె.

“కార్యము విఫల మైనపుడు మానవుఁడవివేకియై దైవమును నిందించునే కాని తన యనాలోచిత కృత్యములఁ దెలిసి కొనఁజాలడు. హితమునుగోరు మిత్రుల వాక్యముల విననివాఁడు నీటిపట్టు వీడి పడి చెడిన కూర్మమువలె హానిఁ జెందును. నీ కా కథ దెలుపుదును. వినుము.

హితవాక్యములు వినక చెడిన కూర్మము కథ

మగధ “దేశమున ఫుల్లోత్పల మను నొక్క సరస్సు గలదు. సంకట వికటములను పేరుగల రెండు హంస లందు నివసించుచుండును. వానికి మిత్రమై కంబుగ్రీవమను నొక్క కూర్మము గూడ నుండెను. ఒకనాడు జాలరు లాసమీపమునకు వచ్చి ‘నేఁ డిచటనుండి రేపటియుదయమున నీ కొలనియందలి మత్స్య కూర్మాదులఁ బట్టుకొంద’ మని తమలోతాము చెప్పుకొనిరి. ఆమాటలు విన్న తాఁబేలు హంసలతో నిటులనియెను. ‘ఇపుడు మనకుఁ గర్తవ్య మేమి?’ ‘ప్రాతః కాలమున నేదోయొక యుపాయ మాలోచింతము. ఈ లోగానే యంతప్రమాదము ముంచుకొని వచ్చిన నెట్లు జరిగిన నట్లు జరుగును’ అని హంస పలుకఁ గూర్మమిట్లు పలికెను.

ఏదో యొకటి జరుగునని యూరకుండుట తెలివి తక్కువ. అనాగత విధాతయు, ప్రత్యుత్పన్న మతియు సుఖింపఁగా, యద్భవిష్యుడు నశించినాఁడు. మీ కా కథ

దెలుపుదును వినుఁడు.

మూడు చేపల కథ

పూర్వ మొకప్పు డీచెఱువునందే యనాగత విధాత, ప్రత్యుత్పన్న మతి, యద్భవిష్యుడు నను మూడుచేపలు వసించుచుండెడివి. 'జాలరులు వచ్చి వేటాడఁదలఁచి' రను సంగతి విని వానిలో ననాగత విధాత మరొక జలాశయమునకు వెడలి పోయెను.

ప్రత్యుత్పన్నమతి యిటులు తలచెను. "భవిష్యత్తులో నెపు డేమి జరుగునో యెవరు నిర్ణయింపగలరు? ఆపదవచ్చినపుడు సమయానుకూలముగా నుపాయ మాలోచించుకొనవచ్చును. జరుగనున్నది జరుగక మానదు. జరుగఁబోవని దెచట నున్నను జరుగఁజాలదు." యద్భవిష్యుఁ 'డేదో యొకటి జరుగు' నని యెక్కువగా నాలోచింపక యూరకుండెను.

మరునాఁ డుదయమున జాలరులు వచ్చి పట్టుకొనగాఁ బ్రత్యుత్పన్నమతి వలలో మరణించినట్లు నటించెను. వారది పనికిరాదని యెంచి వలనుండి తీసిదూరముగా విసరివైచిరి. అచట నుండి యది యెట్లో తప్పించుకొని లోతునీట మునిగెను. యద్భవిష్యుఁడు మాత్రము పల్లెవాండ్రకుఁ జిక్కి తప్పించుకొను నుపాయము గానక మృతి నొందెను. కావున నేను మఱొక చెఱువునకుఁ బోవ సాయముఁ జేయుఁడు. నావుడు నాయంచ లిటు లనియె.

"మఱొక చెఱువుఁ జేరినపిదప నీకుఁ దప్పక కుశలమే. కాని నీ వచటి కపాయకరమైన మెట్టత్రోవ నెట్లు పోఁగలవు? " "మీతో నన్నాకాశమార్గమునఁ దీసికొని పొం" డని కూర్మమన "నదియెట్లు సాధ్య" మని యవి సందేహించెను.

"మీ రొక కర్రను రెండు చివరల ముక్కు లతో బట్టు కొనుఁడు. నేను దాని నడుమఁ గఱచుకొనియుండ మీ రెక్కల బలమున నాకసమున నెగిరిపోవచ్చు" నని తాబేలన హంస 'లీయుపాయము మంచిదేకాని దీనియందపాయ మేమైన నున్న దేమో కనుఁగొనవలయును. బుద్ధిమంతుఁ డుపాయము నంటి యుండు నపాయమును గూడ నెఱుఁగకున్నచో దన పిల్లలను ముంగిసల పాలొనరించి దుఃఖమునొందిన కొంగగతి గలుగును. నీ కా కథ జెప్పుదుము వినుము.

అపాయసహితమైన యుపాయముచేఁ జెడిన కొంగ కథ

ఉ త్తరదేశమున గృధ్రకూట మను పర్వత మొక్కండు గలదు. ఆకొండ యందొక పెద్దపిప్పలి చెట్టు గలదు. ఆ చెట్టుమీఁద లెక్క లేనన్ని కొంగలు కాపురము సేయుచుండెను. ఆచెట్టు మొదట నున్న పుట్టలో నొక సర్పము గలదు. చెట్టెక్కి యది కొంగలు పెట్టిన పిల్లలను తిని జీవించుచుండెను. ఆకొంగల దుఃఖమును భరింపలేక యందొక పెద్దకొంగ కడమవాని కిట్లు సలహా చెప్పెను. 'మీరు చేఁపలను దీసికొనివచ్చి ముంగిసలు వసించు కలుగులనుండి పాముండు పుట్టవఱకు వానిని బడ వేయుఁడు. ఆ యాహారము రుచి చూచి ముంగిసలు పాము పుట్టవఱకు వచ్చి దానిఁ జూడవలయును. సహజవై రమువలన పాము నవి చంపిచేయగలవు.' ఆమాటలు విని కొంగలన్నియుఁ గడు శ్రమకోర్చి యెన్నో చేఁపలదెచ్చి యనుకొన్నట్లు పడవైచెను, తలఁచినట్లుగనే ముంగిసలు చేఁపల వెంబడి వచ్చి పామును జంపివైచినవి. వానికిఁ జెట్టుమీదఁ బక్షి పిల్లల ధ్వనులు వినరాఁగా నవి చెట్టెక్కి పక్షి పిల్లల నన్నిటినిఁ గూడఁ దినివై చెను. కావున మే మిట్లంటిమి. మేము నీవన్నట్లు నినుఁ దీసికొనిపోవుచుండగాఁ జూచిన ప్రజ లూరకుండక యేమైనఁ బలుకఁగలరు. అదివిని నీవేవైన జవాబీయఁదలచి నోరు దెఱచితివేని నీప్రాణములు నీవికావు; కావున నెట్లైన నీవిచటనే యుండుట మేలు. నావుడుఁ గూర్మ మిటులనియెను. “నే నంత యజ్ఞురాలఁగాను, వా రేమన్నను నే నేమియుఁ బలుక కూరకుండఁగలను.”

తుదకుఁ దాఁబేటి మాటల కంగీకరించి హంసము లదిపట్టుకొన్న కర్రను రెండువైపుల ముక్కునఁ బట్టుకొని వెడలుచుండ; నా విచిత్రమును కొందఱు గోపాలకులు చూచిరి. వారు వానివెంటబడి పరువెత్తుచు “నీ తాబేలు క్రిందఁబడిన వెంటనే వండికొని తిందము; ఇచటనే కాల్చుకొని తిందము; కాదు ఇంటికిఁ దీసికొనిపోవుదము;” అని వారిలోవారు వాదులాడుకొనుచుండిరి.

ఆ మాటలకు గూర్మమునకుఁ కడుఁగోపము కలిగెను, తన ప్రతిజ్ఞను మఱచి 'మీ బూడిద తినుఁ'డని పలుకుచుఁ బట్టువదలి క్రిందఁ బడిపోయను. దానిని వారు చంపి తీసికొనిపోయిరి. కావున హితవాక్యములు విననిచో హాని సంభవింపకమాన”దని మంత్రి పలుకుచుండ గూఢచరుఁడగు బకమువచ్చి “ప్రభూ! నేను ముందే నుడివితిని 'ప్రతిక్షణము దుర్గశోధన మవసర' మని.

మీ రాపలుకుఁ బాటింపరైతిరి. దానిఫల మిపు డనుభవము నకువచ్చెఁగదా! శత్రుమంత్రియగు గృధ్రము ప్రేరణచే మేఘవర్ణుఁడే కోటలో నిప్పు ముట్టించెను.” నావుడు రాజు నిట్టూర్పు విడిచి యిట్లనియెను. “తాత్కాలికమగు నుపకారమువఁలనగాని, యనురాగము వలనఁగాని శత్రువులను విశ్వసించువాఁడు వృక్షాగ్రమున నిద్రించినవానివలెఁ బతనము సంభవించినపుడు మాత్రమే వివేకము నొందగలఁడు.”

ఆమాటలు విని మరల బక మిటులు చెప్పెను. “దుర్గమును దహించి యిచటినుండి వెడలిన యనంతరము చిత్రవర్ణుఁడాతనిపై ననుగ్రహముచే నిట్లనియె. 'ఈ మేఘవర్ణు నీ

కర్పూర ద్వీపరాజ్యమున కధిపతిగా నభిషిక్తునిఁ జేయుదము. కృతకృత్యుఁడగు సేవకుని యుపకారము మఱువరాదు. మాటచేతను గ్రియచేతను నాతని సంతోషపఱుపవలయును.’ నావుడు బ్రధానమంత్రి గ్రద్ద యిట్లనియె.

“ప్రభూ! ఇది యుచితముగాదు. మఱొక యుపకారమేదైనఁ జేయఁదగును. ఘనులగువారి కుచితమగు పదవిలో నెన్నడు నీచునిఁ గూరుచుండఁ బెట్టరాదు. నీచుఁ డుత్తమ పదవి నొందెనేని ప్రభువునకే హాని దలపెట్టఁ గలడు. ఒక మూషికము వ్యాఘ్రముగాఁ చేయబడి తన్నుగాపాడిన మునినే చంపయత్నించెను. నీకాకథ యెఱిగింతును వినుము.

తన్ను వ్యాఘ్రముగాఁ జేసి కాపాడిన మునిని జంప యత్నించిన మూషికము కథ

గౌతమ మహర్షి తపోవనమున మహాతపుఁడను నొక ముని గలఁడు. ఒకనాఁడొక కాకి యెలుక పిల్ల నెత్తుకొనియెగిరి పోవుచుండ, నది దాని నోటినుండి జాఱి ముని సమీపమునఁ బడెను, దానిం గాంచి యాతడు జాలి నొంది నీవారధాన్య గింజలిడి పెంచుచుండెను.

ఒక నాడు మార్జాలమొకటి దానింబట్టు కొనఁబోవ నది ప్రాఁకివచ్చి మునియొడిలోఁ బడెను. ముని దానిం గురుతెంచి తన మహిమవలన మార్జాలముగా మార్చెను.

మఱొకనాడు పిల్లిగామాఱిన యెలుక నొక కుక్క దఱుముకొని రాఁగా మునిదానిం గుక్కగా మార్చెను. ఇంకొకనాఁడు కుక్కగా నున్న యెలుకను బెద్దపులి తఱుమగా ముని మరల దానిని వ్యాఘ్రముగా మార్చెను. అనంతరము ముని దానిని మూషికముగనే భావించుచుండెను. ఆతనిని, వ్యాఘ్రమును జూచియందఱు “నీముని యెలుకను పులిగా మార్చినాఁడట” యని చెప్పుకొను చుండిరి. అదివిని

పులిగా మాఱిన యెలుక యిటులు తలపోసెను.

“ఈ ముని జీవించియున్నంతకాలము నకీర్తికరమగు నా జనన వృత్తాంతము మాసిపోదు. మఱియు నీముని యెపుడైన నే క్షుద్రజంతువు మీఁదికై న నేఁగిన దానిని మనతో దుల్యముగా మార్పఁగలడు. మఱియుఁ గోపమువచ్చిన నన్నెట్టి రూపమునకైనఁ మార్పగలడు. కావున నీముని నిపుడే మట్టుపెట్టుట మంచిది” అని తలఁచి మునిపైఁబడ నుంకింప నతఁడది కనిపెట్టి దాని నెప్పటియట్లు మూషికముగా మార్చివైచి దానితో నిట్లనెను. “నీచప్రాణి కౌన్నత్యముఁ గల్గించినను నది మేలు గాఁజాలదు. దానిని

యధాస్థితిలో నుంచుటే యుత్తమము. ఈయర్థము నెఱింగించు కథ యొకటి కలదు నీకది యెఱింగించెదను వినుము.

కన్యగా మారి తగినవరుడు దొరకక యథాస్థితి నొందవలసి వచ్చిన మూషికము కథ

ఒకముని పుణ్యతీర్థములన్నియు సేవించుచు నొకనాడు గంగానదియందు స్నానము గావించి సూర్యున కర్ఘ్య మొసగుచుండెను. ఆ సమయమున నాకాశవీథి యం దొకడేగ యెలుక నొకదానిం దన్నుకొని పోవుచుండెను. దైవ వశమున నా యెలుక డేగపట్టునుండి జాఱి యర్ఘ్యమొసఁగు చున్నయాముని చేతులలోఁ బడెను. అతడు దానింజూచి వేడుకగలవాఁడై దయదలఁచి 'ఈమూషికము కన్యయగుఁ గాక' యని పలుకాగా నది యట్లే యయ్యెను.

ముని యక్కన్యను గొనిపోయి తనభార్య కిచ్చెను. ఆమె కన్న కొమారితకన్న నెక్కువప్రీతితో నాకన్యకను బెంపగాఁ "గొంతకాలమున కామెకు యౌవనము వచ్చెను. మిక్కిలి సుందరముగా నున్నయామెను గనుఁగొని యమ్ముని యొకనాఁడిట్లు చింతించెను.

"ఈ కన్యను దగిన వరునకు సమర్పింప వలయును. లేకున్న వివాహ వయసు దాఁటిపోవును. అందువలనఁ బాపము కలుగుటే కాక ప్రజలందఱు నిందింతురు. చక్కని చుక్క యగు నీమెను సామాన్య వరున కీయరాదు. "

ఇట్లాలోచించి మంత్రములచే సూర్యుని స్మరించెను. వెంటనే దివ్యమూర్తియైన భాస్కరుడు ప్రత్యక్షము కాఁగా నమస్కరించి యమ్ముని యిట్లనెను.

"ఈ సుందరికి మానవుఁడు భర్తకారాదని నిన్ను స్మరించితిని. నీవీమెను భార్యగా గ్రహింపుము" అని కోరెను.

"ఈ సుందరిని వరించుటకు మహాబలిష్ఠుఁడైన వాయువొక్కఁడే యర్హుడు. ఆతడు నాకన్న సంపదలు గలవాఁడు." అని చెప్పి సూర్యుడు వెడలిపో యెను.

అపుడాముని తన తపశ్శక్తిచే వాయుదేవుని స్మరించెను. ఆతఁడు వెంటనే ప్రత్యక్షమయ్యెను. "నాకుమారియగు నీకోమలిని వివాహమాడు" మని ముని యామెం జూపఁగా వాయుదేవుఁడు మెల్లన నిట్లు పలికెను.

దేవేంద్రుఁడు నాకంటే గొప్పవాడు. ఆతనిఁ గాదని యితరుల కిచ్చుట న్యాయము గాదు. ఆతని కిచ్చి పెండ్లి చేసిన యెడల నీమె సకల స్వర్గసౌఖ్యములు ననుభవించును." అని మునికి నచ్చ జెప్పి వాయు దేవుఁడు వెడలిపోయెను.

ఆముని యపుడు మంత్రమహిమవలన నింద్రు నారాధింపఁగా నాతండు ప్రత్యక్షమయ్యెను. ఆముని యానందించి దేవేంద్రుని బెక్కు విధముల స్తోత్రము చేసి "చూడు మీ సుందరాంగి నా తనయ. దీనిని వివాహమాడుటకు నీవే యర్హుడఁవు. నరసురాసుర కిన్నర యక్షవరులలో నింకెవ్వరు దీనికిఁ దగరు. కావున దీనిఁ జేకొనుము." అని ప్రార్థించెను.

అంతట దేవేంద్రుఁ డామునీంద్రున కక్కన్నియమీదగలఁ వాత్సల్యమున్ను, నాకన్య జనించిన విధమును గ్రహించి నవ్వుచు నిట్లనెను.

"మేరుపర్వత శ్రేష్ఠుఁడు మీకును మాకును నందఱికినిఁ బూజనీయుడు. సురుచిరములయిన రత్న సానువులతో నొప్పుచుండును. ఆతనిశృంగములు మహోన్నతములు. సూర్యచంద్ర నక్షత్రాదు లనవరతము నాతని చుట్టుఁ దిరుగుచుందురు. శంకరుఁడు, బ్రహ్మ మున్నగు దేవత లాతని శిరమున నుందురు. ఆతడు ధనికుఁడు. సత్యవంతుడు. కావున నీపుత్రిక నాతనికిచ్చుట మేలు" ఇట్లు చెప్పి యింద్రుఁడంతర్ధానమయ్యెను.

"పిలిచి పిల్ల నిచ్చెదనన్న నొకరు నంగీకరింపరైరి. వారితోడనే యున్నదా యేమి?" అని తలఁచి యాముని మేరువును స్మరించెను. వెంటనే యాతడుఁ సుకుమారరూపముఁ దాల్చి మునికిఁ బ్రత్యక్షము కాఁగా ముని యాతని కర్ఘసత్కారములొనరించి "ఈసుందరి నెవ్వరికి నీయక నీకీయదలఁచితిని, కావున మాతో వియ్యమందవలయును" అని పలికెను.

దానికి మేరు విట్లు బదులు పలికెను. "నాశరీరము మిక్కిలి స్థూల మైనది. అంతగొప్పశరీరమును వేష ధారిణియగు నీమూషికము పెక్కు కలుగులుగాఁ దొలిచి వైచును. కావున నిది నాకన్న నధికురాలు. కావున నీ కుమారికకిట్టి ఘనమైన మఱియొక్క మూషికమే భర్తకాఁదగును. కాని నావంటి యల్పుల కీమె నిచ్చుట మంచిదికాదు" అని పలికి యమ్మునిని వీడుకొని మేరువు వెడలిపోయెను.

అపు డాముని యాకన్య కెచటను దగిన వరుఁడు లభింపనందున "దీనికి వివాహవయసుదాఁటి పోయిన ధర్మహాని గలుగును. పూర్వమువలె మూషికమైయున్న నేవిచారము నుండ" దని తలపోసి మరల మూషికముగా మార్చివైచెను. కావున నీచు నున్నతాధికారమున కెన్నఁ కొనరాదు. నీచుని నధికారిగా నుంచుకొని శశకపింజలములు వినాశము నొందెను. నీకాకథయు నెఱింగించెదను, వినుము.

నీచు నధికారిగా వరించి చెడిన శశకపింజలముల కథ

ఒకానొక చెట్టు తొఱ్ఱయందుఁ గపింజలమను నొకపక్షి నివసించుచుండెను. అదియొకనాఁ డాహారమునకై పోయి కొంచెమాలస్యముగాఁ దనతావునకు దిరిగివచ్చెను. అప్పటికి దాని నివాసస్థలమున దీర్ఘకర్ణమను పేరుగల కుందేలు ప్రవేశించి యాక్రమించి యుండెను. దానింజూచి కపింజలము "మేఁతకుబోయి వచ్చునంతలో నాయిల్లాక్రమించుట తగునా" యని యడిగెను.

"విడిచిపోయిన యింటిని నరపతిలేని రాజ్యమునకు, మగదిక్కు లేని సతికి నెవడు బలవంతుఁడో వాఁడే యధికారి కాఁగలడు. నేను బలవంతుఁడను దీనిని నేను విడువ వలసిన యవసరము లేదు.

మఱియుఁ జెఱువులుఁ, గూపములు నెవరివశముననున్న వారివే యని మనువు పలికెను. కావున నే నిచ్చోటు వదలను." అని కుందేలు పలికిన మాటలకుఁ గపింజల మిట్ల నెను.

"మొగమోట యించుకైన లేక యిది నాయిల్లని పలుకుట నీకుఁ దగదు. తగవు దీర్చుకొందము రమ్ము. లేదేని నీకును నాకును బెద్ద జగడము తప్పదు."

దాని కంగీకరించి యాశశము "తగవు దీర్చుకొనుటకు రమ్మనఁగా రాననుట పాడిగాదు" అని పలికి యాపక్షితోఁ గూడి కొంతదూరము పోయి "మనకుఁ దగవు చెప్పు వారెవ్వరు?" అని కపింజల మడుగఁగా యమునా నదీతీరమున దధికర్ణుఁడను మార్జాలశ్రేష్ఠుడు కలడు. ఆతఁడు సత్యవ్రతుఁడు. ఆతని నడిగి ధర్మసందేహముఁ దీర్చుకొంద" మనెను.

"పిల్లి హృదయము కడుఁ గ్రూరమయినది. ఎన్నఁడు దానిని నమ్మరాదు. నీకట్టి మార్జాలము మీఁద విశ్వాసమెట్లు కలిగె" నని పక్షి ప్రశ్నించెను.

"దధికర్ణుఁడాచారవంతుడు. ఉత్తముఁడు. ఈచేరువ వారందఱు నాతని నెఱుంగుదురు. నీకేమియు భయమవసరము లేదు నాతోరమ్ము" అని జెవులపిల్లి బదులుపల్కెను.

"నాకు భయమున్న నీకును భయ ముండును, యిది యిర్వురకు సమానమే. నాకుఁదోచినమాట చెప్పితిని. నీకు లేని భయము నాకు మాత్రమేల?" యని కపింజల మనెను.

అట్లా శశకపింజలములు పోయి పోయి దధికర్ణుని నివాసమునకుఁ జేరి కొంతదూరమున నిలిచి "మాయిరువురకు నింటి విషయమై వివాదము గలిగినది. నీవు ధర్మమార్గమున దీనిని బరిష్కరించి వేగముగా మమ్ముఁబంపి వేయు" మని కోరెను.

ఆమాటలు విని మెల్లనఁ దలయెత్తి చూచి దధికర్ణుఁడిట్ల నెను. "వెనుకటివలెఁ గాక మిక్కిలి ముదుసలినై యుంటిని. దూరముననున్న వస్తువులు కంటికానుటలేదు.

మాటయు బాగుగా వినఁబడుటలేదు. ఈ విధమున నింద్రియ వైకల్యము నొందియుంటిని. నాపై విశ్వాసమున్నచో దగ్గిఱికి వచ్చి మీరు చెప్పఁదలచినది చెప్పుడు." దధికర్ణుని యీమాటలు విని యది సమీపించుట కింకను గొంచము వెఱచు చుండగా మరల నతఁ డిట్లనియె.

"పనిగట్టుకొని బంధువులై యిచటికివచ్చి భయపడెదరేల? ధర్మమును మనము చెఱిచిన నది మనలను నాశము చేయును. ధర్మమును మనము కాపాడిన నది మనలను రక్షించును. ధర్మమే మిత్రుఁడై వెనువెంట వచ్చును. తక్కినధనము లన్నియు గర్మాయుత్తమైన శరీర మెచట నశించునో యచటనే నిలిచిపోవును.

నా పలుకు లన్నియు నిజములు. కల్లలాడువాఁడు నరక కూపమునఁ బడిపోవును. కావున నీచవృత్తితోఁ గల్లలాడువాఁడనుగాను.

అహింసకు మించిన ధర్మము లేదు. పరమాత్మ స్మరణము తప్ప నితరములన్నియు విడిచి యహింసావ్రతముం బూని చాంద్రాయణ వ్రత మనుష్ఠించుచున్నాను. నాతపశ్శక్తి వలన మీరడిగిన ధర్మసందేహము లన్నియుఁ దీర్పఁగలను.

ఈవిధమున నమ్మకము గలుగునట్లుగా దధికర్ణుఁ డొనఁగిన దీర్ఘోపన్యాసము విని శశకపింజలములు భయముడిగి దగ్గరికిఁ జేరి నిలిచెను. వెంటనే యారెండింటిని ముందఱి కాళ్ళతో బట్టి చంపి దధికర్ణుఁడు ప్రీతిమీఱ భక్షించెను." కావున నీచుని నధికారిగా నొనరించికొన్న శశకపింజలముల వలె చేటొందక తప్పదు.

మఱియు నీకర్పూర ద్వీపమును వశపఱచికొని యేలుటంత తేలికపని యనిఁ తలఁచి పేరాస నొందరాదు. రకరకములైన చేఁపలఁ బెక్కింటినిఁ బొట్టఁబెట్టుకొని పేరాశచేత నొక కొంగ తుద కెండ్రకాయచే మరణము నొందెను. నీకాకథ యెఱింగించెదను వినుము,

పేరాస వలన నెండ్రకాయచే మృతినొందిన కొంగ కథ

మాళవ దేశమునఁ బద్మగర్భమను నొక సరస్సు గలదు. అచట బలహీనమై, దీనమైన దానివలె నున్న యొక ముదుసలికొంగను జూచి యొక కుళీరమిట్లు ప్రశ్నించెను. 'నీ వెందువలన నాహారము ముట్టక యిటు లుంటివి?' నావుడు బక మిటులనియె. "మత్స్యములు నాజీవనమున కాధారములు. వానిని జాలరులువచ్చి పట్టి వేయుదురని నగరపరిసరముల వినియుంటిని. జీవనవృత్తి నశించి మరణ మవశ్యము సంభవించునని కలతనొంది యాహారము నందు ప్రీతిలేనివాఁడనై యుంటిని. "

మత్స్యము లాపలుకులు విని యిటు లాలోచించినవి. "ఈ సమయమున నీకొంగ యుపకరించు నటులు గానఁబడు చున్నది. కావున గర్తవ్యమేమో దీనినే యడుగుదము.

ఉపకరించు వైరితోనైన సంధి చేసికొనవలయును. మిత్రుఁడైన నపకరించువానిఁ జేరరాదు. మిత్రత్వ శత్రుత్వములకు లక్షణము, లుపకారాపకారములే కదా?' యని తలఁచి యవి కొంగను జేరి 'యోబకో త్తమా! ఇక మేము బ్రదుకు నుపాయ మేదైన గలదా?' యన నాకొంగ 'మఱొక చెఱువును చేరుట యొక్కటే మీకు రక్షణోపాయ' మనెను. నీవే మాపైఁ గరుణించి మఱొక కొలనికిఁ జేర్పుమని యాబకమును చేఁపలు వేడుకొనఁగా నయ్యది యొకొక్క చేపం దీసికొనిపోయి బక్షించుచుండెను.

అన్నియు నైనపిమ్మటఁ గుళీరము దన్నుఁగూడ జలాశయాంతరమునకుఁ దీసికొనిపొమ్మని బకమును గోరెను. అపూర్వమైన యెండ్రకాయ మాంసము లభించుచున్నదని పేరాసఁ జెంది యానందముతోనా కొంగ దాని దీసికొని యొకస్థలము మునఁబెట్టి పొడుచుకొని తినుట కువ్విళ్ళూరుచుఁ బోవుచుండ నా కుళీర మచటి చేపల యెముకలన్నింటినిజూచి 'అయ్యో చచ్చితిని. ఇపుడు సమయోచితముగా మెలఁగి దీనిఁ దప్పించుకొనవలయు' నని యాలోచించెను.

"భయపరిస్థితి వచ్చువఱకు భయపడఁదగును. వచ్చిన పిమ్మట భయము వీడి తెగువఁ జూపవలయును. శత్రువు నెదుటఁబడి మఱొకసాధన మేమియుఁ గానరానపుడు యుద్ధము చేసి మరణించుట ప్రాజ్ఞుని లక్షణము 'యుద్ధము చేయకున్న మరణము తప్పక సంభవించు పక్షమున, యుద్ధము చేయుచో రవంతయైన గెలుపునం దాసయున్నపుడు దప్పక యుద్ధము చేయఁదగు' నని పండితులు పలుకుదురు." అని యాలోచించి యాకుళీరము తనశక్తి యంతయు నుపయోగించి కొంగమెడను బట్టి దానిని ఛేదించెను.

అని మంత్రి చెప్పఁగా విని చిత్రవర్ణుడు "సచివోత్తమా! ఇచట నీకర్పూర ద్వీపమున రాజుగానుండి, యిచటి యమూల్య వస్తువులన్నియు మేఘవర్ణుఁడు నాకంపగలఁడనియు, వానిని సుఖముగా ననుభవింప వచ్చుననియు భావించితి" నని పలుక మంత్రి నవ్వి యిటులనియె. 'రాబోవు సుఖములను దలఁచుకొని సంతసించు వాఁడవి కలుగ నపుడు మిక్కిలి యాశాభంగము నొందును.'

రాజా మాటవిని రహస్యముగా గ్రద్ధతో 'నట్లైన నిపుడు నన్నేమిచేయమందు' వని యడిగిన మంత్రి యిటులనియె. 'మదోద్ధతుఁడగు రాజును, జెలరేఁగిన యేనుఁగును నడుపువారు జననిందకుఁ బాత్రులగుదురు. "ప్రభూ! వినుము మన బలాధిక్యత వలన దుర్గము గెలువఁబడినదా? లేక యుపాయబలమున గెలువ బడినదా?" యని ప్రశ్నింప రాజు "ఆర్యా! పూజ్యులగు తమ యుపాయముననే గెలువఁబడిన" దనియెను.

అటులైన నామాటయందు గౌరవముంచి వెంటనే స్వదేశమున కేఁగుట మేలు. అట్లుకాదేని వర్షాకాలము రాఁగానే మరలఁ దప్పక యుద్ధము జరుగును. పరభూమియందున్న మనకపుడు స్వదేశమున కేఁగుటకైన వీలుచిక్క దు. శాంతి

సుఖముల నాసించినచో సంధిచేసికొని వెడలుట యుత్తమము. దుర్గము జయించి కీర్తి సంపాదించితిమి. సంపాదించిన విజయ మపజయముగా మారకుండ మనము చూచుకొననియెడల లబ్ధనాశము బొంది దుఃఖపడిన మొసలివలె నగుదుము. నీకాకథ యెఱింగించెదను వినుము.

తన యవివేకముచే లబ్ధనాశనమొందిన మొసలి గాథ

లవణసముద్రతీరమున మహావృక్షములతో నిండిన యొక తోఁటలో బలివర్ధనుఁడను నొక కపివరుఁడు వేలకొలఁది తన యనుచరులతో నివసించుచుండెను. కొంతకాలమునకుఁ బిమ్మట సమీపమందలి మఱొక కోతుల మందకు నాయకుఁడైన కపీశ్వరుడు ముదుసలియగు బలివర్ధను బాఱఁద్రోలి యాతని రాజ్య మాక్రమించెను.

బలివర్ధనుడు చేయునదిలేక సిగ్గువడి యచటనుండి చాలదూరము వెడలిపోయి యొక నదిగట్టునఁ బండ్లతో నిండిన యొక పెద్ద మేడి చెట్టును గనుఁగొనెను. తన యదృష్టము వలన ఫలభరితమైన యా వృక్షము కనఁబడినదని సంతసించి యా చెట్టుపై వసించుచు నందలి పండ్లారగించుచుఁ గాలముఁ బుచ్చుచుండెను.

అట్లా మర్కటము పరిపక్వములై న మేడిపండ్లుగోసికొని భక్షించుచుండ నొకపండు చేయిజారి నీటిలోఁబడి చప్పుడయ్యెను. అదేసమయమునఁ గ్రకచుడను పేరుగల మొసలి యొకటి సమీపమున జలములందు సంచరించుచు నా ధ్వనివిని "ఈ ప్రాంతమున నెప్పుడు నిట్టిధ్వని విని యుండలేదు." అని తలయెత్తి చూచెను. గట్టుమీఁది యుదుంబరవృక్ష శాఖాగ్రమున విలాసముగా గూరుచుండి పండ్లు కోసి తినుచున్న మర్కటముం జూచి, యది జారవిడిచిన ఫలమే ధ్వనికిఁ గారణ మని తెలిసికొనెను. వెంటనే "ఓ మర్కట శ్రేష్ఠుడా! నీవు మహోన్నత స్థానము నధిష్ఠించి మహాఫలము లనుభవించుచుంటివి. క్రిందనున్న మావంటి మిత్రులకుఁ గూడ ఫలప్రదానము గావింపరాదా?" యని యడిగెను. బంధుమిత్రవర్గము నెడఁబాసియున్న వానరమున కా మాట లమృతప్రాయముగాఁ దోఁచెను. వెంటనే క్రకచుని చెలిమి కొడంబడి మధురములైన కొన్ని ఫలములుగోసి యాతనికిఁ గ్రింద బడవైచెను. క్రకచుఁడును వాని మాధుర్యమునకు బరవశుండై కొన్ని రోజులింటికిఁ బోక కపివరునితో మైత్రి నెఱపుచు నచటనే యుండెను.

ఆ మొసలి భార్య యెంతకాలమునకు నింటికి రాకయున్న పెనిమిటిని దలంచుకొని మిక్కిలి విచారించి తనచెలికత్తెను బిలిచి యిట్లనెను.

"ఇంతకుముందు నా ప్రియుఁ డెచ్చటి కేఁగినను వెంటనే తిరిగివచ్చుచుండువాడు. ఈ సారి వెడలి యిన్ని దినములయినను నింటికిఁ జేరకుండుటకుఁ గారణమేమియుఁ గానరాదు. ఎచటనైనఁ జిక్కులఁబడెనో? పరాంగనలం దాసక్తుఁడై యెచటనై న

నిలిచిపోయెనో? యెఱుఁగరాదు. కావున నీవేఁగి యెట్లైన సమాచారముం దెలిసికొని రమ్ము. “

చెలికత్తెయు మర్కటమకరముల చెలిమి గనుఁగొని యాడుమొసలి కడకు మరలిపోయి యున్నవియు లేనివియుఁ గల్పించి యిట్లు చెప్పెను.

“చెలీ! నీ పనుపున నెవ్వరెఱుంగకుండఁ బోయి నీపతిజాడ గనుఁగొని వచ్చితిని. ఈ నది యొడ్డున నొక యుదుంబరవృక్షము మీఁద రూపలావణ్య విలాసములతో నొప్పు నొక కపిభామ గలదు. నీప్రియుఁ డామె పొందునొంది మక్కువతో నక్కడి నుండి కదలి రాఁజాలకుండెను. నీమీఁది భక్తిచే సత్యము చెప్పవలసి వచ్చినది. ”

చెలికత్తె చెప్పినమాటలు విని యాడు మొసలి మిక్కిలి పరితాప మొందుచుండునంతలోఁ గ్రకచుడు పెండ్లాము మీఁది మక్కువచేఁ గపివరునడిగి యుందుంబర ఫలములు గొన్ని దీసికొని యింటి కేతెంచెను. మిక్కిలి వంతనొందియున్న ప్రియురాలింగాంచి “కోమలీ! నీతీరు చూచిన మిక్కిలి భయమగుచున్నది. నీవిట్లు పరితాపము నొందుచుండుట గారణ మేమి? నీ మనసులోని బాధయేమో కొంచెము నాకెఱింగించితి వేని నీకోర్కెయెట్టిదైనఁ దీర్చెద” నని పలికెను. ఆడు మొసలి యేమియుఁ బలుకఁజాలక చెలెకత్తె వంకఁజూడ నది నిజమేయని తోఁచున ట్లీవిధమునఁ బలికెను.

“నీవు వెడలినది మొదలీమె రోగమునకుఁ జిక్కినది. ఇఁక గొన్నినాళ్ళీటులున్న నీమె జీవించుట కల్ల. ఒకసిద్ధుఁడీమె జీవించుట కొక మందు చెప్పి వెడలినాడు. నాఁటినుండియు నీసంగతి నీకుఁ దెలుపుదమన్న నీ జాడయే కానరాదయ్యెను.”

ఆ మాటలువిని కనుల నీరు పెట్టుకొని క్రకచుఁడిట్లనియె. “సంజీవని మొదలుగా నెట్టి వస్తువైన నవలీలగాఁ దెచ్చి యీమెను బ్రదికింపఁగలను. ఇది వట్టిమాటగాదు. వెంటనే చెప్పు మాయౌషధ మెద్ది?”

ఆ మాటలకు “వానరహృదయముఁ దిన్నచో నీమె రోగము వెంటనే మానును. లేకున్నఁ గొలది కాలములో మరణము తప్పదు” అనిచెప్పి వెడలినాడు సిద్ధుడు. ఈమె నెట్లు బ్రదికించుకొందువో నీసామర్థ్యములో నున్నది. యని చెలిక త్తె తెలిపెను.

అదివిని యా మొసలి సరే! యని పలికి కొంతదూరము వెడలి తనమనమున నిట్లు చింతించెను. “కపి హృదయము నాకు దొరకుటెట్లు? కపీశ్వరుడైన బలివర్ధనుఁడు పుణ్యాత్ముఁడు, నా ఆప్తమిత్రుఁడును. అట్టివానిని వధించుట పాడియా? ఎంత విషమ పరిస్థితి సంభవించినది? ఒక వంకఁ బ్రాణమిత్రుడు. వేఱొకవంకఁ బ్రియసతి. ఇద్దఱుఁ బ్రాణముకన్న బ్రియమైన వారు. అయినను ‘భార్యను రక్షించుకొనుట పరమధర్మ’ మని పెద్దలు చెప్పుదురు.

ఉన్నతకులమున జన్మించి, చక్కఁదనమున నతిశయించి, సుగుణముల మేటియై యేమృగలోచన పతి మనసును భక్తిచే వశపఱచుకొనునో యట్టి సతికిఁ బతియై యుండుటకన్న ధన్యత యేమి యుండును? కావున గులకాంతను రకించుకొనుటకై బలివర్ధనునిఁ ద్యజించి వైచెదను.”

ఇట్లు నిశ్చయించి తడఁబడుచు మంద మందముగనా యుదుంబరవృక్షముం జేరం జనుదెంచిన క్రకచునిం జూచి బలివర్ధనుఁడు “సఖుడా! ఇన్నాళ్ళుండి యింటికి వెడలి వెంటనే మరలి వచ్చితివి. దీనికి గారణమేమి? నీముఖముఁ జూడవిచారముతో నున్నట్లు కానవచ్చుచున్నది. ఇంటియొద్ద నందఱుఁ గుశలమే కద?” యని ప్రశ్నించెను.

“చాలకాలము నీ చెలిమి కలవడి యుండు కారణమున నింటికిఁ బోగా నాయిల్లెరవై కానఁబడెను. ఉపకారమును గోరి మైత్రి చేయుదురు. నీవట్లు ప్రత్యుపకార మపేక్షింపక నాతోఁ జెలిమిచేసితివి. అట్టి నీవంటి యుత్తముని విడిచి యుండుటఁ యెట్లు?” అని మకరము జవాబీయగా మరల బలివర్ధనుఁ డిట్లనెను.

“నీకు నేను గావించిన మహోపకార మేమిగలదు? నీతోడి స్నేహము వలన నాకు రాజ్యము పోయిన దుఃఖము దొలఁగినది. నీమైత్రివలన సంతోషముగాఁ గాలము గడుపుచుంటిని. శోకమును, శత్రుభయమును పోఁగొట్టి ప్రీతి విశ్వాసములకుఁ గారణమైన ‘మిత్ర’ అను నక్షరద్వయమనెడి రత్నము నే దేవుడు సృజించినాఁడోకదా!”

ఆమాటలు విని క్రకచుడు “సఖుఁడా! ఆకాశమువరకుఁ బెరిగిన యీ చెట్టు మీఁద నీవును, నీటియడుగున నేనును నున్నంతవరకు మన మైత్రికి సంపూర్ణ ఫలమెట్లు చేకూరును? ఇంతేకాక నీవొసఁగిన ఫలములు గొనిపోయి నా ప్రేయసికిచ్చి నీవృత్తాంతముఁ దెలిపితిని. ‘ఇన్నాళ్ళు ప్రాణమిత్రుడొసగిన మధుర ఫలములు తెగఁదిని, యాతని మన యింటికతిథిగాఁ గొనిరాకుండ నెట్లు రాఁగలిగితిరి? మీకీ మాత్రమాలోచనయే యేల తోఁచక పోవలయును?’ అని నాభార్య నను మందలించినది. కావున నిన్నుఁ దీసికొని పోవలయునను తలంపున వచ్చితిని” అని పలికెను.

‘తరుచరమ నగు నేను నీతో జలములలోని కెట్లు రాఁగల’నని బలివర్ధనుడు బ్రశ్నింపగా ‘నీకాభయమక్కఱ లేదు. నామూపుపై నిన్నుఁ దీసికొని పోగలను. మా యింటి సమీపమున నిసుకతిన్నెయందు మన ముల్లాసముగా విహరింప వచ్చును. అచటను ఫలవృక్షములుగలవు’ అని క్రకచుఁడు బదులు పలికెను.

వానరవరునికి మకరపత్నిని జూడవలయునని వేడుక కలిగెను. వెంటనే నిష్కపట బుద్ధితో మొసలి వీపు మీఁదికి వచ్చి కూరుచుండెను. అట్లు బలివర్ధనునిఁ గొని పోవుచు నూరకుండఁ జాలక మకరమిట్లు తలపోసెను. ‘నేటికీ మిత్రునిఁ జంప వలసి వచ్చెనుగదా! నావంటి పాపాత్ముడుండఁడు. స్త్రీ కారణమునఁ జెలికానిం జంపుచున్న నాకు లోకమున నెట్టి నింద కలుగునో కదా!

బంగారము మంచి చెడ్డలు క్షణములో నొరపుడు ఱాతిపై గీచి తెలిసికొనవచ్చును. కొంచము పరిశీలించి చూచినచో బురుషుని గుణము లిట్టివని గుర్తింపవచ్చును. ఎంత పరిశీలించినను స్త్రీస్వభావముఁ దెలియుట కష్టము. ఒక వేళ నా ప్రియురాలేదైనఁ గారణమున నీయుక్తి పన్నెనేమో తెలియదు, ఇట్లాలోచించుచుఁ బరధ్యానమున 'నాడుదాని కొఱకుఁ బ్రియమిత్రుని జంప నాకెట్లు బుద్ధిపుట్టెను' అని కొంచెము గట్టిగాఁ బలికెను.

ఆమాటలు విని బలివర్ధనుడు 'ఇప్పుడేమని పలికితివి? నీ మనసులోని చింతయేమో నాకెఱిఁగింపుము' అనగా మొసలి, 'నే నేమియు ననలేదే! నీవు పొరపడియుందువు.' అని బదులు పలుకగాఁ బలివర్ధనునకు మిక్కిలి సంశయము గలిగెను. 'దీని కేదియో కారణముండి తీరును. అడిగి చూచెదనుగాక." యని తలచి "నాకుఁ దోబుట్టువగు నీభార్యయిపుడు కుశలముగ నున్నదా?" యని యడుగఁ గ్రకచుఁడు పరవశత్వమున "నాభార్య జబ్బుపడినది. వైద్యులు రోగ మసాధ్యమని చెప్పిరి. ఏదోయొక మందు చెప్పినఁ దెచ్చువారు లేరు. నీటిలోనున్నవారిపని యింతియేకదా!" యని పలికెను.

ఆమాటలు విని బలివర్ధనుడు "జలములందే కాని బయల సంచరింపజాలనను విచారము నీకేల? ఆమందేదియో నాకుఁ దెలుపుము. అది యెచటనున్నను భూవలయమంతయుఁ దిరిగియైన సూర్యుఁ డస్తమించులోపలఁ దెచ్చి యీఁగలను." అని పలుకఁగా మకర మిట్లనియె.

"ఒక వై ద్యు నడిగితిని. ఆతఁడు చెప్పిన మందు నీకుఁ దెలుపఁజాలకయే నేను బరితాపబడుచుంటిని. ఇపుడు నీవు గట్టిగాఁ బ్రశ్నించుచుంటివి గావునఁ జెప్పకతప్పదు. నామనసు లోని దుఃఖము తొలఁగుట నీవశముననే యున్నది."

ఆ మాటలు విని వానరనాథుడు "మనసు గలిసినవారి కేమాటయైనఁ జెప్పక దాచుట పాపమని చెప్పుదురు. ప్రాణసఖుఁడ నగు నాకడ దాపఱికము నీకుఁ దగదు. ఎంతచెప్పఁగూడని మాటయైన జెప్పుము." నావుడుఁ గొంతవిచారముఁ దక్కి యా మొసలి యిటులు పలికెను.

"వానరోత్తమా! 'కోతి గుండెతోఁ గూడిన యౌషధ మీ మగువ కిచ్చినచో నీమె జీవించును. రోగమంతయు హరించును.' అని వైద్యుఁడు నాసతికిఁ జెప్పెను. ఆమె నన్నువానరహృదయముఁ గొనిరమ్మని కోరెను. ఈ సంగతి యెవ్వరికిఁ దెలుపక నీకుఁ జెప్పలేక యుంటిని. భార్యకు రోగమువచ్చిన వైద్యము చేయింపలేని యసమర్థుఁడని జనులందఱు నిందించెదరని యీపనికిఁ బూనుకొంటిని."

క్రకచుని మాటలు విని బలివర్ధనుడు భయమునఁ గొయ్యవాఱిపోయి, కొంత సేపటికిఁ దేఱుకొని తనలో నిట్లాలోచించెను. "ప్రేమ నటించి యింటికిఁ బిలువగా నీమొసలిమాటలకుఁ జిక్కి మోసపోయితిని. ముదిమివచ్చినను జితేంద్రియుండను గాక

మకరసతింజూచు కుతూహలము నొందుట వలన నిట్టి యాపదకు లోనయితిని. రాగద్వేషములు విడువని వాఁడరణ్యమున నున్నను బ్రయోజనములేదు.” ఇట్లాలోచించి దైవవశమున నొక్క యుపాయము స్ఫురింపఁగా గ్రకచునితో నిట్లనెను.

“ఓయీ, సఖుఁడా! ఎంత పొరపాటు చేసితివి? నాకీ సంగతి ముందేల చెప్పవు? అట్లు చెప్పిన నామందు దీసి కొనియే వచ్చువాఁడను గదా!

గుండె బరువని ముసలితనమున మోవఁజాలక యొక కొమ్మమీదఁ బెట్టి సంచరించుచుంటిని. నేను దురదృష్టవంతుఁడను. మిత్రునకుఁ బ్రాణావసరమైన పదార్థము దగ్గఱనుండియు సమయమున కుపయోగింపని నాజీవితము వ్యర్థము.

అయిన నిది యాలోచనకు సమయముగాదు. త్వరితముగా మేడిచెట్టు కడకు గొనిపొమ్ము. అస్మదీయ హృదయముంగొని యతిశీఘ్రముగా మరలివచ్చి యామె మరణింపకుండఁ గాపాడవలయును. ”

ఆమాటలన్నియు నమ్మి యామకరము వానరముఁ దీసికొని క్షణములో నుదుంబరవృక్షముఁ జేరెను. వెంటనే కోతి కుప్పించి చెట్టుకొమ్మమీది కెగసి చిట్టచివరి కొమ్మం జేరెను. ‘చెలికాఁడా! రమ్ము. శీఘ్రముగఁ బోయి ప్రియసతిం గాపాడవలయును’ అని క్రకచుఁడు పిలువఁగా బలివర్ధనుఁడు వికటముగ నవ్వి యిటు లనెను.

“చాలుఁ జాలు. నీతోఁ జెలిమిచేసి చాల మేలొందితిని. కోతి గుండె యెచట నుండునో తెలియని మూర్ఖుఁడవు, పెండ్లాము పన్నుగడ లెట్లు తెలిసికొనఁగలవు? అది యెట్టి రోగమో గ్రహింపఁగల బుద్ధి నీకులేదు. ఒకమాఱు వంచింపఁబడియు మరల నీకడకు వచ్చు మూఢుఁడనుగాను. తొల్లి యొక నక్క మాటలు విని బుద్ధిలేని గాడిద యొకటి రెండు మాఱులు వంచింపఁబడి వినాశము నొందెను. నీ కా కథ తెలుపుదును, వినుము.

రెండుమాఱులు వంచింపఁబడి మరణించిన గాడిద కథ

ఒక భయంకరమయిన యడవిలో నొకసింహము రాజయి యుండెను. ఆతనికడ నొక జంబుకము ప్రియభృత్యుఁడై యుండెను. ఒకనాఁడా సింహముం జంబుకము సూచి “ఓయీ! నా దేహమున మహోదరవ్యాధి యంకురించి, యంతకంతకు ముదురుచున్న ది. తగినమందు సేవింపకున్నచోఁ బ్రమాదము సంభవింపఁ గలదు. గార్దభకర్ణ మొక్కటి లభించినచో నది యౌషధమునఁ గూర్చి యారగింతును. దానితో నా వ్యాధి యంతరించిపోవును. కావున నెట్లయిననొక్క గాడిదను నాకడకుఁ గొనిరమ్ము” అని దీనముగాఁ బలికెను.

“చిత్తము” అనిపలికి యాజంబుకము గార్ధభమునకై వెదకుచుఁబోయి యొకగ్రామ సమీపమునఁ జిక్కియున్న చాకలి వాని గాడిదను జూచి జాలినటించుచు వినయముతో మాట లాడి దానికి నమ్మకము పుట్టించి మృగేంద్రముకడకుఁ గొనివచ్చి యెదుటనిలిపెను. ఆసింహము దానింజంపఁబోగాఁ నది దాని కందక వేగముగఁ బరుగిడి తనతావునకుఁ బోయి నిలిచెను.

అపుడు సింహము సృగాలముం జూచి “మనయత్నము నెఱవేఱినది గాదు. ఎట్లయిన మరలఁ బ్రయత్నించి కార్యము సాధింపవలయు” నన “మూఢచిత్తుఁడు ముందెఱుంగక మోసమునకు లోనగునుగాని యొకమాఱు కపటము గనులార జూచియు మరల మోసగింపఁబడుట కష్టము. అయినను నా నేర్పుకొలఁది యత్నించెద?” నని పలికి యాగార్ధభము కడకుఁ బోయి “ఓయీ! మృగరాజును సేవించి యాతనికడనున్న మేఁత యంతయు సుఖముగా ననుభవింపవచ్చును. సేవకులందఱుఁ బ్రీతితో మన్నింపఁగలరు. ఈవిధమునఁ బెద్దఱికము వహించి యుండజాలక భయపడి పాఱివచ్చుట తగునా? సాహసము లేని వానికి సంపదలు రమ్మన్న వచ్చునా?

మఱికి బట్టలు మూఁపున మోసిమోసి, చాకలిచేఁ దిట్టులు, మోదులు నొందుచు నిచటనే నడపీనుఁగవై పడియుండుట మేలని తలఁచుచుంటివా?” యని పలికెను.

“ఇరువురమును గలిసిమెలసి బ్రదుకుదము రమ్మని నమ్మించి కొనిపోయి సింహము నెదుట నిడి ననుఁ జంపింపఁ దలఁచుట నీకు న్యాయమా? వాడిగోళ్ళు సాచి, ముఖ మొట్టువాఱి భయంకర మగునట్లుగా నామీఁది కుఱకఁబోవుచుండు సింహము బారిఁదప్పించుకొని పాఱిపోవ కెట్లు నిలువఁ గలను?” అని యాగాడిద బదులుపలుకఁగా మరల జంబుకము “నీ విదివఱకెన్నఁడు సింహముం జూచియుండని కతమున నట్లు భయపడితివి. సమీపించి నమస్కరించినచో నాతఁడు దయాహృదయుఁడై కాపాడును. అది యెఱుఁగక నీవు రాజాశ్రయముఁ బోఁగొట్టుకొంటివి.

స్నేహభావమున నీకు మేలుసేయఁ బోఁగా నాయత్నము ఫలింపదయ్యెను. శ్రేయస్కరమగు యత్నమునకు బహువిధములై న విఘ్నములు కలుగుచుండును. రాజాశ్రయమువలన నెన్ని యైన మేళ్లు జేకూఱునుగదా!” యని ప్రియాలాపములు పలుకుచున్న గోమాయు వచనములకు లోఁబడి యాగార్ధభ మిట్లనెను.

“నీవు నాకు మిక్కిలి ప్రియసఖుఁడవై నాకు మేలు గూర్పఁదలపెట్టితివి. నీ వన్నమాట లన్నియు నిజము. తిండి చాలక బాధపడుచుండుట కన్న దొడ్డరాజునకు సేవకుఁడనై యొక్కదినము జీవించినను జాలును.”

ఇట్లని నమ్మకముఁ బ్రకటించియున్న యాగార్ధభముం దోడుకొనిపోయి మృగరాజు ముందట నిలిపి జంబుక మిట్లనియె. “ఈతని నమ్మించి తోడితెచ్చితిని. ప్రియభృత్యునిగాఁ

జూచి యాతని మన్నింపఁదగును." అని పలికి దూరముగాఁ దొలఁగిపోయెను. సింహమును మెలవున నా గాడిదను బట్టుకొని చంపివైచెను."

ఆ విధమున రెండవమాఱు నీకుఁ జిక్కుటకు నేను బుద్ధిలేని గాడిదను గాను. ఈపాటికి స్నేహము చాలించి ప్రియాంగన కడకు దయచేయవచ్చును." అని బలివర్ధనుఁడు పలుకగాఁ జింతాక్రాంతుఁడయి సిగ్గుపడుచుఁ గ్రకచుఁడు జలమధ్యమునకుఁ బోయెను. కావున మనము మెలకుఁవ గలిగి వర్తింపక యుద్ధమే ముఖ్యమని యెంచిన విజయ మపజయముగా మాఱి లబ్ధనాశము సంభవింపవచ్చును.

"ధర్మముఁ దలపోసి రాజునకుఁ బ్రియమా, యప్రియమా? యని యాలోచింపక సత్యవాక్కులు కొంచెము పరుషముగా నున్నను జెప్పఁగలిగినవాఁడే యుత్తముఁడు. అట్టివాఁడే రాజునకు నిజమైన మిత్రుఁడు. మిత్రులను, సేనను, రాజ్యమును, దన్ను, కీర్తిని యుద్ధమునకు సిద్ధపడి సందేహ డోలికయందుఁ బడద్రోయ వివేకవంతుఁ డెవడు తలపోయును?" నావుడుఁ జిత్రవర్ణు 'డట్లైన ముందే యేల యీసంగతిఁ చెప్పవైతి' వని యడిగెను.

దానికి మంత్రి నామాట నీవు తుదివఱకు వినవైతివి గాదా! అపుడైన నీ యుద్ధారంభమునకు నేను సమ్మతింపలేదు. అది యటుండనిమ్ము. ఈ హంసల రాజగు హిరణ్యగర్భుడు సంధిజేసికొనఁదగు సకల సుగుణములు గలవాడు. కాని విరోధింపఁ తగిన వాఁడు కాడు.

ఇట్లు దూతయగు బకము చెప్పఁగా విని చక్రవాకము 'నీ విక వెడలుము. అనంతర విషయములు దెలిసికొని మరల రావచ్చు' నని యాతని బంపించి హిరణ్యగర్భునితో నిట్లనెను.

"రాజా! మనమిపుడు సంధి గావించుకొనుటయే యుక్తము. శత్రుమంత్రి గ్రద్ధ చెప్పిన దిదియే కదా! జయగర్వమున నాతఁడు వెంటనే మంత్రిమాటలు మన్నింపకపోవచ్చును.

మహాబలవంతుఁడు, సింహళద్వీపాధిపతియు నగు సారసము మనమిత్రుఁడుగదా! ఆతనికి జంబూద్వీపముఁ పై గోపము కలిగింపఁవలయును. బలవంతులతోఁ జేరి సంచరించుచు శత్రువులకుఁ బీడ కలిగింపవలయును. బలవంతులచే నట్లు పీడింపఁబడిన శత్రువు తనచే విజితులైనవారితోనైన సంధిఁజేసికొనుట కీయకొనును. నావుడు రాజహంస యామాటల కంగీకరించి విచిత్రమను పేరుగల బకమున కొక రహస్య లేఖ వ్రాసియిచ్చి సింహళద్వీపమునకుఁ బంపెను.

అచట దీర్ఘదర్శి చిత్రవర్ణునితో మరల నిట్లు పలికెను. "ప్రభూ! మేఘవర్ణుఁ డచటఁ జాలకాల ముండెను గదా! రాజహంస సంధిచేసికొనఁదగు సుగుణములు కలవాఁడైనదియుఁ గానిదియు నాత డెఱుంగును. నావుడు రాజాతనిఁ బిలిచి

“హిరణ్యగర్భుండెట్టివాడు? ఆతని మంత్రి చక్రవాకము స్వభావము నేపాటిది?” యని ప్రశ్నింప వాయసము హిరణ్యగర్భుడు ధర్మరాజునకు సాటివచ్చు గుణవంతుడు. చక్రవాక మునకు సాటిరాఁదగు మంత్రులు లోకమున నరుదు’ నావుడు మయూర మిటులనియె.

“అంతటి సమర్థులైనచో నీవారాజు నెటులు వంచింపఁ గలిగితివి?” అను ప్రశ్నకు వాయసము నవ్వి యిటులనియె, “ప్రభూ! నమ్మినవారిని వంచించుటలో విశేషమేమి కలదు? ఒడిలో సుఖ నిద్రగాంచిన వానిఁజంపుటయు నొక పౌరుషమే యగునా? చక్రవాకమంత్రి నన్నుఁ జూచిచూడకుండఁ గనే కనిపెట్టెను. కాని యాశ్రితవత్సలుఁడగు నారాజాతని మాటలు వినక నన్ను నమ్ముటవలన నేను వంచింపఁ గలిగితిని. తనవలెనే యెదుటి వారును నిష్కపటులని నమ్మువారు ధూర్తులచే మోసగింపబడిన బ్రాహ్మణునివలెఁ జెడిపోవుదురు. నీ కాకథ వివరించెదను; వినుము.

ధూర్తులచే వంచింపఁబడి యజ్ఞమేషమును వదలుకొన్న బ్రాహ్మణుని కథ

గౌతమారణ్యమందలి యొక విప్రుఁడు యాగముచేయఁ గోరి గ్రామాంతరము నకుఁబోయి యొక్క ఛాగమును గొనెను. దాని నాతఁడు బుజముపై నిడుకొని తీసికొనిపోవుచుండ ముువ్వురు తుంటరులు చూచిరి. ఈ ఛాగము మిక్కిలి బలిసియున్నది. దీనినే యుపాయముననయిన నపహరింపఁ గలిగినచోఁ జక్కగాఁ దినవచ్చును. అని యాలోచించి యాబ్రాహ్మణుని మార్గమున ముువ్వురు మూడుస్థలముల దూరముగా నిలిచి యాతని రాక కెదురు చూచుచుండిరి.

అందొక ధూర్తుని యొద్దకు బ్రాహ్మణుఁడు రాఁగా నాతడుఁ వినయము మెఱయ “బ్రాహ్మణోత్తమా! సర్వము దెలిసిన మీరీ కుక్కను బుజము నెక్కించికొనుట న్యాయమా?” యని ప్రశ్నించెను. అపుడు విప్రుడు “ఛీ మూర్ఖుఁడా! యాగచ్ఛాగమును కుక్క యనుటకు నోరెట్లువచ్చె” నని యాతని ధిక్కరించి ముందునకుఁబోఁగా రెండవధూర్తుడును నాశ్చర్యము బ్రకటించుచు ‘బరమ పవిత్రులగు బ్రాహ్మణులు కుక్కను మోసికొనిపోవుట ఘోర’ మని యాబాపనితోఁ బలికెను.

అపు డావిప్రుఁడు కొంచెము సంశయించి మేక నొకసారి క్రిందికి దింపి పరిశీలించి చూచి ‘కుక్క కా’ దనుకొని మరల బుజముపై నుంచుకొని పయనము సాగించెను. దుష్టుల వాక్యములు విన్న వివేక వంతులకును నొకపుడు నిజముగా మతిచలించును. అట్టిమాటలను నమ్మియొకపుడు చిత్రకర్ణుణివలె మరణముగూడ నొందఁగలరు. నీకాకథ తెలుపుదును వినుము.

దుష్టుల మాటలువిని, నమ్మిచెడిన లొట్టియ కథ

ఒక వనమందు మదోత్కటమను సింహము నివసించుచుండెను. దానికిఁ గాక వ్యాఘ్రజంబుకములు ముప్వురనుచరులు. వారు వనమునఁ దిరుగుచు సార్థమునుండి తప్పిన యొంటె నొకదానిం జూచి 'నే వెచటినుండి వచ్చితి?' వని యడుగ నదితన వృత్తాంతము వివరించెను. వారు దానిని సింహమునొద్దకుఁ గొనిపోయి దర్శనము చేయింప సింహము దాని కభయ మిచ్చి, చిత్రకర్ణుఁడని పేరిడి తన పరివారమున నుండ నియమించెను.

ఇటులుండఁ గొన్నిదినములైన పిమ్మట నొకనాఁడు సింహమునకు శరీరమున ననారోగ్యము కలిగి, వేటకుఁ బోవలేక పోయెను. అందులన నెవ్వరికి నాహారము దొరకలేదు. అపుడు కాక వ్యాఘ్రజంబుకములు రహస్యమున నిటు లాలోచించెను.

'ఈచిత్రకర్ణుని మనరాజు చంపునటులు చూడవలయును. కంటకాదులఁ దిను నీతని వలన నుపయోగ మేమికలదు?' అని కాకము పలుక వ్యాఘ్రము 'మన ప్రభు వీతని ననుగ్రహించి యభయమిచ్చి స్నేహముతో నుండగా నీతని జంపించుట యెట్లు సాధ్యమగు' నని ప్రశ్నించెను. దానికి కాక మిటులు పలికెను. "మన ప్రభు విపు డాహారములేమిఁ గృశించి యున్నాడు. తిండికొఱకెట్టి పాపమునకై న నొడిగట్టఁ గలడు. ఆకలి గొనియున్న స్త్రీ తన పుత్రునైన విడిచి వైచును. ఆకలిగొని పాము తన యండములనే భక్షించును. క్షుధార్తులయిన నరులు కరుణాహీనులై ఏపనియైనఁ జేయుదురు."

ఆమాటల ప్రకార మంగీకరించి యవి సింహము దగ్గఱకు వెడలెను. సింహము వానిం జూచి 'యాహారమేమైన దొరకెనా?' యని యడుగఁ "బ్రభూ! అల్పులమగు మే మెంత యత్నించినను గొంచమైన దొరకలేదు." నావుడు 'నిఁక బదుకుట కేమిమార్గ' మని సింహ మడుగ 'స్వవశమందున్న యాహారమును విసర్జించుట చేత నీవిధముగ సర్వనాశన పరిస్థితి సంభవించినది' అని కాకమనెను. 'స్వాధీనమైన యాహార మేమి కల'దని సింహ మాశ్చర్యముతో నడుగఁ కాకి 'చిత్రకర్ణుఁడే యా యాహార' మని పలికెను.

దానికి సింహము చెవులు మూసికొని "ఈతనికి నే నభయమిచ్చి చేరఁదీసితిని. భూదానము కాని, సువర్ణ దానము గాని, గోదానాన్నదానములుకాని యభయ ప్రదానమునకు సాటిగావు. అట్టి యభయ దానము నెట్లు భంగ పుచ్చఁగలను? సర్వకామములు నొసఁగు నశ్వమేధయాగముకంటె శరణు జొచ్చిన వారినిఁ గాపాడిన నెక్కువ ఫలము గలుగును" అనెను. సింహము మాటలకు మరలఁ గాకమిట్లు పలికెను.

“ఈతని మీరు చంపనక్కఱలేదు. అతడు తన దేహమును తనంతటఁ దానొసఁగునట్లు మేము చేయగలము. ” నావుడు సింహమేమియు బదులుపలుకఁ జాలక యూరకుండెను. అది యవకాశముగాఁగొని కాకము వ్యాఘ్రజంబుకములతో నొక కుట్ర పన్నెను.

లొట్టియకడకేఁగి కబురులు చెప్పి దానితో నామూఁడును సింహముదగ్గఱకు జేరెను. అపుడు కాకము “ప్రభూ! మేమెంత యత్నించిన నించుకేని యాహారము దొఱకదయ్యె. మీరా బహుదినములనుండి యుపవాసమున మిక్కిలి డస్సియున్న వారు. కావున నిపుడు నామాంసము స్వీకరించి కొంతయాకలి దీర్చు కొనుడు. మంత్రులకుఁ బ్రజావర్గమంతటికిఁ బ్రభువే మూలము. నరులకు సమూలములయిన తరువులేకదా ఫలము లొసంగఁ గలవు!” అని వినయము మెఱయఁ బలికెను.

దానికి సింహము “ఇట్టి మహాపాపముఁజేసి జీవించుట కన్న ప్రాణములు గోలుపోవుట మిక్కిలి శ్రేయస్క రము.” నావుడు జంబుకమును నటులే ‘నాదేహ మాహారముగాఁ గొను’మని ప్రాధేయపడెను. సింహము దానికి నంగీకరింపలేదు. అనంతరము వ్యాఘ్రముకూడ ‘నాదేహము నుపయోగింపు’మని సింహమును గోర ‘నదియెంతమాత్ర ముచితముగా ‘దని సింహ మనెను.

పిమ్మట నెక్కుడు నమ్మకము కలిగి చిత్రకర్ణుఁడును ‘దప్పక నాదేహము భక్షించి యాకలిఁ బాపుకొను’ మని సింహమును వేఁడికొనెను. ఆపలుకులు విన్నతోడనె సింహము దానిపై నుఱికి దాని యుదరముం జీల్చివై చెను. సింహము తినఁగా మిగిలిన యాహారమును దృప్తితీర కాకవ్యాఘ్రజంబుకములు భుజించెను. కావున దుష్టవాక్కు లసత్యములైనను గొంత నమ్మకమో, సంశయమో కలిగింపకమానవు. పిమ్మట మూఁడవ తుంటరి బాహ్మణుని సమీపించి “స్వామీ! మీవంటి యుత్తము లిట్టి నీచపుఁ బనిజేయుట యేటి న్యాయ” మని ప్రశ్నించెను.

ఆపలుకులు విని బ్రాహ్మణుఁడు “నిజముగా నాకు మతి చెడినది. లేకున్న నందఱుఁ గుక్కయని పలుకుచుండ దానిని మేకఁయని యెట్లు నమ్ముదును? ఎవడో దుష్టుడు నాకీ కుక్కను మేఁకయని యంటఁగట్టినాడు” అని యాలోచించి యిక బుజముమై నున్న దానివంకఁ జూడకయే దాని నచట దిగవిడిచి, స్నానముచేసి యింటింకిబోయి కుక్కను ముట్టుకొన్న దోషముఁ బరిహరించు కొనుటకు గాయత్రిని జపించు కొనెను. ఆతుంటరులు తమనేర్పునకు మిక్కిలి సంతసించి మేఁకను గొనిపోయి కోసికొని మాంసముం బంచుకొని తినిరి. కావున నుత్తముడైనవాఁ డందఱు తనవలె యోగ్యులే యని నమ్మఁజనదు.”

అదియంతయు విని మయూరరాజు మేఘవర్ణునితో ‘నీవు శత్రుమధ్యమునఁ జిరకాలము వారిని నమ్మించి యెట్లు వసింపగలిగితి’ వని ప్రశ్నించెను. మేఘవర్ణుడు నిట్లు బదులు పలికెను, “స్వామికార్యము నిమిత్తముకాని, స్వప్రయోజనము కొఱకుగాని

చేయరాని పనియుండునే? మానవులు వంట వండుకొనుటకయి కట్టెలు దలపై నిడికొని మోయుచున్నారు గదా! వృక్షములఁ బడగొట్టుటకై నదీవేగము వృక్షపాదములు గడుగుచున్నదికదా! బుద్ధిమంతుఁడు శత్రువును శిరమునఁ దాల్చియైనను గార్యసిద్ధి నందఁ జూచును. కార్యసిద్ధికై కప్పలను మోచిన సర్పముకథ యొండుకలదు. నీకు దానిని వివరింతును వినుము.

కార్యసిద్ధి నిమిత్తము కప్పలను మోచిన సర్పము కథ

ఒక పాడువడిన యుద్యానవనమున వృద్ధసర్ప మొండు నివసించుచుండెను. దానికి మందవిషమని పేరు. అది మిక్కిలి ముదిసి యుండుటవలన నాహారము వెదకుటకైన శక్తిలేక యొక చెఱువు దగ్గఱఁ బడియుండెను. దానిం జూచి దూరముననుండి మండూకమొకటి "నీ వాహారము వెదకు కొనక యేల యిట్లు పడియుంటి" వని యడుగ నాసర్పము "మందభాగ్యుఁడ నగు నన్ను బలుకరించిన నీకు లాభమేమి? నీత్రోవను నీవు పొమ్మ"ని పలికెను. దానితో నాకప్పకు దాని వృత్తాంత మెఱుంగ మిక్కిలి కౌతుకము పొడమి సర్పమును బలవంతపెట్ట నది యిట్లు చెప్పఁదొడఁగెను. "ఓయీ వినుము. బ్రహ్మపుర వాసియు, మిక్కిలి శ్రోత్రియుఁడు నగు కౌండిన్యుని పుత్రుఁడు సకలసుగుణసంపన్నుఁడు, నిరువది వత్సరముల వయసువాఁడుఁ దైవవశమున నడవిఁలో దిరుగుచుండ నేను చూచి ఘాతుకస్వభావముచే వానిఁ గఱచితిని. సుశీలుఁడను పేరుగల యా బాలుఁడు వెంటనే మరణించెను. కుమారుఁడు మరణించుట జూచి కౌండిన్యుఁడు దుఃఖభారముచే మూర్ఛనొంది నేలపైఁబడి దొరలెను.

ఆపురమందలి బ్రాహ్మణులందఱు నావార్తనిని యచటఁ జేరిరి. అది యుచితము కదా! ఉత్సవ సమయముననను, దుఃఖకాలముననను, యుద్ధమందును, కఱవు కాలముననను, విప్లవము జరుగునపుడును, రాజద్వారమందును, మరణశకాలముననను నెవ్వఁడు దరిజేరునో వాఁడే నిజమగు బంధుగుడు.

అపుడు కపిలుఁ డను నొక గృహస్థుఁడు "ఓయీ కౌండిన్యా! వివేకము లేమించేసి యిట్లుదుఃఖించు చున్నావు. జన్మ కలిగినపుడే మరణమందఱకు వ్రాసిపెట్టఁ బడియుండ విచారమునకుఁ గారణ మేమి కలదు? సకల యోధులతోఁ గూడిన నరపాలు లందఱు నిపుడుండిరా? ఎందఱెందరో యెడఁబాటు నొందియున్నట్లీ భూమి నిలిచియుండి సాక్ష్యమిచ్చుట లేదా? శరీరమునకు క్షణక్షణము నపాయము పొంచి యుండును. సంపదలాపదలకు మూలము. కలయిక లెడఁబాటునకు హేతువులు. జనించిన దంతయు నశింపకతప్పదు. మంటికుండ నీటిలోఁ బెట్టినచోఁ గరగి పోవునటులు శరీరము క్షణక్షణము నాయువు తఱుగుటచేత క్షీణించిపోవు చున్నదని మానవు లెఱుంగఁజాలకున్నారు.

ప్రతిదినము మృత్యు దేవత మనలను మరణశిక్షనొంది వధ్యస్థానమునకుఁ గొంపోఁబడువానివలె సమీపించుచున్నది. యౌవనము, రూపము, సంపదలు, జీవితము, ప్రియుల పరిచయము నివియన్నియు ననిత్యములు. కావున వీనిపైఁ బండితుఁడు తగులాటము వహింపడు. మహా ప్రవాహమున రెండు దుంగలు కొట్టుకొనిపోవుచు నొకమారు కలిసికొని యట్టె విడిపోవుచుండునట్లు మానవులు నొకమాఱు గలిసికొనుచుందురు. అట్లే విడిపోవుచు నుందురు. మఱియు నొక బాటసారి యలసి కొంతసేపాక చెట్టునీడను బరుండి విశ్రమించి వెడలిపోవును. అట్లే ప్రాణియు నొకచోట జనించి పనితీరిన వెంటనే వెడలిపోవును. ఈ శరీరము పంచభూతముల సమ్మేళనమునుండి జనించినది. మరల విడి పంచభూతములఁ గలియుచున్నది. దీనికై విచారించుట యవివేకము. ప్రాణి బంధువర్గముతో నెన్నివిధముల సంపర్క మేర్పఱచుకొను చున్నాఁడో యన్ని విధముల హృదయమున శోకశంకువులు నాటుకొనుచున్నవాఁడే యగుచున్నాడు. అపథ్యభోజనమువలె ప్రియసమాగమములు తాత్కాలికానందము గలిగించినను మనకవి యతిదారుణములై పరిణమించును. నదీప్రవాహములు ముందునకే కాని వెనుకకు మరలనట్లు రేలుంబవళులు మానవుల యాయువును దీసికొని ముందునకు బోవుచునే యుండును. వియోగమను కత్తితోఁ గోయఁబడిన మానసమున కేమందును బనికిరాదు. కావుననే సత్సంగమునైనను విబుధులు కాంక్షింపరు. సగరాది చక్రవర్తు లెంతటిపుణ్యము లొనరించినను వారికిని మరణము తప్పలేదు. నరలోకమున జనించుటకు గర్భములోఁ బడినది మొదలు ప్రాణులు మృత్యువు నొద్దకు విరామము లేక పయనించుచునే యుండును. కావున నవివేకమూలమగు విచార ముడిగి సంసారముఁ జూచికొనుము.” అని యుపదేశించెను.

ఆ మాటలు విని, నిద్రమేలుకొన్న వానివలెఁ గౌండిన్యుఁడు లేచి యిటు లనెను.

“నా కిఁక నీగృహనరకము చాలును. వనవాసమునకుఁ బోవుదును.” అది విని కపిలుడు “రాగముతో గూడిన వారికి వనముననైనఁ గష్టములు రాకమానవు. గృహమందుండియుఁ బంచేంద్రియములఁ గట్టుదిట్టము చేసికొన్న నదియే తపస్సగును. రాగములేనివాఁడై; కుత్సితకర్మలలో నడచుకొనని వానికి గృహమే తపోవనము. ఏ యాశ్రమమందున్నను ఎట్టి దుఃఖము నొందినను ధర్మమును విడువరాదు. సకల ప్రాణులయందును సముఁడై యుండవలయును. ఆశ్రమము ధర్మకారణము కాఁజాలదు. బ్రదుకుట కొఱకు మాత్రము తిండియు, సత్సంతానము కొఱకు మాత్రము సంసారమును, సత్యమాడుట కుపయోగింపఁబడు వాక్కును నెవరికుండునో వారు కోటలనై న దాటగలరు.

“ఆత్మయే నది. ఇంద్రియనిగ్రహమే పుణ్యతీర్థములు. సత్యమే జలము. శీలమే గట్టులు. దయ కెరటములు. అట్టి యాత్మనదియందు మునిఁగిననే మానసము పరిశుద్ధి నొందును గాని నదీస్నానము లెన్ని చేసినను లాభములేదు. జన్మము, మరణము, వ్యాధి,

వేదన మున్నగు నుపద్రవములతో గూడిన సంసారము విడిచిన వానికి సుఖముగలుగు” నన, గౌండిన్యుఁడా మాటల కామోదముఁ జూపెను. కాని “నేఁడు మొదలు కప్పలను మోయు” మని నన్ను శపించెను.

కపిలుఁడు “నీ విపుడు క్రోధముచే సహనములేక యుంటివి. ఎవరితోను స్నేహము పెట్టుకొనరాదు. అట్లుండ లేకపోయినచో మంచివారితో మాత్రము మైత్రి చేయదగును. అందలి దోసమున కదియేమందు. ” నావుడు గౌండిన్యుడు “యథావిధిగా సన్యాసముఁ దీసికొనెను. నాఁటినుండి యా బ్రాహ్మణ శాపవశమున గప్పల మోయుటకై యిట నున్నాఁడ” నని సర్పము పలికిన మాటలు విని యాముదుసలి కప్ప తమ ప్రభువగు జాలపాదునొద్ద కేఁగి యా సంగతి దెలిపెను.

అంతట జాలపాదుఁడు సర్పము దగ్గఱకువచ్చి దాని వీపుమీఁది కెక్కెను. పామును దానిని మెచ్చికొని విచిత్రమగు రీతుల నడిచెను. మరునాఁడు కదలలేకుండ నున్న యాసర్పమును గాంచి మండూకరాజు “నీవిపుడు బాగుగా నడుచుటలే దే” మని యడుగ నది “తిండి లేనందున బలహీనముగా నుంటి” ననెను. ‘నీయాకలికి సరిపడునట్లు మండుకములఁదిని చక్కగా మోయుచుండు’మని రాజాజ్ఞాపించెను. మహా ప్రసాదమని పలికి నాటినుండియు దినదినము వలయునన్ని కప్పలఁ దినుచుఁ గొంతకాలమునకుఁ గప్పలన్నియుఁ జెల్లిపోఁగా నాసర్పము తుదకు మండూకరాజును గూడ భక్షించెను. కావున స్వామికార్యార్థ మెట్టి యిడుమలనైన భరించుట కష్టముకాదు. ఇపు డాసంగతులు చర్చించి ప్రయోజనము లేదు. హిరణ్యగర్భుఁడు సకల విధముల సంధికిఁ దగినవాడు. నాయభిప్రాయ మిది” యని మేఘవర్ణుడు వివరించెను.

చిత్రవర్ణుఁడన్నియు విని “నీ కీవిచారమేల? ఆతఁడు నాచే జయింపడిన కారణమున నాకు సేవచేయుట కంగీకరింపవలయును. లేదేని విగ్రహము తప్ప”దని పలుకుచుండగా జంబూద్వీపము నుండి చిలుక వచ్చి యిటు లనెను.

“ప్రభూ సింహళదేశమున కధిపతియగు సారసరాజిపుడు జంబూద్వీపమును ముట్టడించి యున్నాఁడు.” ఇట్లు చెప్పఁగాఁ గంగారుపడి ‘ఏమైనది చెప్పుచెప్పు’మని రాజు తొందరపెట్టఁగాఁ జిలుక మొదటివలెనే మరలఁ బలికెను.

గ్రద్ద తనలో “ఓచక్రవాకమంత్రీ! సర్వజ్ఞా! లెస్సయైనపని చేసితివి” అని తలపోయుచుండెను. “సరే! కానిండు. అచటికే వెడలి వానిని సమూలముగ నున్మూలింపఁ గల’ నని రాజు పలుక దూరదర్శి నవ్వి యిటులనియె. “శరత్కాల మేఘముఱిమినట్లు వృథాగా గర్జింపరాదు. మహాపురుషులైన వారు పరులకుఁ దమమనసులోని యర్థానర్థములు వెల్లడింపరు. మఱియు నొకసారి పదిమందితో యుద్ధము పెట్టుకొనరాదు. ‘బలవంతమైన సర్పము చలిచీమలచేత జిక్కి చావదె?’ కావున నీతనితో సంధిచేసికొని మఱియేగుట మంచిది. కాకున్న మన వెనుకనే యాతఁడు విజృభింపవచ్చును. కేవలము

గోపమునకు లొంగి యథార్థమెఱుఁగకుండువాఁడు పరాభవమొంది పశ్చాత్తాప పడవలసివచ్చును.

కామము, క్రోధము, లోభము, మోహము, గర్వము, అసూయ యనునవి మానవునకు శత్రువుల వంటివి. ఇవియే అరిషడ్వర్గ మనబడును. వీనిని విడువ గలిగిన నరుఁడు తప్పక సుఖమొందఁగలడు" అను మంత్రిపలుకులకు రాజు "ఆర్యా! ఇది మీ నిశ్చయము." నావుడు మంత్రిమరల నిట్లు పలికెను "అవును పరమార్థము స్మరించుటయు, మంచి చెడ్డల తర్కమును, వివేకము తోడి నిశ్చయము, రహస్య గోపనము, దృఢబుద్ధి ఇవి మంత్రికుండఁదగు ముఖ్యగుణములు. మఱియు నేపనియుఁ దొందరపడి చేయరాదు. దూరాలోచన లేకున్న నాపదలు తప్పవు. యుక్తాయుక్తములు గుఱితించి పనిచేయువానిని సంపదలు వాని గుణములపట్ల నాదరముగలవై స్వయముగా వరించును. వేయేల ప్రభూ! నామాటలయం దేమైనఁ దమకు గౌరవ మున్నచోఁ దప్పకసంధి గావించుకొని వెడలుట మేలు. కార్యసాధనమునకు నాలుగుపాయములు శాస్త్రములలోఁ జెప్పఁబడి యున్నను గడమవి మూఁడును కేవలము నామ మాత్రములు. కార్యసిద్ధి ముఖ్యముగా సామము నాశ్రయించి యుండును. ఇంకను విశేష మేమన నీరాజహంస ధర్మజ్ఞుడు. ఆతని మంత్రి సర్వజ్ఞుడు. మేఘవర్ణుని మాటలవలన, నాతఁ డొనరించిన పనులను బట్టియు నీవిషయము స్పష్టమగుచున్నది." అను మంత్రిమాట లాలించిరాజు "ఆర్యా! ఇకఁ జర్చ యవసరములేదు. నీమనసునకు వచ్చినట్లుగావింపుము. నావుడు మంత్రి 'సరే! ఉచితరీతి నాచరింత'మని పలికెను.

రాజు, మంత్రియుఁ దమ తావులకుఁ బోవఁగా నావిషయమును గమనించిన గూఢచారియగు కొంగ హిరణ్యగర్భునొద్దకు సత్వరముగా వచ్చి "ప్రభూ! సంధి సమకూర్చుటకై మహామంత్రి గృధ్రము మన సమ్ముఖమునకు వచ్చుచున్నాఁ"డని తెలిపెను. అపుడు రాజహంస తనమంత్రితోఁ "మరల నేదైన గపటము పన్నఁదలఁచి వచ్చుట లేదుగదా" యన మంత్రియగు సర్వజ్ఞుఁడిటు లనియెను.

"ప్రభూ! ఈవిషయము సందేహింపఁదగ్గదికాదు. ఏలన దూరదర్శి గొప్పయాశయము గలవాడు. ఒకపుడు గొంచెమైన ననుమానింపక యుండుటయు, వేఱొకపు డన్నిఁటియందు సంశయించుటయు నను నవి మందమతుల లక్షణములు. రాత్రి నక్షత్రములు సరసులోఁ బ్రతిఫలించినపుడు, హంస యవి తెల్ల దామరలని భావించి వానిఁజేరఁబోయి తాను వంచింపఁబడినట్లు క్షణములోఁ దెలిసికొనును. ఆహంస పవలు చెఱువులోని తెల్ల దామరలను జూచి యవి నక్షత్ర ప్రతిబింబములుగా భావించి వానిఁగొఱుక దలఁపక విడుచును. అట్లే వివేక హీనుఁడసమ యమునను సందే హించు. సందేహాస్పదమగు విషయము వెంటనే నమ్మును. దుర్జనులవలనఁ గలఁతనొందిన మనసు గలవాఁడు సుజనులనుగూడ నమ్మక పోవును. పాయసము దినఁబోయి చేయి కాలిన బాలుఁడు పెరుగును గూడ నూదికొని తినును.

కావున నో ప్రభూ! ఆతని గౌరవించు నిమిత్తము రత్నాదికములగు కానుకలు సిద్ధపఱుపవలయును.” నావుడు రాజందులకుఁ దగునేర్పాటులు గావించెను. మంత్రి చక్రవాకము దుర్గద్వారమునొద్ద కెదురేఁగి గృధ్రమును సత్కరించి తీసికొని వచ్చి రాజదర్శనము చేయించెను. గృధ్రమును రాజునకు వందనము చేసి యాతని యనుమతిపై నుచితాసన మలంకరించిన యనంతరము చక్రవాక మిటు లనియె.

“ఈరాజ్యమంతయును మీయదియకాభావించి స్వేచ్ఛగా ననుభవింపుఁ’ డన రాజహంసయు నటులే పలికెను. ‘దూరదర్శి యామాటల కిటులు బదులు పలికెను. మీ వచనము లుత్తములకుఁ దగినటు లున్నవి. లుబ్ధుని ధనముచేతను, సాధుపురుషుని నమస్కా రమాత్రము చేతను, మూర్ఖుని మాటకుఁ గాదనక యూరకుండుటచేతను, దత్త్వార్థముచేఁ బండితుని వశపఱచు కోవచ్చును. సద్భావముతో మిత్రుని, నుత్సవములచే బంధువులను, దానమానములచే స్త్రీలను, భృత్యులను దయచే నితర జనులను నాకర్షింపవచ్చును. కావున నాతనితో నిపుడు సంధి చేసికొనుట మేలు. రాజు చిత్రవర్ణుడు మహాప్రతాపవంతుడు”. నావుడు రాజహంసఁ మంత్రి చక్రవాకము “సంధిచేసికొను మార్గమును గూడ సెలవిండు” అని పలికెను. రాజహంస ‘సంధి ప్రకారము లెన్ని?’ యని యడిగెను. దానికి గృధ్రమిటులు పలికెను.

“బలవంతుడు దాడి జేసినపుడు ప్రతిక్రియ సాధ్యము గానిచోఁ గాలయాపనకొఱకు సంధి చేసికొన వలయును. కపాలము, ఉపహారము, సంతానము, సంగతము, ఉపన్యాసము, ప్రతీకారము, సంయోగము, పురుషాంతరము, అదృష్టనరము, ఆదిష్టము, ఆత్మాదిష్టము, ఉపగ్రహము, పరిక్రియము, ఉచ్ఛిన్నము, పరభూషణము, స్కంధోపనేయము నని సంధి పదునారు రకములు.

సమమైన తాహతు గలవారు చేసికొన్నది కపాలసంధి యనఁబడును. ధనమొసఁగి కూర్చుకొనుసంధి యుపహారమనఁ బడును. కొమార్తెల నొసఁగి చేసికొనుసంధి సంతాన సంధి. సత్పురుషులతో స్నేహపూర్వకముగా జేసికొనునది సంగతసంధి.

ఈ సంగతసంధి యుత్తమమూ. జీవితాంతము వఱకుండునది. ఆపదలందు, సంపదలందు సమానార్థ ప్రయోజనములు గలిగి యేకారణముల వలనను తెగిపోక యీసంధి చక్కఁగా నదుకఁబడిన సువర్ణమువలెఁ బ్రకాశించును.

తన కార్యసిద్ధి కొఱకుఁ జేసికొనుసంధి యుపన్యాస మనఁబడును. నేనిదివఱ కీతని కుపకారముచేసితిని. ఈతడు మరల నాకుపకరించునని చేసికొనుసంధి ప్రతీకార మన నొప్పును. రామ సుగ్రీవులసంధి యిట్టిదే. ఏకప్రయోజనము గలక్రియ నుద్దేశించి చేసికొనఁబడు సంధి సంయోగ మనఁబడును. ‘మన యోధుల మూలమున మన మీయర్థము సాధించుకొంద’ మని పణము నిర్దేశించు కొనఁబడిన సంధి పురుషాంతరము

నాఁబడు. నీయొక్కని చేతనే నాపని సాధింపఁ బడవలయునని శత్రువు పణమిడి చేసికొన్న సంధిపేర దృష్ట పురుషాంతరము.

భూమిలోఁ గొంతభాగము పణముగానిచ్చి చేసికొన్న సంధి యాదిష్టమనఁదగు. స్వసైన్యముచేఁ జేసికొనఁ బడినది ఉదాహృతము. ప్రాణరక్షణముగోరి, సర్వస్వము నొసఁగి చేసికొనుసంధి యుపగ్రహము. కోశములో నొకభాగము గాని, యర్థ కోశము గాని, సర్వకోశము గాని యొసఁగి శిష్టరక్షణమునకై చేసికొనుసంధి పరిక్రమ్య మను పేరఁబరగును. సారవంతములగు పొలములొసఁగి కావించుకొనుసంధి కుచ్ఛిన్నమని పేరు. భూమిలోఁ బండు పంటయంతయు నొసఁగి చేసికొనునది పరభూషణసంధి. ఫలించినదానిలో భాగమిచ్చి చేసికొనుసంధి స్కంధోపనేయము" అని ఇట్లు సంధిభేదములు వివరింప రా జిటు లనియె.

"ఈఁతడు మిత్రుఁ డాతఁడు శత్రుఁడని యల్పులు దలఁతురు. ఉదారచరితులగువారు వసుధయంతయు నొకే కుటుంబమని నమ్ముదురు. పరవనితలయందు మాతృ భావము, పర ద్రవ్యమందులోష్ఠబుద్ధి, సర్వభూతములందాత్మ భావన గలుగువాఁడే పండితుడు. మీరు మహానుభావులును బండితులును. కావున మే మేమిచేయవలయునో యానతిండు." నావుడు గృధ్ర మిట్లనెను.

"ఆధివ్యాధులచేఁ బీడితమై నేఁడో, రేపో నశించు శరీరము నిమిత్తము ధర్మము దప్పుట కెవ్వఁ డోపును. ప్రాణుల జీవితము కదలుచున్న నీటిలోని చంద్రునివలె గడు జపలము. ఈసంగతి గుర్తించి యనుక్షణము ధర్మమాచరింపవలయును. సంసార మెండమావులఁ బోలె క్షణభంగుర మని యెఱిగి; ధర్మము కొఱకు, సౌఖ్యము కొఱకు, సుజనులతో స్నేహము చేయవలయును. కావున నాయభీష్టము వినుఁడు.

'వేయియశ్వమేధములు' నొక్కసత్యము వేఱు సిబ్బెలలో నిడి తూచిన సత్యమే యధికముగ నుండెను. కావున సత్యమను దివ్యమను బురస్కరించుకొని యుపహారమనుసంధిఁ జేసి కొనుట యుక్తము.' నావు డు సర్వజ్ఞుఁడును దాని కంగీకరించెను.

రాజపుడు వస్త్రాద్యలంకారములు కానుకగానిడి పూజింప మిక్కి లి సంతసించి గృధ్రము తనతో సర్వజ్ఞునిఁ దోడుకొనిపోయి మయూర రాజదర్శనము చేయించెను. చిత్రవర్ణుఁడును గ్రద్దమాటలు విని సర్వజ్ఞుని మిగుల నాదరించి సంధి నంగీకరించి పంపెను. అనంతరము దూరదర్శి "ప్రభూ! నేటికి మన కోరిక నెఱవేఱినది. ఇపుడు స్వస్థానమగు వింధ్యాచలమున కేఁగుదము." అని రాజుతోఁబలికెను. పిమ్మట నందఱు వింధ్యపర్వతమునకుఁ బోయిరి.

వారు వింధ్యగిరికిఁ చేరుటకుముందే హిరణ్యగర్భుఁడంపిన దూతలు శీఘ్రముగా నరిగి సింహళ ద్వీపాధిపతితో "సర్వోపద్రవ కారణమైన యుద్ధము నుజ్జగించి చిత్రవర్ణునితో

సంధి గావించు కొనుటయైనది. మేము కలిగించిన శ్రమకు మన్నించి మీరును సంధి కొడంబడుట మంచిది. మీ దండయాత్రవలన మాకు సంపూర్ణ ఫలితము చేకూఱినది. మీరిష్టపడినచోఁ జిత్రవర్ణుని మంత్రి దీర్ఘదర్శియుఁ దమరాజును దప్పక సంధికొప్పించును. ఇది మాప్రభువగు హిరణ్యగర్భుని సందేశము" అని విన్నవించిరి.

ఇదేవిధమునఁ జిత్రవర్ణుని కడనుండియు సంధికై రాయబారము రాఁగా సింహళద్వీపాధిపతి దానికంగీకరించి, చిత్రవర్ణునిచే సత్కరింపబడి తన బలములతో స్వస్థానమున కేఁగెను. ఈ విధముగా సంధిగావించుకొని యంద రానందమొందిరి."

ఈవిధముగాఁ దెలిపి విష్ణుశర్మ "రాజకుమారులారా! ఈనీతిశాస్త్రముఁ బఠించిన వారికి సకల విషయములు గరతలామలకము లగును. అట్లు పఠింపనివా రెంతటి వారయ్యును గార్యసమయములందుఁ గర్తవ్యతా విమూఢులై యనర్థముం జెందుదురు. ఈవిధముగామీకు ధర్మార్థ కామసాధనము లైన యనేకకథలు వినిపించితిని. కావున నిందలి నీతులు మనసునఁ బదిలపఱచుకొని దృఢచిత్తులై రాజకార్య నిర్వహణాదు లందు నిత్యవిజయముం గాంచి ధర్మపరిపాలనచేఁ బ్రజల కానందముఁ గూర్పఁ బూనుకొనుఁడు" అని బోధించెను.

అదివిని యారాజకుమారు లాగురునకుఁ బ్రణామములు చేసి "మహాత్మా! పరుసవేది యొకించుక తాఁకిన మాత్రమున సకలలోహములుఁ బరిశుద్ధ హేమమయము లగును. అటులే మీవాగమృత ధారలచే మాహృదయములు మిక్కిలి పరిశుద్ధములై నవి. మాకు సంపూర్ణ నీతివివేకము గలిగినది." యని పలికి యాతనికడ రాజనీతి శాస్త్రంబు లభ్యసించుచుండిరి.

అనంతర మొకనాఁడు సుదర్శన మహారాజు విష్ణుశర్మను రావించి "ఆర్యా! మీవలనఁ గుమారు లత్యంతప్రజ్ఞాధురీణులైరి. ఇకమీద నాయుధ విద్యా భ్యాసంబుఁ జేయించెదను. అనుమతి యిండు" అని పలికి, లెక్క లేని గోహిరణ్యాదికములను విష్ణుశర్మకుఁ గానుకగా నొసఁగి సత్కరించి పంపెను.

సుదర్శనుడు బహు కాలము రాజ్యమేలి వానప్రస్థాశ్రమమునకుఁ బోయిన యనంతరము నీతివిదులగు నాతని కుమారు లనవరతము విష్ణుశర్మ బోధనలు స్మరించుకొనుచుఁ జాలకాలము సకల శ్రేయస్కరముగా రాజ్యపరిపాలనముఁ గావించిరి.

తప్పొప్పులు

ప్రథమ భాగము

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
20	2	బొట్టపోసికొవ	బొట్టపోసికొన
25	3	వానలును	నావలును
28	3	మంధరుఁడు	మంథరుఁడు
35	5	వెల్లెక్కు	విల్లెక్కు
53	2	పణ్యస్త్రీలవలె	పుణ్యస్త్రీలవలె
53	11	మూఁఢు డెవ్వ	మూఢుఁ డెవ్వ
68	5	యాలోంచి	యాలోచించి
77	11	భవపు	భవనపు
84	3	ఆసిఁహము	ఆసింహము
93	13	రాజనకుఁ	రాజునకుఁ
95	19	దమకుఁడు	దమనకుఁడు
98	2	మనువింతురు	మనుభవింతురు
99	15	మిత్త్రభేదముఁ	మిత్రభేదముఁ

ద్వితీయ భాగము

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
9	3	మిొత్రొక్కుడుచే	మీత్రొక్కుడుచే
15	18	దర్శనార్ధము	దర్శనార్థము
17	13	జూటిన	జాటిన
29	10	యెటింగిందను	యెటింగింతును

39	3	సహాలను	సలహాలను
82	12	దనుకోని	దనుకొని
90	19	మాసనము	మానసము
91	4	కంపిజలుడు	కపిలుఁడు
100	11	లభ్యంత	లత్యంత

సరస్వతీ పవర్ ప్రెస్
రాజమహేంద్రవరము